తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

మే 2020, వెల రూ.5/-



వినరో భాగ్యము విష్ణుకథ...

- అన్నమయ్య







శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా 07-04-2020న
ఒంటిమిట్ట, శ్రీకోదండరామాలయంలో జరిగిన శ్రీసీతారాముల కల్యాణమహోత్సవ దృశ్యాలు.
కరోనా లాక్‌డౌన్ కారణంగా అర్చకులు ఏకాంతంగా ఈ కల్యాణం నిర్వహించారు.





# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।**
**పర్యాప్తం త్విద మేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-10వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అపర్యాప్తం= అపరిమితమైన; తత్= అది; అస్మాకం= మనయొక్క; బలం= సైన్యబలం; భీష్మాభిరక్షితమ్= భీష్మునిచే లెస్సగా రక్షింపబడునది; పర్యాప్తం= పరిమితమైన; తు= కాని; ఇదం= ఈ; ఏతేషాం= పాండవుల యొక్క; బలం= సైన్యబలం; భీమాభిరక్షితం= భీమునిచే జాగరూకతతో రక్షింపబడునది.

**భావం:** మన సైన్యబలం లెక్కింప వీలులేనిదిగా ఉంది. మనం పితామహుడైన భీష్మునిచే సంపూర్ణంగా రక్షింపబడుతున్నాం. కానీ, భీమునిచే జాగరూకతతో రక్షింపబడుతున్న పాండవసైన్యం పరిమితంగా ఉంది.

## ధరణిసమస్తము దైవాధీనము

తక్కినవెల్లా తహతహలే
నిక్కపు శ్రీహరి నిజమగు తెలివీ ॥

ధరణి సమస్తము దైవాధీనము
పొరి ప్రాణుల నేర్పుల బడవు
వరుస తమంతనే వచ్చినవెల్లా
హరి కరుణని ముదమందుట తెలివీ ॥


కావలసిన పని కర్మాధీనము
వావిరి నది కడవగ రాదు
దావతి కుడువక తప్పుల పొరలక
భావము సంతసపరచుట తెలివీ ॥

పుట్టిన తనువులు భోగాధీనములు
అట్టిట్టని తెలియగరాదు
గట్టిగ శ్రీవేంకటపతి సేవే
నెట్టన నమ్ముట నిజమగు తెలివీ ॥

(సంపుటం - 15, సంకీర్తనం - 77)



భగవంతుడే సహజమైన, జ్ఞానమనే వెలుగు. సర్వానికి ఆత్మ అయిన శ్రీహరి నెరుగక, తక్కిన శాస్త్రాలను, కళలను ఎంత నేర్చినను అవి మనసులోని ఆరాటాలే గాని, వ్యర్థాలు. లోకం దేవుని సంకల్పానికి వశమైంది. జీవుల శక్తియుక్తుల వల్ల నడుచుట లేదు. జీవితంలో వచ్చిన సన్నివేశాలన్ని స్వామి దయ అని భావించి సంతోషించుట మంచిది. పూర్వకర్మఫలంగా వచ్చే పరిస్థితులను దాటలేం. ఆకలికి మించి భుజింపక, పాపాల్ని చేయక ఎల్లప్పుడూ సుఖంగా ఉండడమే నిజమైన తెలివి. దేవుడిచ్చిన శరీరాన్ని అతని సేవకే వినియోగించాలి. వ్యక్తిగతసుఖం కోసం వినియోగింపరాదు అని తెలియజేశాడు అన్నమయ్య.





# అంతర్యామికి అక్షర నీరాజనం

*– శ్రీ శివేగారి చిన్నికృష్ణ, 6300318230*

కలియుగవైకుంఠంలోని, శ్రీనివాసుని పాదాలచెంత దేదీప్యమానంగా విరాజిల్లుతూ అనేకానేక విషయాలు తెలియజేసే సప్తగిరి మాసపత్రిక నెల నెలా చదవడం అపూర్వ అనుభూతి. ఆధ్యాత్మికచింతన, మధురానుభూతి కలిగించి మనసు రంజింపజేసే భక్తిపూర్వకడోలికలు ప్రతి పేజీలోనూ పొందుపరిచే వైనం అద్వితీయం.

'సప్తగిరి' మాసపత్రిక ఒక్క తెలుగులోనే కాకుండా ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడం, సంస్కృతం భాషల్లో కూడా ప్రచురితమై అశేషంగా అందరి మన్ననలు పొందుతూ ఉండటం విశేషం.

పురాతన దేవాలయాల చరిత్ర, వైభవం, తిరుమల తిరుపతి అనుబంధఆలయాల ప్రత్యేక కథనాలు, దేశంలో ఇతర ప్రదేశాలలో ఉన్న ఆలయాల చరిత్ర ఎంతో వివరణాత్మకంగా తెలియజేస్తూ తిరుమల శ్రీవారి మరియు తిరుచానూరు అలిమేలుమంగమ్మ వారి నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, సంవత్సరోత్సవాల సమాహారంగా అద్భుతమైన చిత్రాలతో 'సప్తగిరి' పత్రిక చూపరుల కళ్లు తిప్పుకోనీయదంటే అతిశయోక్తి కాదు. ప్రతి పేజీ వర్ణాలతో చూడముచ్చట గొలిపే 'సప్తగిరి' మాసపత్రిక సోయగాలు అన్నీ ఇన్నీ కాదు.

హిందూ సంప్రదాయ ధార్మికవైశిష్ట్యాన్ని, మన భారతీయశిల్పకళావైభవాన్ని, ప్రకృతి రమణీయతను మదిలో పొందుపరిచే చెరగని చిరునామా 'సప్తగిరి' మాసపత్రిక.

పురాణ ప్రవచనాలు, సంకీర్తనార్చనలు, అర్చక స్వాముల మంత్రోచ్చారణలు, అక్షరాల రూపంలో సకల జనుల కందించే గొప్ప వరప్రసాదం 'సప్తగిరి' మాసపత్రిక.

వివిధ ప్రాంతాల్లో జరిగే ఉత్సవాలు, ఊరేగింపులు, నదీస్నానాలు, చిన్నపిల్లలకు బాలప్రబోధం, వేదపురాణం ఎన్నో ఎన్నెన్నో ఈ పత్రికలో స్థానం సంపాదించడం, అతి తక్కువ ధరకే అందరికీ వెసులుబాటు ఉండేట్లు చేయటం మాటలలో చెప్పనలవి కాదు.



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

## 'సప్తగిరి' చందాదారులకు విజ్ఞప్తి



**సప్తగిరి మాసపత్రిక చందాదారులకు ప్రతినెల సకాలంలో చేరడానికి అనేకచర్యలు తీసుకుంటున్న సంగతి పాఠకలోకానికి విదితమే! ఈ క్రమంలో చందాదారుల చిరునామాల క్రమబద్ధీకరణకు అనేకచర్యలు తీసుకుంటున్నాం. చందాదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ క్రిందివిధంగా ప్రధానసంపాదకకార్యాలయానికి తెలియజేయవచ్చు.**



**01)** **'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు sapthagiri_helpdesk@tirumala.org ద్వారా తెలియజేయవచ్చు.**

**02)** **సప్తగిరి చందాదారుల చిరునామాల క్రమబద్ధీకరణకోసం 0877- 2264543 ఫోన్ నెంబరుకు చందాదారులు తమ పూర్తి చిరునామాను పిన్‌కోడ్, సెల్‌ఫోన్‌నెంబరుతో సహా కార్యాలయ పనివేళల్లో (ఉ.10.30 గం॥ల నుండి సా.5.00 గం॥ల లోపు) మరొకసారి తెలియజేయగలరు.**

**03)** **పై ఫోనునెంబరుద్వారాగానీ, sapthagiri_helpdesk@tirumala.org ద్వారా గానీ తెలుపగలరు.**

**04)** **ఆన్‌లైన్ చందాదారులు తమ పూర్తి చిరునామాలను క్రమబద్ధీకరణకోసం తి.తి.దే. వెబ్‌సైట్‌ద్వారా మరొకసారి తెలియజేయండి!**

– ప్రధాన సంపాదకుడు




50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 50 మే, 2020 సంచిక : 12


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| అంతర్యామికి అక్షర నీరాజనం | శ్రీ శివేగారి చిన్నికృష్ణ | 04 |
| సనాతన హైందవ ధర్మప్రచారంలో... 'సప్తగిరి' మాసపత్రిక | డా॥ కోటపాటి రాధారమణ | 07 |
| శ్రీకృష్ణభగవద్విజయం | డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 11 |
| సందేహాలు - సమాధానాలు | బ్రహ్మశ్రీ మల్లాది చన్ద్రశేఖరశాస్త్రి | 12 |
| అమ్మ ఎంతో.. అన్నమయ్యా అంతే...!! | ఆచార్య కె. ఆశాజ్యోతి | 13 |
| కర్మభూమి | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 16 |
| నమో నరసింహా! | డా॥ కప్పగంతు రామకృష్ణ | 17 |
| మధురకవి ఆళ్వారు | ఆచార్య కె.సర్వోత్తమరావు | 20 |
| విష్ణువొక్కడే విశ్వాత్మకుడు | ఆచార్య గల్లా చలపతి | 22 |
| అన్నమయ్య జీవితచరిత్ర | డా॥ మన్నూరు శివప్రవీణ్ | 25 |
| దివ్యక్షేత్రం... తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| ఆధ్యాత్మిక సిరి | శ్రీ దేగల అనితాసూరి | 33 |
| శ్రీరామదూతం శిరసా నమామి! | డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య | 34 |
| ఆనందరహస్యం | శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 37 |
| శ్రీపేరుందేవి సమేత శ్రీకరివరదరాజస్వామి ఆలయం, సత్రవాడ | శ్రీ వి.ఓ.సురేష్ | 38 |
| పుంసవనవ్రతం | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 40 |
| పగతీర్చుకోవడానికి కొడుకా...! | మాస్టర్ వి.ఎస్.సూర్యనారాయణ | 42 |
| మనం అనుకుంటే సరిపోతుందా? | శ్రీ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 44 |
| ఆరోగ్యవజ్రం - ఖర్జూరం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 45 |
| హరిదాస వాఙ్మయంలో శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 46 |
| వెంగమాంబ వర్ణనల్లో శ్రీవేంకటేశ్వరుడు | డా॥ సంగీతం కేశవులు | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్ | 51 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 52 |


ముఖచిత్రం : వినరోభాగ్యము విష్ణుకథ...
వెనుక చిత్రం : శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ

వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥


**గౌరవ సంపాదకుడు**
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకుడు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకుడు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకుడు**
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఇడి.,
ఉపకార్యనిర్వహణాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360



విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# 'సప్తగిరి' స్వర్ణోత్సవ శుభవేళ...

మనిషి జీవనంలో ఆధ్యాత్మికం, లౌకికం జోడెద్దులు కట్టిన బండివంటిది. అప్పుడే జీవనం సుఖంగా సంతృప్తిగా ప్రశాంతంగా సాగుతుంది. మానవుడికి సంపాదన అవసరమే. దాంతో పాటు ఆధ్యాత్మికత పట్ల కూడా సరైన అవగాహన ఏర్పరచుకోవాలి. దైవ ప్రీతి, పాపభీతి వంటి మంచి లక్షణాలను అలవరచుకోవాలి. హృదయంలో ప్రేమ, క్షమ, కారుణ్యం ఉండాలి. పదిమందికీ ప్రేమతో మనం ఉపయోగపడాలి. బండికి గల రెండు చక్రాలుగా, పక్షికి గల రెండు రెక్కలుగా లౌకిక, ఆధ్యాత్మికతలను సమపాళ్లలో మేళవించగలిగితే ఉన్నతమైన, ఉత్తమమైన జీవనవిధానం ఆవిష్కృతమౌతుంది. ఇదంతా సాధించటానికి ఓ చోదకశక్తి అవసరం అవుతుంది. ఈ కొరతను 'సప్తగిరి' తీరుస్తోంది. ఇది అతిశయోక్తి కాదు. ఆలంకారిక ప్రయోగం అంతకన్నా కాదు.

*'సమాజశ్రేయస్సే సాహిత్యానికి పరమార్థం'* అని పెద్దలు చెప్పిన మాటను అక్షరసత్యం చేస్తున్న అతికొద్ది పత్రికల్లో శిఖరస్థానంలో ఉన్న పత్రిక 'సప్తగిరి' అని నిస్సంకోచంగా చెప్పవచ్చు. తిరుమలగిరుల సార్వభౌముడి లీలా విశేషాలు లక్షలాది భక్తుల హృదయాల్లో ముద్రించి, చేరవేస్తున్నదీ పత్రిక. ఆ అక్షరాల్లో నిండినిబిడీకృతమైన శ్రీస్వామి వారి అనంతశక్తిని కూడా వారికి అనుభవింపజేస్తుంది. *'అక్షరానాం అకారోస్మి'* అన్నారు కదా స్వామి. ఆ మాట పొల్లు పోకుండా, పత్రికలోని ప్రతి పుటా, శ్రీస్వామివారిపాదాలకు అక్షరార్చన చేస్తుంది. ఆ ప్రసాదాన్ని యాభై ఏళ్లుగా, నిర్విరామంగా భక్తులకు అందిస్తోంది.

తిరుమల యాత్ర అంటేనే ఒక దివ్యానుభూతి! ఒక ఆనందం. ఒక పరమానందం అందుకే తిరుమల యాత్రికులకు ఓ ప్రత్యేకత ఉంది. స్వామికి మొక్కుకుని, ఆ మొక్కు తీర్చుకోవటానికి ఇంటి వద్ద బయల్దేరిన క్షణం నుంచి మళ్లీ యాత్ర సంపూర్ణమయ్యే వరకు గోవిందనామాన్ని జపిస్తూనే ఉంటారు. *'కలౌ స్మరణా న్ముక్తిః'* అన్నారు కదా స్వామి. అలా, స్మరణంతోనే భక్తులను భవసాగరాలను దాటిస్తున్నాడు వేంకటపతి. అయినప్పటికీ మానవులం కదా.... లౌకికబంధాలు తప్పవు. ఎంతవద్దకున్నా, వదిలించుకోవాలన్నా 'మాయ'ను దాటిపోవటం తేలికైన పని కాదు. అందుకే ఆ పనిని కూడా స్వామే స్వయంగా భుజాన వేసుకున్నాడు. భక్తుల్ని తరింపజేయటం కోసం స్వామి ఎన్ని కష్టాలైనా పడతారు. ఏ పనైనా చేస్తారు. అందుకే... యాత్ర పూర్తిచేసుకుని, ఇంటికి ప్రయాణం చేసే భక్తుల వెంట తోడుగా సప్తగిరీశుడు 'సప్తగిరి' రూపంలో బయల్దేరుతాడు. చేయి పట్టుకుని, వారి చేత 'సప్తగిరి'ని పట్టించి, నోరారా నామాన్ని పలికించేలా చేస్తారు. అదీ కొండలరాయడి కొండంత ఘనత.

స్వామిని దగ్గరగా దర్శించుకున్నామన్న అనుభూతి కలిగించే చిత్రాలు భక్తపాఠకుల మనసుల్ని కట్టిపడేస్తాయి. ఉద్దండులైన పండితుల రచనలు పత్రికను ఆమూలాగ్రం చదివిస్తాయి. ఆ యా సందర్భాల కనుగుణంగా సంచికలో ఏ వ్యాసం ఇస్తే సమయోచితంగా ఉంటుందో యోచించి, ఎంపిక చేసి అందిస్తున్న పత్రికగా విశేష పాఠకాదరణ పొందడం ఆనందించదగిన విషయం. సప్తగిరి పత్రికా సిబ్బంది కూడా ఉద్యోగాన్ని ఉద్యోగంగా కాకుండా, వేంకటపతి చరణసేవ చేసే మహద్భాగ్యంగా, ఒక సదవకాశంగా భావించి వీరందరూ చేస్తున్న సేవ భక్తుల హృదయాలను కొండలరాయని కరుణాసముద్రంలో మునకలు పెట్టించి పుణ్యస్నానాలు చేయిస్తోంది. భక్తుల అనుభవాలు, అధికారుల సూచనలు, మార్గదర్శకాలు, భక్తుల సమస్యలకు పరిష్కారాలు, తిరుమల యాత్రకు మార్గదర్శనం, ఆలయంలో స్వామికి జరిగే అర్చనాది కైంకర్యాలు, ఉత్సవ విశేషాలు, ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మాస విశేషాలు... వేటికవే సమున్నతంగా పత్రికలో ఒద్దికగా కుదిరి కూర్చుంటాయి. ఏకబిగిన భక్తుల చేత పత్రికను చదివింపజేస్తాయి.

'సప్తగిరి' అసాధారణ పత్రిక. వేంకటాచల రమణుడి లీలా తరంగిణి. అది అనంతమైన భక్తిభావఝరి!



సనాతన హైందవ ధర్మప్రచారంలో..


# సప్తగిరి

## సచిత్రమాసపత్రిక

1970 2020

-డా॥ కోటపాటి రాధారమణ, ప్రధాన సంపాదకులు, తి.తి.దే.

ప్రజలలో సత్ప్రవర్తన, సదాచారం, ధర్మాచరణ వంటి వాటిని ప్రేరేపించి ముందుకు నడిపించే విషయంలో ధార్మిక పత్రికల స్థానం ప్రత్యేకం. అందులోను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తూవున్న **'సప్తగిరి'** ధార్మిక మాసపత్రిక స్థానం మరింత విశిష్టమైనది. ఈ పత్రిక పూర్వాపరాలను పరిశీలిద్దాం!




నాటి ఫిబ్రవరి, 1959 సప్తగిరి ముఖచిత్రం (బులిటెన్, సైజు- 1/8 డెమ్మీ)

శేషాచలపతి ఐన శ్రీనివాసుని దర్శించ వచ్చే వేలాది యాత్రికులకు దేవస్థానం చేస్తున్న, చేయనున్న సౌకర్యాల వివరాలను ప్రపంచంలో నలుమూలలల్లో భక్తులకు తెలియజేయటంతో పాటు క్షేత్రమహిమ, తదితర పౌరాణిక, వైదిక విజ్ఞానాన్ని ప్రబోధించి ఆస్తికులలో ఆధ్యాత్మిక రోచిస్సు లవిచ్ఛిన్నంగా వెలగటానికి తోడ్పడేటందుకు 1949వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రచార సాధనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

దాని ఫలితంగా ఏప్రిల్ 1949వ సం॥లో కరపత్ర సదృశమైన పత్రిక వెలువడింది. అప్పుడది ప్రచార మాత్రంగా ఉండేది. దానిపేరే దేవస్థానపు **"బులెటిన్".**

అనంతంగా ఈ వేంకటేశ్వర సేవా కార్యక్రమం దినదిన ప్రవర్ధమానమై దేవస్థాన సమాచార ప్రసారంతో పాటు, పలువురు దిగ్గంతుల్లాంటి పండితుల సహకారంతో ఆర్ష విజ్ఞానంలో ఉత్తమ ఆధ్యాత్మిక సాహితీ సౌరభాలను 1961వ సం॥ వరకు వెదజల్లింది. ఈ మధ్యకాలంలో శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం కూడా దేవస్థానం అధీనంలో ఉండటంతో, అందరు పండితుల మన్ననలు వ్యాసరూపంలో పత్రికకు కావలసినంత పరపతిని, ప్రణాళికను సమకూర్చాయి. నిజానికి దేవస్థానం నుండి లోగడ వెలువడిన గ్రంథాలలో అధికశాతం మొదట మాసపత్రికలో వెలువడి తర్వాత గ్రంథరూపాన్ని సంతరించుకున్నాయని చెప్పటం సత్యమైన మాట!







మొక్క మాను కావటం, పూవు కాయ కావటం రివాజు. అలాగే, ఈ పత్రికను కేవలం తిరుపతి యాత్రా సహాయిని స్థాయిలోనే నిల్పకుండా, దీన్ని, మహోజ్జ్వల ఆధ్యాత్మికతా ప్రసారణ ప్రతీకగా నిలిచే మాసపత్రికగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం 1961వ సం॥ నుండి ప్రారంభమైంది.




'బులెటిన్' 'దేవస్థాన మాసపత్రికగా', వార్తాపత్రికల నిబంధనలకనుగుణంగా పేరును సంతరించుకొన్నది ఈ 1961వ సంవత్సరంలోనే.

దీని కార్యరూపమే ఒక సంపాదకుణ్ణి, అనుబంధ సిబ్బందిని 1963వ సం॥లో నియమించటం. దీనివల్ల పత్రికపైన, దాని ప్రగతి విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకునే అవకాశం కలిగింది.



ఆనాడు పత్రిక ప్రతులసంఖ్య 3000 మాత్రమే. చిన్న ఆకృతిలో (1/8 డెమ్మీ) ఉన్న ఈ పత్రిక ఆ రోజులలో చందాదారులకు ఇవ్వటంతో పాటు, తిరుమల, మద్రాసు, హైదరాబాదు, బెంగుళూరులలో పత్రిక విక్రయం జరుగుతుండేది. ఆంగ్లం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల వ్యాసాలన్నీ చిన్నచిన్నవిగా ప్రచురితమౌతుండేవి.




ఆశించిన ఫలితాలు కొంతైనా పొందాలంటే పత్రిక ఉనికి పదిమందికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ప్రణాళికకు ప్రారంభంగా పత్రిక విక్రయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆనాడున్న ధర్మశాలలు,













దేవాలయాలు, సమాచార కేంద్రాలలో 1966వ సంవత్సరం జూలైలో ప్రారంభించటం జరిగింది. విక్రయకేంద్రాలు మూడు నుండి పన్నెండుకు వచ్చి ఆ పైన విస్తరణ పొందాయి. దీనివల్ల పత్రిక ప్రతుల సంఖ్య కూడా పెరిగింది.

దేవస్థాన విధాన ప్రచారం, ఆర్షవిజ్ఞాన ప్రసారం ఆశయమైనప్పుడు ఈ పరిధి పలు ప్రాంతాలలో విస్తరించక తప్పదు. అందువల్ల పత్రికను, కమీషన్‌మీద ఇతరవ్యక్తుల ద్వారా అమ్మించే విధానాన్ని 1967 ఏప్రిల్ నెలలో అమలు చేయడం జరిగింది.

బహుభాషాయుతంగా వెలువడిన దేవస్థానపత్రికను 1970వ సం॥ జనవరి నుండి ఇంగ్లీషు, సంస్కృతం అన్ని పత్రికలకు అంతర్భాగంగా పత్రికను తెలుగు, తమిళం, కన్నడం, హిందీ భాషా పత్రికలుగా వేరుచేసి విడుదల చేయటం జరిగింది. దీనివలన ఆ భాషా పత్రిక ఆ యా భాషాప్రాంతాలలో మారుమూలలకు చొచ్చుకునిపోయే అవకాశం కల్గింది. అంటే స్థిర ప్రాతిపదికపైన పత్రికను రూపొందించే విధానం 1966 వ సం॥ నుండి 1970 వ సం॥ వరకు దశలవారీగా జరిగిందన్నమాట.

1949 వ సం॥ నుండి 1970వ సం॥ వరకు అంటే దాదాపు 20 సంవత్సరాలపాటు పత్రిక పత్రికాసంప్రదాయానికి అనుగుణంగా, స్వావలంబకమై సాంకేతికమైన పేరేదీ లేనట్లుగానే పెరుగుతూ వచ్చింది. 1970వ సం॥ జూన్‌లో, ఏడుకొండలకు సాంకేతిక పత్రికగా, 'బులెటిన్'గా పుట్టి పెరిగి **'సప్తగిరి'** పత్రికగా అవతరించింది. నాటి నుండి ఈనాటికి అంతటి చరిత్ర ఉంది ఈ పత్రికకు.

ఇక్కడినుండి పత్రికగతిలో గణనీయమైన మార్పులు తీసుకురావడం జరిగింది. ఇన్ని ఏళ్ళ పాటు చిన్నపత్రికగా ఉంటూ వచ్చిన ఈ పత్రికను ఏప్రిల్ 1972వ సం॥లో 1/4 క్రౌన్ పరిమాణంలోకి తీసుకురావటం జరిగింది. ఇంగ్లీషు, సంస్కృతాలు అన్ని పత్రికలకూ సమానంగానే ఉండేవి. కాని, అక్కరలేని వారిపై రుద్దనక్కర లేకుండా ఉండేందుకు వివిధ భాషల పత్రికలు ఆ భాషా ప్రాంతాలలో గణనీయస్థితిని పొందేందుకు వీలుగా జనవరి 1975వ సం॥ నుండి ఇంగ్లీషు భాషా భాగాన్ని వేరుచేసి ఐదుభాషల్లో పత్రికలు విడివిడిగా విడుదల చేయటం జరిగింది. ఈ పద్ధతివల్ల ప్రతి సప్తగిరి, రెండవ భాషా పత్రికతో సంబంధం లేకుండా ముందుగా విడుదల అయ్యే అవకాశం ఏర్పడింది.





1975వ సం॥ ఆగష్టులో పత్రికను 1/4 క్రౌన్ నుంచి 1/4 డెమ్మీ సైజుకు మార్చటం జరిగింది.

సప్తగిరి మాసపత్రిక పాఠక లోకంయొక్క ఆదరణతో దినదినప్రవర్ధమానమై విస్తరించింది. ఇందులో భాగంగానే 2014 ఏప్రిల్ మాసం నుండి సంస్కృతభాషలో కూడా పత్రిక రావడం ప్రారంభమైంది.

2016 జనవరి నుండి సప్తగిరి పత్రిక 6 భాషల (తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, ఇంగ్లీషు, సంస్కృతం) లోను పూర్తి రంగులలో సచిత్ర మాసపత్రికగా వెలువడుతోంది. కేవలం 3000 ప్రతులతో ప్రారంభమైన సప్తగిరి పత్రిక ఇంతింతై వటుడింతయై అన్నట్లు ఈనాటికి 2,00,000 ప్రతుల సర్క్యులేషన్‌కు చేరుకుంది. ప్రస్తుతం అత్యధిక సర్క్యులేషన్ కలిగిన ఆధ్యాత్మిక పత్రిక సప్తగిరి కావడం సంతోషదాయకం.

ఈ కృషి, వృద్ధి, తత్ఫలితం ఏ వ్యక్తికో చెందింది మాత్రం కాదు. దేవస్థాన కార్యనిర్వహణాధికారులందరూ ఒక్కొక్కరు తమ తమ బాటలలో సప్తగిరి ప్రగతికి తోడ్పడ్డారనటంలో సందేహం లేదు.

ప్రారంభించిన నాటి నుండి సప్తగిరిపత్రిక ధార్మికతా, ఆధ్యాత్మికతతో పాటు, ఇతరత్ర ఉండే పుణ్యక్షేత్రాలను గురించీ, దైవతాల్ని గురించీ- త్రివిధమతాచార్యుల విశేషాలూ, సిద్ధాంతాలూ భక్తి మార్గాలూ- అవి సమాజానికి ఎలా ఉపయోగిస్తున్నాయనే విశేషాలు, భక్తిమార్గాలూ, భక్తులచరిత్రలూ, ధార్మికతాత్త్విక గ్రంథాల పరిచయాలు- సులువైన భాషలో సమాజానికి అందిస్తూంది. అంతేగాక- శ్రీవారి ఆలయంలో, అనుబంధ ఆలయాల్లో జరిగే ఉత్సవ విశేషాలూ, పూజాకైంకర్యాలూ, పండుగల ఆచరణ విధానాలూ, మున్నగు విశేషాలూ ఈ పత్రికలో సందర్భానుసారంగా ముద్రింప బడుతూ ఉంటాయి.

దేవస్థానం పత్రికకు- సప్తగిరులకూ, సప్తగిరీశ్వరునికీ ప్రతీకగా **'సప్తగిరి'** అనే పేరుంచారు. ఈ పేరు వినగానే, సప్తగిరీశుడూ, సప్తగిరులనే మదిలో మెదుల్తాయి. కాలానుగుణంగా ఎన్నో భక్తిపత్రికలు ఎన్ని వస్తున్నా - ఈ పత్రిక మాత్రం తన ఉనికిని తాను నిల్పుకొంటూనే ఉంది, శిష్టసాహిత్యం నుంచీ, విశిష్టసాహిత్యం వరకూ ఆధ్యాత్మికతకు ప్రాముఖ్యమిస్తూండే విశిష్టపత్రిక **'సప్తగిరి'**. బాలలకూ, పెద్దలకూ కూడా ఆనందాన్నీ, జిజ్ఞాసనూ పెంచే ఉత్తమ పత్రిక **'సప్తగిరి'**.

ఇప్పటికి **'సప్తగిరి'** మాసపత్రిక ప్రారంభించి 50 వసంతాలు 2020 సం॥ 'మే' నెలకి పూర్తి చేసుకోంటోంది. ఈ సందర్భంగా 2020 జనవరి సంచిక నుండి సప్తగిరి మాసపత్రికలో అనేకమార్పులు తీసుకురావడం జరిగింది. ఈనాడు నాటిన విత్తనాలు... రాబోవు రోజుల్లో వృక్షాలవుతాయి. దేశభవిష్యత్తు ఉజ్వలంగా వెలుగొందాలంటే... పిల్లలు మానవీయవిలువలతో ఎదగడం ఎంతో అవసరం. తిరుమల తిరుపతి దేవస్థానం ఈ దిశగా అడుగులు వేస్తోంది. పిల్లలకోసం ప్రత్యేకంగా **'బాలసప్తగిరి'** అని ఇరవైపుటల 1/8 డెమ్మీ సైజులో, ప్రతినెలా ఆరుభాషలకు అనుబంధంగా మార్చి, 2020 నుండి తీసుకురావాలని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయం తీసుకుంది. దాససాహిత్యం, ఆళ్వార్లసాహిత్యం, హిందూ దేవుళ్లు, బాలనీతి, చిత్రకథ, క్విజ్, చిత్రలేఖనం మొ॥ పిల్లలభాషలో **'బాలసప్తగిరి'** వస్తున్నది. బాలబాలికల్లో మన సంస్కృతిపట్ల, ధర్మంపట్ల, పురాణాలపట్ల, భగవంతుని పట్ల, పెద్దలపట్ల చక్కని అవగాహన కలిగించటానికి, ఆధ్యాత్మిక ఆలోచనల్ని పెంపొందించటానికి ఈ **'బాలసప్తగిరి'**ని ప్రారంభించింది.

ఎందరో కవులు, రచయితల సృజనాత్మక రచనలతో మన ఆధ్యాత్మికరంగం సుసంపన్నం కావటంలో ఆ యా కవులు, రచయితల పాత్రతో పాటు ఆ రచనల్ని ప్రచురిస్తున్న పత్రికల పాత్ర కూడా ఎంతో ఉంది. రచయితలోని భావాన్ని లక్షలాది మందికి తెలియజేస్తూ, ఇప్పటికీ మన సమాజంలో ధర్మం, న్యాయం వంటి విలువలు సమున్నతంగా నిలవటానికి పత్రికలు కూడా తమవంతు కర్తవ్యాన్ని నూరుశాతం నిర్వహిస్తున్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆధునికత ఎంతగా విస్తరిస్తున్నప్పటికీ ఆధ్యాత్మిక పత్రికలకు ఆదరణ తగ్గకపోగా, మరింతగా పెరగటం నిజంగానే ఓ ఘనత. అందులోనూ మన ఆధ్యాత్మిక ఉన్నతికి ప్రతీక **'సప్తగిరి'** పత్రిక! పదులసంఖ్యలో ఇతర ఆధ్యాత్మిక పత్రికలు మన రాష్ట్రంలో ఆవిర్భవించి ఉన్నా, వీటన్నింటిలోను నిస్సందేహంగా అగ్రతాంబూలం అందుకుంటున్న పత్రిక **'సప్తగిరి'** మాత్రమే! ఎందుచేతంటే, ఆ పత్రిక అనునిత్యం ఆనంద నిలయుణ్ణి స్మరింపజేస్తున్న సప్తగిరులకు ప్రతీక గనుక!!

గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-13

# శ్రీకృష్ణభగవద్విజయం

- డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు, 89198 32285

**హంసుడు** : శంకరా! భక్త జనచిత్తవశంకరా!

**డిభకుడు** : చంద్రశేఖరా! సకలదైవతలోకశేఖరా!

**హంసుడు** : నిగమశ్రీ పరిపూజిత చరణారవిందా! నగరాజకుమారీప్రణయానందా!

**డిభకుడు** : మృదుమధురభాషాప్రవీణా! వరదానవిద్యాప్రవీణా!

**ఇద్దరు** : నీ దర్శనభాగ్యంచేత ధన్యులమయ్యాము తండ్రీ!

**శంకరుడు** : భక్తవతంసులారా! మీ సుదీర్ఘ తపస్సు ఫలించింది. వరాలివ్వటానికి వచ్చాను. ఏం కావాలో కోరుకోండి రాజనందనులారా!

**హంసుడు** : అంబికానాథా! మొదటివరంగా అమర సైన్యాధిపతులవల్ల గాని, అసుర సైన్యాధిపతులవల్ల గాని, ఆయుధాలవల్లగాని మాకు మరణం లేకుండా అనుగ్రహించు ప్రభూ!

**శంకరుడు** : తథాస్తు!

**డిభకుడు** : రెండవ వరంగా - ఈశాన రౌద్ర మహేశ్వర బ్రహ్మశిరోనామ కాస్త్రాలు, దివ్యచాపాలు, అభేద్య కవచాలు, అద్భుత పరశువులు అనుగ్రహించి.......

**శంకరుడు** : ఆఁ అనుగ్రహించి?

**డిభకుడు** : యుద్ధభూమిలో మాకు తోడుగా ఉండటానికి ఇద్దరు ప్రమథులను కూడా ప్రసాదించు పరమేశ్వరా!

**శంకరుడు** : తథైవ. మీరు కోరిన దివ్య శస్త్రాస్త్రాలు మీరు స్మరించినప్పుడు స్ఫురిస్తాయి.

**హంసడిభకులు** : ధన్యులం ధవళగిరీశా ధన్యులం.

**శంకరుడు** : పోరులో మీరు కోరినప్పుడు భృంగిరిటి, కుండోదరుడు అనే మా ప్రమథు లిద్దఱు మీకు సహాయకులుగా రాగలరు.

**హంసుడు** : కరుణావరుణాలయ! గిరిరాజనిలయ! ధన్యోస్మి!

**డిభకుడు** : పవనాశనకరవలయ! భక్తమనోనిలయ! ధన్యోస్మి!

**శంకరుడు** : కాని నేనిచ్చిన దివ్యశక్తులను దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు మాత్రమే ప్రయోగించాలి. విశేషించి మునిజనులను, భక్తజనులను హింసించటానికి ప్రయోగించరాదు. జాగరూకులై మెలగండి!

అని హెచ్చరించి అదృశ్యమయ్యాడు. హంస డిభకులు "హరహర మహాదేవ శంభో! హరహర మహాదేవ శంభో!" అంటూ ఆనందపరవశులై వేసిన పెను కేకలు కైలాసాద్రి కందరాలలో ప్రతిధ్వనించాయి. ఆధ్వనులకు అద్రి కందరాలలో (గుహలలో) నిద్రిస్తున్న క్రూరమృగాలు లేచి బెదరి పారిపోయాయి.

## 13

రాజకుమారులు రాజధానిలో ప్రవేశించగానే ఆవార్త అంచెలమీద అంతఃపురంలో ప్రవేశించింది. వారి తల్లిదండ్రులు, భార్యలు ఆనందసింధు తరంగాలమీద తేలియాడుతున్నారు. కొడుకులను గుండెలకు హత్తుకోవాలని బ్రహ్మదత్తుడు అతని భార్యలు అంతఃపురంనుండి బయటికి వస్తున్నారు. తల్లిదండ్రులను దర్శించుకోవటానికి తహతహతో హంసడిభకులు కోటలోపలికి ప్రవేశించారు. అందఱూ మధ్య మందిరంలో ఎదురెదురై కలుసుకున్నారు. వెంటనే "జననీ జనకుల చరణారవిందాలకు వందనాలు" అంటూ హంస డిభకులు తల్లిదండ్రుల చరణాలపై వ్రాలారు. వారిని లేవనెత్తిన తల్లిదండ్రులు వాత్సల్యంతో వారి శిరస్సులను ముద్దాడి, చెక్కిళ్లు తాకి మోదాశ్రువులు చిందించారు.

*(ఇంకా ఉంది)*



# సందేహాలు - సమాధానాలు

– బ్రహ్మశ్రీ మల్లాది చన్ద్రశేఖరశాస్త్రి

**1) పురాణేతిహాసాలకూ ఉపనిషత్తులకూ తేడా ఏమిటి?**

*– బి.గోపాల్, చెన్నై.*

ఉపనిషత్తులు సర్వజగత్కారణమైన పరబ్రహ్మను మనకు తెల్పుతున్నాయి. ఉపనిషత్తు వేదభాగం కనుక శాసనంగా ఉంటుంది. పురాణేతిహాసాలు, ఉపనిషత్తులు చెప్పిన పరబ్రహ్మమును ఇతర వేదభాగం బోధించిన ధర్మార్థాల్ని సంపాదించు విషయాన్ని దృష్టాంతాలతో జరిగిన కథా సన్నివేశాలతో మిత్రుని వలె బోధిస్తూ ఉంటాయి.

**2) శివార్చనలో మొగలిరేకులు ఎందుకు పనికి రావు?**

*– బి.భార్గవ, నెల్లూరు.*

ఒకప్పుడు మొగలిపువ్వు శంకరుని దగ్గర తప్పుడు సాక్ష్యం చెప్పింది. అందుకని శివపూజకు మొగలిపువ్వులు పనికిరానివిగా శివుడు శపించాడు. అందుకే మొగలి శివ పూజకు వాడరు.

**3) ఉపపురాణాలు అంటారు- అవి పురాణాల్లోని భాగాలా? వేరే ఉన్నాయా? పురాణాలకూ ఉప పురాణాలకూ తేడా ఏమిటి?**

*– కె.చంద్రకళ, గాజువాక.*

పురాణాలు మొత్తం 18. వ్యాసులవారే రాశారు. వ్యాసుడు శిష్యులతో కలిసి రాసినవి 18 ఉప పురాణాలు. పురాణాలు, ఉపపురాణాలు కలిపి 36.

**4) కైలాస పర్వతాన్నే బంతిలా ఎత్తిన రావణాసురుడు శివ ధనుస్సు నెందుకు ఎక్కు పెట్టలేక పోయాడు?**

*– సి.ఓబులేశు, కడప.*

శివధనుస్సు ఎక్కు పెట్టటానికి అసలు రావణుడు రావడమనేది వాల్మీకి రామాయణంలో లేదు. శూర్పణఖ చెప్పేదాకా శ్రీరాముని సంగతి కానీ, సీత విషయం గానీ రావణునికి ఎక్కడా తెలిసినట్లు వాల్మీకంలో లేదు. ఈ విషయం ఇతరులు వర్ణించడంలో గూఢార్థం– అహంకారికి శివధనుస్సు అలవిగాదని చెప్పడానికే వర్ణించారు గానీ వేరుగా ఉండదు.

**5) ఇతిహాస, పురాణాలు మానవులకు బోధించేది ఏమిటి?**

*– కె.హరి, బళ్లారి.*

మానవులు ఈ లోకంలో ఏ విధంగా నడిస్తే సుఖ సంతోషాలు పొందగలుగుతారో, శుభాన్ని సంపాదిస్తారో, పరలోకం సుఖావహమగునో, సమాజం, దేశం, ప్రజ ఏవిధంగా అభ్యుదయాన్ని పొందగలరో సర్వకాలాలకూ పనికివచ్చే శ్రేయోమార్గం చూపిస్తాయి.

**6) గోపికల చీరెలు శ్రీకృష్ణుడు దోచుకొని పొన్నచెట్టు మీదనే ఎందుకు దాచాడు?**

*– ఏ.విష్ణు, కాకినాడ.*

శ్రీకృష్ణుడు జ్ఞానస్వరూపుడుగాన గోపికలు తమను ఆశ్రయించారు గాన వారి దేహాభిమానాన్ని తీసివేసి తన యందలి గాఢానురాగం నిలుపుటకు వస్త్రాల్ని అపహరించాడు. ఆ నదీతీరంలో పొన్నచెట్టు ఉంది కనుక దానిమీదకు ఎక్కాడు. ఇంతకంటె కారణం లేదు. కానీ ఆ కారణంగా పొన్నచెట్టుకు ప్రాశస్త్యం కల్గింది.

**7) దశావతారాలలో రామునికి శ్రీకృష్ణునికీ ఉన్నన్ని దేవాలయాలు ఇతర అవతారాలకు లేకపోవుటకు కారణమేమిటి?**

*– వి.జగపతి, హైదరాబాదు.*

భగవంతుని అవతారాలు అనేకాలు. ఆవేశావతారాలు, అంశావతారాలు, లీలావతారాలు, పూర్ణావతారాలు. శ్రీరామ, శ్రీకృష్ణావతారాలు పరిపూర్ణావతారాలు. ఇవి సార్వకాలికంగా సర్వజనులకుపయోగకరాలు. అందువల్ల వీరి ఆలయాలే ప్రసిద్ధి చెందాయి.

**8) పురాణానికీ పౌరాణికానికీ తేడా ఏమిటి?**

*– పి.ప్రణవి, తిరుపతి.*

పురాణమంటే కొన్ని లక్షణాలతో గూడిన గ్రంథం. పౌరాణికమంటే పురాణాలలో మనకు తెలుపబడిన కథాభాగమో లేక ధర్మమో అవుతుంది.



# అమ్మ ఎంతో... అన్నమయ్యా అంతే..!!


– ఆచార్య కె. ఆశాజ్యోతి,
94496 72394


**ఆకటి వేళల అలపైన వేళల**
**తేకువ హరి నామమే దిక్కు మరి లేదు**

– అన్న అన్నమయ్య కేవలం **ఆకలి-అలపు** ఈ రెండింటి సందర్భంలో గాఢంగా హరి నామమొక్కటే దిక్కని చెప్పినా **మనసా-వాచా-కర్మణా** నిరంతరం హరి నామం స్మరించాడు. ఆకలివేళల హరినామం ఎలా సంరక్షిస్తుందో అనుభూతించినవాడు అన్నమయ్య. స్వతహాగా అనుభవించాడు కనుక ఆ తాదాత్మ్యతను అక్షరబద్ధం చేశాడు. అలపైన వేళలు అన్నప్పుడు మనిషి తన పరిధిని దాటి, తన శక్తిని మించి నిస్సహాయస్థితిని అనుభవించే తరుణంలో– నీవే తప్ప ఇతః పరంబెరుగనన్న క్షణంలో– భగవంతుడు తప్ప మరిక ఎవ్వరూ రక్షించలేరన్న స్థితిలో నిర్మోహుడైన మనిషి **ఆత్మ- పరమాత్మ** సంయోగంకోసం వేచి ఉన్న స్థితి. అదే శరణాగతి! ఆత్మనివేదనతో భగవంతుని స్మరణ సదా చేశాడు అన్నమయ్య. ఈయన సంకీర్తలన్నీ వైష్ణవభక్తి ప్రబోధకాలే! ఆ భక్తితత్త్వం తెలుగుభాషా- సాహిత్యాలకు కొత్త వన్నె తెచ్చింది. సంకీర్తనావైభవం తెలుగు కవిత్వానికి పూలకు తావిలా అమరి వైభవ పరీమళాలను వెదజల్లింది.

అన్నమయ్య కవిత్వంలో సారళ్యం – జానపద పలుకుబడుల్లోని సొబగు, స్వచ్ఛత కనబడ తాయి. ఆత్మప్రబోధం– ఆత్మావలోకనం– లౌకిక జీవనతత్వం– స్వీయానుభూతి వంటి లక్షణాలు అన్నమయ్య సంకీర్తనలలో ప్రముఖ స్థానం పొందాయి. తెలుగు కవిత్వపు గుబాళింపులు పలకరింపులు అన్నమయ్య సంకీర్తనలలో!

**విన్నపాలు వినవలె వింతవింతలు**
**పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా**

– అంటూ భక్తులు విన్నవించినా...

**చందమామ రావే! జాబిల్లి రావే!**– అంటూ తల్లులు ఆలపించినా, **జో అచ్యుతానంద జో జో ముకుందా**– అంటూ తల్లులు పిల్లలకు జోల పాడినా అదంతా అన్నమయ్య చలవే! ఆ ఆలాపనలు వింటుంటే అన్నమయ్య మనో ఫలకంపై కదలక మానడు.

కవిత్వంపై– భాషపై అన్నమయ్య చేసిన ప్రయోగాలు ఎన్నెన్నో! భగవంతునితో మమేకత్వం– తాదాత్మ్యం అన్నమయ్య భావనాశక్తిని మేరునగధీరత్వానికి చేర్చాయి. ఆ ఔన్నత్యం కవిత్వానికి– అన్నమయ్య పదాలకు ఎనలేని సౌందర్యాన్ని ఇచ్చింది. సంకీర్తనలలో నాయికా వర్ణనను కనుమలతో పోల్చి చెప్పడం కొత్తదనమే కాదు ఆశ్చర్యం కూడా! ఇలాంటి కవితాత్మక ప్రయోగాలెన్నో ఆయన సంకీర్తనల్లో చూడవచ్చు.

**సొంపుల నీ వదనపు సోమశిల కనుమ**
**యింపులెల్ల జోకొనగ నిల్లు నీ పతికి**
**కలికి నీ పిరుదనే గద్దె రాతికనుమ**
**... ... ... ... ... ...** **(12-115)**

అంటూ కనుమల వర్ణన సాగిపోతుంది. ఈ కనుమలన్నీ తాళ్లపాక సమీపంలోనే ఉన్నాయి. ఈ కనుమల ప్రస్తావనలోని ఆంతర్యం– "ప్రతి కనుమ దగ్గర ఏ వైపుననో ఒక వైపున చెన్నకేశవస్వామి ఆలయం ఉండడం". విష్ణుమూర్తి అస్తిత్వాన్ని తెలపడానికి కనుమల రూపంలో నాయికా వర్ణన ఒక నెపం– ఒక సౌందర్యాత్మక లక్షణమే కాదు– జనపద మనస్తత్వానికి ప్రతీక కూడా!

బ్రహ్మ గడిగిన పాదము
బ్రహ్మము దానె నీ పాదము
చెలగి వసుధ గొలిచిన పాదము
బలి తల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము (1–19)

అంటూ వేంకటేశ్వరుని పాదారవిందాలను కీర్తిస్తూ–



పరమ యోగులకు బరిపరి విధముల
వరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమ పదము నీ పాదము – (1–19)

అంటూ ముగిస్తాడు. పురాణ కథాక్రమాన్ని ఆయా సందర్భాలలో తన భావనా శక్తిని జోడిస్తూ అందమైన పద కవిత్వాన్ని రాయడంలో అన్నమయ్య సిద్ధహస్తుడు.

హరినామస్మరణ కష్టనివారణం– అని నమ్మినవాడు అన్నమయ్య. సృష్టి– స్థితి– లయలకు కారణం, ఆదియు– అంత్యము అచ్యుతుడే అని నమ్మాడు అన్నమయ్య.

భావములోన బాహ్యమునందును
గోవింద గోవిందయని కొలువవో మనసా

హరి యవతారములే యఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండములు
హరి నామములే అన్ని మంత్రములు
హరి హరి యనవో మనసా
.... .... .... .... (3–561)

బాలకృష్ణుని రూపసౌందర్యంతోపాటు దేవకీ సుతుడు ఎవరెవరికి ఏయే సందర్భాలలో ఎంతటి ఆత్మీయుడో– ప్రియతముడో తెలపడానికి మణులను పదకవితలో ఎంత సుందరంగా– భావనాత్మకంగా కూర్చాడో గమనిస్తే అన్నమయ్య సునిశితదృష్టి అవగతమౌతుంది. ఆ కూర్పు పదకవితకు ఎనలేని వన్నె తెచ్చింది.

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు

అంత నింత గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల గరుడ పచ్చ బూస
చెంతల మాలోనున్న చిన్ని కృష్ణుడు

రతికేళి రుక్మిణికి రంగుమోవి పగడము
మితి గోవర్ధనపు గోమేధికము
సతమై శంఖు చక్రాల సందుల వైదూర్యము
గతియై మమ్ము గాచేటి కమలాక్షుడు



అ అంటే అమ్మ
అ అంటే అన్నమయ్య కూడా!

తల్లి పురుడు పోసుకొని బిడ్డకు జన్మనిచ్చినట్టుగానే, అన్నమయ్యపదకవిత పురుడు పోసుకొని సంకీర్తనలను తెలుగుజాతికి అందించింది. బిడ్డకు తల్లి ఎంత అవసరమో తెలుగుజాతికి అన్నమయ్య సంకీర్తనలు అంతే అవసరం. అమ్మను స్మరించే ప్రతి వ్యక్తి అన్నమయ్య పదాలను కనీసం అంతరంగంలోనైనా పాడుకోకుండా ఉండడు. అమ్మనూ – అన్నమయ్యనూ స్పృశించకుండా – స్మరించకుండా జీవితాన్ని దాటి వెళ్లలేడు ఏ వ్యక్తి కూడా!

తన పదాలను శ్రీవేంకటేశ్వరస్వామి పాదాల కంకితం చేసి– తన సంకీర్తనలతో వేంకటేశ్వరుణ్ణి పులకాంకితుణ్ణి చేసి– తన వాక్కు, గేయాలతో వాగ్గేయకారుడై వేంకటేశ్వరుణ్ణి తన్మయుణ్ణి చేసి– భగవద్భక్తితత్త్వాన్ని ఎన్నో సంకీర్తనల్లో పొందుపరచి– నిష్కామకర్ముడై– నవవిధ భక్తిమార్గాల్లోనే కాక ప్రతి పలుకు భగవన్నామస్మరణ చేసిన ధన్యజీవి అన్నమయ్య!

కాళింగుని తలలపై గప్పిన పుష్యరాగము
యేలేటి శ్రీ వేంకటాద్రి యింద్రనీలము
పాల జలధిలోని పాయని దివ్యరత్నము
బాలుని వలె దిరిగీ పద్మనాభుడు (3–577)

స్త్రీల మనస్తత్వాన్ని ఎంత బాగా గమనించాడో ఈ సంకీర్తన తెలుపుతుంది.

ఎంత వాడవైన నిన్ను నింతసేసితి
యింతిని నా యపరాధాలెట్టోరిచేవయ్యా
చేరరమ్మంటే రానైతి చెక్కులు చేతగిల్లితి
గారవించగా నిన్ను గసరితిని
కూరిమి కొసరగాను కోపాన జంకితిని
యీ రీతి నా యపరాధా లెట్రోరిచేవయ్యా(11–565)

కోపంలో నాయకుణ్ణి కసరి కాదనుకొని తిరిగి అపరాధాలను తలచుకొని దిగులు పడే సగటు స్త్రీ మానసిక స్థితిని రమణీయంగా చెప్పాడు అన్నమయ్య.

అన్నమయ్య సంకీర్తనల అక్షంతలతో శ్రీవేంకటేశ్వరుడు తలంబ్రాలు పోసుకున్నాడు. తనివితీరని వేంకటేశ్వరుడు నిరంతరం ఆ సంకీర్తనలకై పరితపిస్తుండడంతో నేటికీ ఈ కీర్తనలు మారుమోగుతున్నాయి.

జగడపు చనవుల జాజర
సగినల మంచపు జాజర

మొల్లలు దురుమల ముడిచిన బరువున
మొల్లపు సరసపు మురిపెమున
జల్లన బుప్పొడి జారగ పతిపై
చల్లేరతివలు జాజర
.... .... .... .... (5–274)

జానపదకళల– ఆటల సౌందర్యాన్ని కన్నులకు కట్టినట్టుగా చూపడంలో అన్నమయ్య దిట్ట. ఉట్లపండుగ వర్ణనలో ఈ రసాస్వాదనకు అవకాశం ఉంది.

పచ్చి దేరచు ఉట్ల పండుగాయను
గచ్చులను గొల్లెతలు కౌగలించి పట్టగా
పైకొని చూడరో వుట్ల పండుగ నేడు
ఆకడ గొల్లెతలకు నానందము నేడు
పలుమరు వుట్లపండుగను
.... .... .... ....
ఊళ్ళ వీథుల వుట్ల కృష్ణుడు
తాళ్ళు తెగి పడ దన్నుచును.




ప్రస్తుతం మనం ఉన్నది కర్మస్థానం. ఇక్కడ కర్మలు చేయడమే సకలజీవుల ప్రధానకార్యం, లక్షణం, లక్ష్యం కావాలి.

ఈ జగత్తులో మానవులే కాదు పశుపక్ష్యాదులు కూడ పనులలో, కార్యాలలో నెలకొన్నట్లు కనిపిస్తూ ఉంటుంది. అది సహజం. ఏ పని లేకుండ కూర్చున్న పశు పక్ష్యాదులు మనకు కనిపించవు. కాని పనులు లేకుండ ఖాళీగా కూర్చున్న మానవులు మాత్రం మనకు కనిపిస్తారు.

ప్రతి మానవుడికి అతని గుణాలను బట్టి కర్మలు వేదపరంగా నిర్ణయించబడ్డాయి.

ఇంతకూ కర్మలు ఎందుకు చేయాల్సి వస్తుంది? ఈ ప్రశ్నకు ఇచ్చే సమాధానం ఒక్కటే. ఏదో మన దగ్గర లేనిది పొందడం కోసం కర్మలు చేయాల్సి ఉంటుంది. తన దగ్గర లేనిది పొందడం కొరకు మానవుడు పనులలో పడతాడు.

అయితే భగవంతునికి ఇటువంటి పరిస్థితి ఉండనే ఉండదు. సమస్త జగత్తును సృష్టించింది తానే కాబట్టి తనది కానిది ఈ జగత్తులో లేనే లేదు. ఈ జగత్తులోని సమస్తము భగవంతునిదేనని ఈశోపనిషద్ చెబుతోంది. అయినా భగవంతుడు ఈ జగత్తులోకి వచ్చినప్పుడు, లేదా అవతారం దాల్చినప్పుడు కర్మలు చేస్తూనే ఉంటాడు.

"ఓ పార్థా! ముల్లోకాలలో నాకు విధించబడిన కర్మ ఏదీ లేదు. నేను కోరేది ఏదీ లేదు, దేనినీ పొంద వలసిన అవసరము లేదు. అయినా కూడ నేను విధ్యుక్త కర్మలలో నెలకొన్నాను." (భగవద్గీత 3.22)

"ఎందుకంటే ఒకవేళ నేను విధ్యుక్తకర్మలను జాగ్రత్తగా చేయడంలో ఎప్పుడైనా విఫలుడనైతే నిక్కముగా మానవులందరు నా మార్గమునే అనుసరిస్తారు." (భగవద్గీత 3.23)

ఇది శ్రీకృష్ణభగవానుడు పలికిన మాట. తాను పొందాల్సింది గాని, తన దగ్గర లేనిది గాని ఏదీ లేక పోయినా తాను కర్మలలో నెలకొని ఉంటానని దేవదేవుడే చెప్పాడు. కాబట్టి ప్రతి మానవుడు, ముఖ్యంగా యువత పనులు చేయని, పనిపాట లేని స్థితిలో ఉండకూడదు.

పనులలో నెలకొనాలంటే చురుకుదనం కావాలి, ఉత్సాహం కావాలి, నిశ్చయాత్మక బుద్ధికావాలి, ధైర్యం కావాలి, బుద్ధితో ప్రణాళికలు వేయాలి, లక్ష్యాలతో జీవితం గడపాలి, సోమరితనం పూర్తిగా తొలగిపోవాలి, భోగలాలస పూర్తిగాపోవాలి.

అప్పుడు ఆరోగ్యం బాగుంటుంది, మనస్సు బాగుం టుంది, జీవితం ఆనందంగా ఉంటుంది. ఉద్యోగాల్లో ఉన్న వాళ్లు కూడ 60 ఏళ్ళు దాటగానే తమ పనులన్నీ అయి పోయినట్లు, ఇక తమకు పనులేవీలేనట్లు భావిస్తుంటారు.

భగవంతుడే పనులలో నెలకొన్నప్పుడు మానవ మాత్రులమైన మనమెంత? ప్రతి మనిషికి తన వయస్సు, చదువు, శక్తి, కాలం ప్రకారం ఎన్నో రకాల పనులు ఉంటాయి. మనస్సుంటే మార్గముంటుంది అనే లోకోక్తిని బట్టి "నేను జీవితాంతం ఆనందంగా కర్మలు చేస్తూనే ఉంటాను" అని ఎవరైనా అనుకుంటే వారికి అద్భుతంగా అవకాశాలు, ఆరోగ్యం అన్నీ సమకూరుతాయి. అటువంటి వారే దీర్ఘాయువుతో, పరమానందంతో జీవిస్తారు. కాబట్టి గీతోపదేశం ద్వారా అందరు కార్యోన్ముఖులు కావడానికి నడుం కట్టాలి!

# నమో నరసింహా!

- డా॥ కప్పగంతు రామకృష్ణ,
90320 44115

భగవంతుడు ఎక్కడ ఉంటాడు? యుగయుగాలుగా ఆధ్యాత్మికజిజ్ఞాసువులను వేధిస్తున్న ప్రశ్న ఇది. వైకుంఠంలోనే మాత్రమే ఉంటాడా? అలా ఉంటే, భగవంతుణ్ణి సర్వవ్యాపి అని ఎందుకంటారు? అన్ని చోట్లా ఉండేవాడే అయితే, ప్రత్యేకంగా కొన్ని స్థలాలను ఎందుకు చెబుతున్నారు? ఇంకా మరెన్నో సందేహాలు భక్తుల మనసుల్లో కలుగుతూనే ఉంటాయి.

ఈ ప్రశ్నలన్నిటికీ ఒకే ఒక సమాధానం- నరసింహావతార ఆవిర్భావ ఘట్టం. భక్తుడు నమ్ముకున్న భగవంతుడు ఎక్కడ ఉంటాడు? అంటే భక్తులు ఎక్కడ వేలెత్తి చూపిస్తే అక్కడ ఉంటాడు. ఇందుగలడు అందులేడనే సందేహం ఎవరికీ అవసరం లేదు.

సమయాసమయాలు లేవు. స్థలఔచిత్య నియమాలు అంతకన్నా లేవు. దివాసంధ్యల ప్రస్తావన లేదు. ఉన్నదల్లా ఒక్కటే... భక్తుడైన ప్రహ్లాదుని అణువణువులో నిండిన నారాయణుని భక్తి. అనంతమైన ప్రకృతిలోని అణువణువులో నిండిన పరమాత్మను దర్శించిన ప్రహ్లాదుడికి మాత్రమే తెలుసు- భగవంతుడు సర్వవ్యాపి అని. తాను పిలిస్తే దైవం వస్తాడని అతడి నమ్మిక. అందుకే, స్తంభాన్ని చీల్చుకుని ఉగ్రనారసింహుడు ఆవిర్భవించాడు.

నరసింహార్భావం కేవలం రాక్షస సంహారం కోసం కాదు. దైవచింతన, దైవం పట్ల నమ్మిక ఎంతటి మహత్తును ప్రకటించగలవో, భక్తికి ఎంతటి అపరిమితమైన శక్తి ఉందో నిరూపించటమే నరసింహావతార లక్ష్యం. అదే ఆ స్వామి అవతార తత్త్వం కూడా.

నరసింహావతారం తక్కిన అవతారాల కన్నా చాలా విశిష్టమైనది. భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని ప్రకటించే అవతారం ఇది. ఆర్తత్రాణపరాయణుడిగా, భక్తజనపరిపాలకుడిగా నారాయణుడిని నిరూపించే అవతారం కూడా ఇదే. తన భక్తుడు ఏవైపైతే వేలు చూపడం ఆపాడో అక్కడనుండి అవతరించి తన భక్తుని నమ్మకాన్ని నిరూపించిన భక్త పరాధీనుడు నరసింహుడు. క్షణాల్లో క్రోధాన్ని ఆవహింపచేసుకుని, తమోగుణప్రధాన రూపమై, తానే రుద్రుడై శ్రీహరి నరసింహావతారంలో ఆవిర్భవించాడు.

నరసింహ ఉపాసన చేసి భవసాగరాలు దాటిన మహనీయులు ఎందరో ఉన్నారు.

తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యుడు, మధుర భక్తశిఖామణి తరిగొండ వెంగమాంబ, కైవార తాతయ్య ఇలా ఎందరో నరసింహ ఉపాసకులై తద్వారా వేంకటేశుని సన్నిధి చేరి కైవల్యం పొందారు. అన్నమయ్య రాసిన 32 వేల సంకీర్తనల్లో ఎక్కువభాగం శ్రీవేంకటేశ్వరుని మీదే ఉంటాయి. ఆ తర్వాతి స్థానం నరసింహునిదే. ఉగ్ర స్వరూపుడైన నరసింహుని మహోగ్రతను వివరిస్తూనే, ఆ స్వామిలోని దయాసముద్ర హృదయాన్ని అన్నమయ్య అత్యంతరమణీయంగా వర్ణిస్తారు.



శ్రీనివాసుని కల్యాణఘట్టం ఇందుకు సాక్షిభూతంగా నిలుస్తుంది. శ్రీపద్మావతీ కల్యాణసమయంలో అవసరమైన ధనాన్ని శ్రీనివాసుడు కుబేరుడి వద్ద అప్పుగా తీసుకుంటాడు. ఇందుకు బ్రహ్మదేవుడు, అశ్వత్థ వృక్షం సాక్షులుగా ఉంటారు. కుబేరుడు ఇచ్చిన ధనంతో ఏర్పాట్లన్నీ అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. పెళ్ళిభోజనాలు సిద్ధమౌతాయి. ఇంతలో బ్రహ్మదేవునికి సందేహం వస్తుంది. దేవుడి నివేదన చెయ్యకుండా, మిగిలిన వారికి భోజనం వడ్డించటం దోషం కాదా?

ఎంతకీ తేల్చుకోలేక శ్రీనివాసుడినే నేరుగా అడుగుతాడు. అందుకు స్వామి, ఇది నా వివాహం. మీరంతా అతిథులు కాబట్టి మీరే ముందు ఆరగించండి అంటాడు. కానీ, నివేదన చెయ్యని భోజనాన్ని ఋషులు స్వీకరించరు



కదా? అని మళ్ళీ సందేహం వెలిబుచ్చాడు బ్రహ్మదేవుడు. అందుకు శ్రీనివాసుడు– 'నేనే మరొక రూపంలో ఆహోబిలంలో నరసింహుడిగా ఉన్నాను. కనుక అక్కడ నివేదన చేసి, పెళ్ళికి వచ్చిన అతిథులకు భోజనం వడ్డించండి' అని చెబుతాడు. సరే! అంటూ మిగిలిన కార్యాన్ని పూర్తిచేస్తాడు బ్రహ్మదేవుడు.

అప్పటినుంచి తిరుమలలో కూడా యోగముద్రలో ఉన్న యోగనరసింహుని అర్చన వాడుకలోకి వచ్చింది. యోగనృసింహుని ధ్యానించి, ఆనందనిలయంలో ఉన్న శ్రీనివాసుడి సాక్షాత్కరం పొందిన మహనీయులు కూడా ఉన్నారు. నారాయణునికి, నరసింహునికి ఉన్న అభేదభావానికి ఇంతకన్నా మరొక ఉదాహరణ అవసరం లేదు.

## మంత్రమూర్తి నృసింహుడు

నరసింహుడు కేవల అవతారమూర్తి మాత్రమే కాదు. ఆ స్వామి మంత్రమూర్తి. వేదాంతాలుగా భాసిల్లే ఉపనిషత్తుల్లో నరసింహతత్త్వం వర్ణితమై ఉంది. నరసింహుని పరబ్రహ్మస్వరూపం, తత్త్వం స్వామి నామమంత్రాన్ని పరిశీలిస్తే అవగతమవుతుంది.

ఉగ్రం వీరం మహావిష్ణుం
జ్వలంతం సర్వతోముఖం
నృసింహం భీషణం భద్రం
మృత్యుమృత్యుం నమామ్యహం

– ఇది నృసింహ మంత్రం. నామరూపంలో ఉన్న మంత్రం ఇది. ఇందులో ఉన్న ఒక్కొక్క నామం నృసింహుని ఒక్కో తత్త్వాన్ని ప్రకటిస్తుంది.

**ఉగ్రం–** నృసింహుడు ఉగ్రమూర్తి. ఈ ఉగ్రత్వం వల్ల సకలలోకాలు పాలించబడుతున్నాయి. నరసింహుని హుంకారాన్ని విన్నంతమాత్రంలోనే అంతర్గత, బహిర్గత శత్రునాశనం జరుగుతుంది.

**వీరం–** సకల కార్యకారణాలకు మూలంగా ఉన్న శక్తినే వీరం అంటారు. నరసింహస్వామి వీరమూర్తి. అంటే, సకల కార్యకారణ స్వరూపుడుగా నరసింహుడిని తెలుసుకోవాలి.

**మహావిష్ణుం–** అన్నిలోకాల్లో అంతటా ఉండే నరసింహతత్త్వానికి ఈ నామం ప్రతీక. సకలప్రపంచంలోని

జీవరాశులన్నిటిలో తానే వ్యక్తంగాను, అవ్యక్తంగాను పరమాత్మ భాసిస్తాడు. నరసింహతత్త్వంలోని మరొకవిశేషం ఇది.

**జ్వలంతం-** ఈ నామంలో నరసింహుని యోగ తత్త్వం ప్రకటితమవుతుంది. సకలలోకాల్లో, సర్వాత్మల్లో తన తేజస్సును ప్రకాశింపజేయటం ద్వారా వాటి ప్రకాశానికి కారణమైన నరసింహతత్త్వమే 'జ్వలంత' శబ్దానికి అర్థం. అన్నమయ్య ఉపాసన చేసింది యోగనరసింహస్వామిని. 'ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా కేళీవిహార లక్ష్మీనారసింహా' అనే కీర్తనలో అన్నమయ్య నృసింహుని 'జ్వలంత' తత్త్వాన్ని ఉపాసన చేశాడు.

**సర్వతోముఖం-** ఇంద్రియ సహాయం లేకుండా సకలవిశ్వాన్ని చూడగల పరమాత్మ తత్త్వమే సర్వతోముఖత్వం. నరసింహుడు సర్వతోముఖుడు. సృష్టి ఆరంభంలో ఉన్న పరమాత్మ, ఆ తర్వాత ప్రపంచనిర్వహణ కోసం అనేక శక్తులుగా మారిన తత్త్వమే సర్వతోముఖత్వం. నరసింహతత్త్వంలో సర్వతోముఖత్వం అనంతంగా ఉంటుంది.

**నృసింహం-** సకల జీవుల్లో సింహం చాలా శ్రేష్ఠమైనది. అందుకనే పరమాత్మ లోకాలను ఉద్ధరించటానికి శ్రేష్ఠమైన సింహాకృతి ప్రధానంగా నరసింహుడిగా ఆవిర్భవించాడు. సింహం పర్వతగుహల్లో నివసిస్తుంది. భక్తుల హృదయ గుహల్లో నరసింహుడు కొలువై ఉంటాడు. ఇదీ నరసింహతత్త్వం.

**భీషణం-**నరసింహుని శాసన శక్తి ప్రతీక భీషణత్వం. సూర్య చంద్రాదుల ప్రకాశకత్వం, అష్ట దిక్పాలకుల నిర్వహణతో సమస్తం నరసింహుని భీషణశక్తి కారణంగా నడుస్తున్నాయి. అత్యంత భయంకరమైన స్వరూపం ఇది.

**భద్రం-** భయాన్ని కలిగించే భీషణుడైన పరమాత్మే, ఆ భయాన్ని పోగొట్టి అభయాన్ని కూడా ఇస్తాడు. అదే భద్రత్వం. నృసింహతత్త్వంలోని మరో కోణానికి ప్రతీక ఇది. తనను శరణు వేడిన వారికి భద్రత్వాన్ని ఇస్తాడు స్వామి.

**మృత్యుమృత్యుం-** స్మరణ మాత్రం చేత అపమృత్యువును దూరం చేసే వాడు, మృత్యువుకే మృత్యువైన వాడు నరసింహుడు మాత్రమే. మృత్యువును కలిగించేదీ, మృత్యువును తొలగించేదీ కూడా ఆ స్వామి అనుగ్రహమే. స్వాత్మస్థితిని కలుగజేసి, అమృతత్వాన్ని కలుగజేసే స్వరూపం, తత్త్వం ఇది.

ఉగ్రమూర్తి అయినప్పటికీ నరసింహస్వామి పూర్తిగా కరుణాంతరంగుడు. కన్నతండ్రి బిడ్డని అదిలించేటప్పుడు ఎలా ఉగ్రత్వాన్ని ప్రదర్శిస్తాడో, పరమాత్మ కూడా అంతే. ఆ ఉగ్రమూర్తిలోని శాంతమూర్తిని ఉపాసన చేస్తే, శుభపరంపరలే కలుగుతాయి.

## సప్తగిరి ఆధ్యాత్మిక సిరి

**సప్తగిరి మాసపత్రిక**
**అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని**
**ఆధ్యాత్మిక మాసపత్రిక**
**తిరుమల తిరుపతి దేవస్థానముల**
**ముంగిట్లో వెలసిన సప్తగిరి**
**యాభై సంవత్సరాల సప్తగిరి**
**శ్రీవారి దివ్యదర్శనం వివరాలు**
**బ్రహ్మోత్సవాల విశేషాలు ప్రతినిత్యం**
**శ్రీవారి ఆలయంలో జరిగే**
**ఆధ్యాత్మిక విశేషాలను తెలుగు ప్రజలకు**
**అందించే అపురూపమాసపత్రిక**
**సప్తగిరి మాసపత్రిక**
**తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్ల భాషలలో**
**నెలనెలా వెలువడే శ్రీవారి మాసపత్రిక**
**సప్తగిరి మాసపత్రిక**
**హిందూ సనాతన ధర్మప్రచారంలో**
**ముందంజ వేస్తూ 50 వ ఏట అడుగిడిన**
**శుభసందర్భంలో ఇవేనా ఆనంద శుభాకాంక్షలు**
**తిరుమల శ్రీవారి ఆలయం వైభవం**
**సప్తగిరి మాసపత్రికతో శుభోదయం**

***– శ్రీ ఎల్.ప్రఫుల్ల చంద్ర, 88865 74370.***

# మధురకవి ఆళ్వారు

- ఆచార్య కె. సర్వోత్తమరావు,
97041 04000

లోకంలో కొందరు తాము నమ్ముకున్న సిద్ధాంతాలకు త్రికరణశుద్ధిగా కట్టుబడి జీవిస్తుంటారు. వారిలో మధురకవి ఆళ్వార్ చెప్పుకోదగ్గవారు. అర్చామూర్తుల కంటే ఆచార్యులైన నమ్మాళ్వార్‌నే జీవితాంతం సేవించిన ఆళ్వార్ మధురకవి ఆళ్వార్. కుముదుడనే సేనేశునిగణఅంశతో శ్రీమన్నారాయణ సేవాపరతంత్రుడైన నారాయణునికి అవతరించినవారే మధురకవి ఆళ్వార్. లోకంలో కవుల బిరుదాలు రకరకాలు. కొందరు వరకవులు. కొందరు తిట్టుకవులు. కొందరు భక్తకవులు. భక్త కవికోటికి సంబంధించిన నారాయణపుత్రులు సదా శ్రీమన్నారాయణభక్తిలాలసులై సుమధురకవితాగానం చేయడంతో 'మధురకవి' నామం లోకవ్యవహారంలో ప్రఖ్యాతమైంది.



ప్రహ్లాదుడు బాల్యంనుండి భక్తుడు. అలాగే మధురకవి వైష్ణవభక్తుడు. సాధారణంగా భక్తకవులకు తీర్థయాత్ర, పుణ్యక్షేత్రదర్శనం పరమానందదాయకాలు. మరి మధురకవి కూడా ఉత్తర భారతదేశంలోని 'బదరి'లాంటి క్షేత్రాలు దర్శించి ఆపై అయోధ్య దర్శించాడు. శ్రీవైష్ణవులకు శ్రీమద్రామాయణం శరణాగతి శాస్త్రం. అంతేగాక, అయోధ్యా, రామ సందర్శనం అందరికి అబ్బేది కాదు. శ్రీరామ చంద్రులవారు నడయాడిన ప్రదేశాలను మధురకవి ఆళ్వార్ భక్తిశ్రద్ధలతో దర్శించి సేవిస్తుండగా ఒకనాటి రాత్రి తూర్పు దిక్కున ఒక దివ్యతేజం దృగ్గోచరమైంది. మధురకవి ఆ తేజాన్ని చూచి ఆశ్చర్యపడ్డారు. దావాగ్నేమోనని అను కొన్నారు. కాని వెనువెంటనే అదొక దివ్యతేజమని గ్రహిం చారు. రాత్రి, పగలు గడిచింది. మరల రాత్రివేళ ఆ దివ్య తేజం కనబడడంతో వీరు బహుశః తూర్పుదిక్కున ఏదో ఒక వింత ఉందని భావించి ఆ తేజస్సును దర్శిస్తూ చివరకు 'కురుకా పురి' చేరారు. ఆ పట్టణం దాటిపోతుంటే దివ్యతేజం కనబడలేదు. చివరకు కురుకాపురిలోనే ఏదో ఒక 'తేజస్సు' నిత్యమూ ప్రవేశిస్తున్నదని ఆ నగరంలోనే సంచారం చేయసాగారు.

ఆ కురుకాపురిలోని ప్రజలు ఆదినాథస్వామి ఆలయవిశేషాలను చెబుతుంటే చెవి యొగ్గి విన్నారు. అంతే కాదు ఆ ఆలయంలో చింతచెట్టు తొఱ్ఱలో ఒక తేజం గురించి చెబుతుండగా ఆళ్వార్లు వడివడిగా ఆ గుడి కేసి అడుగులు వేశారు. అక్కడ ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలతో దర్శనీయమైన ఆకారం కనిపించింది. ఆ సుందరాకారానికి ఆళ్వార్ సాష్టాంగదండ ప్రమాణం చేశారు.

చింతచెట్టు తొఱ్ఱలోని శఠకోపులలో చలనం కనిపించలేదు. మధురకవిఆళ్వార్ చెట్టు దగ్గరికి వెళ్లి కరతాళధ్వని చేశారు. ఆ సవ్వడికి శఠకోపులు కొద్దిగా కళ్లు తెరచి మరల మూసుకున్నారు. మధురకవికి వేదాంత సంబంధ సంశయాలెన్నో. తన సంశయం తీర్చేవారెవరని చాల రోజుల నుండి తపించేవాడు. చివరకు దివ్యతేజం తనకు సమాధానం చెప్పగలదని గ్రహించారు. తమ సంశయాలకు సమాధానాలు తెలుసుకున్నారు. ఆ జవాబు

ల్లోని అంతరార్థాన్ని అవగతం చేసుకొని మధురకవి ఆళ్వార్ తొల్లిలోని మూర్తి తత్త్వమూర్తి అని గ్రహించగలిగారు. చివరకు "స్వామీ! మీ దర్శనంతో నా జన్మ పావనమైంది. ఇన్నాళ్ల శ్రమకు ఫలితం దక్కింది. మీ పాదారవిందాలే నాకు గతి. నేను కడతేరడానికి మీరే మార్గం చూపాలి" అంటూ నమస్కరించారు. జిజ్ఞాసువైన శిష్యుడు లభించడం కూడా లోకంలో అంత తేలిక కాదు. కానీ మధురకవి ఆళ్వారు పట్ల నమ్మాళ్వారుకు విశ్వాసం కలిగింది. శ్రీవైష్ణవ తత్త్వార్థాలను సరళశైలిలో బోధిస్తూ ప్రపత్తి గొప్పతనాన్ని స్పష్టపరచారు.

ఆ ఉపదేశాలలో మధురకవి ఆళ్వారుకు నచ్చిన అంశాలు 'సదాచార్య సమాశ్రయణ' మార్గం. ఆచార్యులంటే మూర్తీభవించిన మహావిష్ణువని గ్రహించారు. మహావిష్ణువే ఆచార్యులై జీవుల నుద్ధరించగలరని భావించారు.

ఆళ్వారులలో తక్కువ పాశురాలు పాడిన వారిలో తిరుప్పాణ్ ఆళ్వార్ ఒకరైతే మరీ చిన్నది, మధురమైన లఘుకావ్యాన్ని పాడినవారు మధురకవి ఆళ్వార్. అదే వైష్ణవ వాఙ్మయంలో సుప్రసిద్ధమైన 'కణ్ణినుణ్ శిరుత్తాంబు'. తల్లి కృష్ణుని అల్లరి భరించలేక తాటితో కట్టడానికి ప్రయత్నించింది. తాళ్లేమో సరిపోలేదు. ముళ్లతాటితోనే కట్టింది. భక్తవత్సలుడైన స్వామి కట్టుబడ్డాడు. సదాచార్యుని ద్వారానే స్వామి కట్టుబడగలడని మధురకవి ఆళ్వార్ అభిప్రాయం.

మధురకవి ఆళ్వార్ తమ గురువు వైకుంఠం చేరడంతో వికలచిత్తులయ్యారు. సమస్తము ఆ ఆళ్వారుకు అంధకారబంధురమైంది. చివరకు తేరుకొని తమ ఆచార్యులకు ఒక ఆలయం నిర్మించి, ఆగమానుగుణంగా పూజాదులు నిర్వర్తిస్తూ చివరకు పరమపదం చేరుకున్నారు.

50 స్వర్ణోత్సవ సంచిక సప్తగిరి సచిత్ర మాసపత్రిక 1970-2020

సంతత మాధవసంకీర్తనములచే
మధురకవియనగ మహిని వెలసె
తీర్థయాత్రల వేళ దివ్యతేజముగాంచి
ఆ దిక్కు చూపుగా అడుగు వేసె
చింతతొల్లిలలోని దివ్యతేజము గాంచి
సఫలజన్ముడగుచు సంతసించె
ఆచార్యభక్తియే అతిముఖ్యమని యెంచి
జీవితాంతము తాను సేవ జేసె

చింతచెట్టుసమీపాన చిత్తమలర
భక్తి వకుళాభరణులకు భవ్యమైన
ఆలయంబు నిర్మించిన అనఘుడతడు
అట్టి మధురకవికి నేను అంజలింతు!!

# సంతోషాన్ని.. తెచ్చింది...!

- శ్రీ జమలాపురం ప్రసాదరావు, 78425 01843.

వచ్చిందదండీ! వచ్చింది
సప్తగిరి మాసపత్రిక వచ్చింది
స్వర్ణోత్సవ సంబరాలతో
సంతోషాన్ని తెచ్చింది!

స్వామిలీలలు, సంస్థల సేవలు
భక్తుల రచనలు, స్వామి మహిమలు
కొండపై నున్న కోనేటిరాయుడి
వింత లన్నిటినీ కళ్లకుకట్టినట్లుగా
చూపే పత్రిక వచ్చింది
సంతోషాన్ని తెచ్చింది!

సత్యం ధర్మం శాంతి సహనం
భక్తుల మదిలో నిండుగ
నూరేళ్లు కలుగజేయ
వచ్చిందండి! వచ్చింది
సప్తగిరి మాసపత్రిక
స్వర్ణోత్సవసంచిక
సంతోషాన్ని తెచ్చింది!

పిల్లలు పెద్దలు మహిళల
మనసు దోచిన పత్రిక
సప్తగిరి మాసపత్రిక
స్వర్ణోత్సవసంచిక
పఠనానుభవాలతో, భక్తుల
అనుభూతి అనుభవాలతో,
వచ్చిందండి! వచ్చింది
సంతోషాన్ని తెచ్చింది!

# విష్ణువొక్కడే విశ్వాత్మకుడు

అన్నమయ్య శ్రీహరిని శరణుపొందిన భక్తాగ్రేసరుడు. పంచముద్రలను ధరించి 'సర్వం విష్ణుమయం జగత్' అనే విశ్వాసంతో శ్రీవేంకటేశ్వరుని త్రికరణశుద్ధిగా నమ్మి తన సర్వస్వాన్ని స్వామి పాదాలముందు అర్పణచేసి తాను తరించి తన వంశం వాళ్లకందరికి తరుణోపాయం చూపిన వైష్ణవోత్తముడు అన్నమయ్య. ఆయన రచించిన సంకీర్తనలలో అధ్యాత్మసంకీర్తలన్నీ ఈ విషయాన్ని నిరూపిస్తాయి. ఆత్మ, పరమాత్మ, ప్రకృతి అనే మూడంశాల సంబంధం, సమన్వయం ప్రతి అధ్యాత్మ సంకీర్తనలోని విషయం. ఆయన రచించిన శృంగార సంకీర్తనలలో కూడా అధ్యాత్మ తత్త్వం గోచరిస్తున్నదంటే ఆయన మనస్సు ఎంత తాత్త్వికమో తెలుస్తుంది. 'కామి గాక మోక్షకామి గాడు' అన్న మానవ మానసిక తత్త్వం ఆయన సంకీర్తనలకు అక్షరాలా సరిపోతుంది. ప్రేమ నుండి దివ్యప్రేమ పుట్టడం మహాత్ముల అనుభవంలోని విషయం. దీనిని మరొక రకంగా చెపితే శృంగారం నుండి అధ్యాత్మతత్త్వం అవతరించడమని చెప్పాలి. శృంగార అధ్యాత్మ భావాల సమ్మేళనమే మానవ జీవితం. ఇది భారతీయసాహిత్య లక్షణం కూడా.

శరణాగతి ఒక తత్త్వంగా రామాయణాదికావ్యాలలో, భాగవతాది పురాణాలలో ప్రపంచింపబడింది. ఈ అంశాన్ని శాస్త్రీయం చేశారు వైష్ణవాచార్యులు. భాగవత సంప్రదాయం వీళ్లచేతులలో శరణాగతి విద్యగా రూపుదిద్దుకొన్నది. అన్నమయ్య వైష్ణవ సాహిత్యాన్ని ఆమూలాగ్రం చూచినవాడు. ఈయన సంకీర్తనలలో వైష్ణవ సంప్రదాయం బాగా కనిపిస్తుంది.

ఎవరిని శరణుపొందాలి? ఉపాస్యదైవం ఎవరు? అనే విషయాలను వివరించడానికి ముందు అన్నమయ్య వైష్ణవమంటే ఏమిటో చెప్పాడు.

**వలెనను వారిదె వైష్ణవము - ఇది వలపు దేనె పో వైష్ణవము**
**కోరిక లుడుగుచు గుతి నన్నిటిపై - వైరాగ్యమె పో వైష్ణవము**
**సారెకు కోపము చలము తనలో - వారించుట పో వైష్ణవము**

ఈ సంకీర్తనలో విష్ణుత్వమే వైష్ణవమని, విష్ణువొక్కడే దేవుడని చెప్పబడింది. సుఖదుఃఖములంటనిది, ఇంద్రియాలకు వశం కానిది వైష్ణవం. సకలోపాయాలను వదలి వేంకటేశ్వర నామాన్ని వదనం మీదికి చేర్చడం వైష్ణవం. 'విష్ణువొక్కడే విశ్వాత్మకుడు– వైష్ణవమే సర్వంబును' అనే సంకీర్తనలో సృష్టియావత్తూ నారాయణుని మహిమ వలననే వర్ధిల్లుతున్న దంటాడు. పరమేష్ఠి బ్రహ్మాండ సృష్టి, హరుని సంహారశక్తి,



– ఆచార్య గల్లా చలపతి,
98858 26626

ఇంద్రుని పరిపాలన శ్రీహరిమహిమ వలననే జరుగుతున్నాయని చెపుతాడు. పంచభూతములలోని గుణాలు, నవగ్రహవిహారాలు, కాలత్రయ ధర్మాలు, అంతటాగల మాయా విలాసాలు, పరమపద భోగాలు అన్నీ శ్రీవేంకటేశ్వరుని మహిమలేనని అన్నమయ్య నిర్ణయించాడు. నారాయణుడే పరబ్రహ్మమని, ఆ పరబ్రహ్మం ఒక్కటేనని 'బ్రహ్మ మొక్కటే' అనే సంకీర్తనలో చెప్పాడు.

ఆ పరబ్రహ్మను ఎవరికి తోచిన రీతిలో వారు ఆరాధిస్తున్నారని 'ఎంతమాత్రమున నెవ్వరుదలచిన- అంత మాత్రమే నీవు' అంటూ పరబ్రహ్మలోని వైవిధ్యాన్ని ప్రకటించాడు. తాను నమ్మిన ఈ విషయాలను శరణాగతి పొందడానికి అనువుగా ఇతరులకు బోధించడానికే సంకీర్తనలకెక్కించాడు.

వైష్ణవంలో ఆచార్యునికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆచార్యుని దైవంగా త్రికరణ శుద్ధిగా నమ్మాలి. ఆచార్య విశ్వాసం శరణాగతికి మూలమంత్రం.

'వేడుకతో నాచార్య విశ్వాసము గలిగి - జాడల శరణాగతి సాధనముతో కూడి, శ్రీవేంకటేశ్వరు గొలిచి దాసుడౌటే - వీడని బ్రహ్మానంద వేదాంత రహస్యము' అనే సంకీర్తనలో అన్నమయ్య ఈవిషయం స్పష్టంచేశాడు. ఆచార్య భక్తిగలవాడే పరబ్రహ్మను సాక్షాత్కరించుకొనునని 'ఆచార్య వాన్ పురుషో వేదః' అనే శ్రుతివాక్యం చెపుతున్నది. దివ్య ప్రబంధాలను సంతరించిన ఆళ్వారులు కూడా ఒకరకంగా ఆచార్యులే. అయితే ఆళ్వారుల పాశురాలలో నిక్షిప్తమైన శరణాగతి విద్యను వివరించిన ఆచార్యులలో రామానుజుల వారు ముఖ్యులు. ఆచార్య ప్రభావం ఆలకించి శ్రద్ధతో శరణాగతిని పాటించినప్పుడే మోక్షం కరతలామలకం అవుతుందని అన్నమయ్య సంకీర్తనలలో విశదం చేశాడు.

**అన్నిటా నా వెనకటి అపరాధమేమి**
**మన్నించి నా గురు జూచి మానవయ్యా**

అనే సంకీర్తనలో అన్నమయ్య తనలో దోషములేమైనా ఉంటే తన గురువును చూచి తనను మన్నించమని స్వామిని వేడుకొన్నాడు.

పరిపూర్ణమైన విశ్వాసంతో హరిని కొలవడం శరణాగతి. శరణాగతి తప్ప ప్రపన్నులకు మరొక ఉపాయం లేదు. స్వామి శరణు పొందడానికి కూడా ఒక ఉపాయం కావాలి. శరణాగతి చేసిన జీవికి ఉపాయం తనంతట తానే స్ఫురిస్తుంది. అన్నమయ్యకు ఉపాయమూ, ప్రాప్యమూ రెండూ శ్రీవేంకటేశ్వరుడే.

**'సర్వోపాయములు జగతి నాకితడే**
**పుర్వీధరుడు పురుషోత్తముడితడే'**

అని నమ్మినాడు అన్నమయ్య. 'నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని' ఉన్న వాళ్లకు వేరే ఉపాయం ఎందుకని అన్నమయ్య ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానం అన్నమయ్యకు స్వామిపై ఉన్న అచంచల విశ్వాసం. రక్షిస్తావో.. రక్షించవో..! అనే సందేహం మనసులో లేదు. ఇతరులలో ఉన్నందున పొందిన దైన్యం, వెతలలో చిక్కినపుడు కలిగే వెఱపు అన్నమయ్యకు లేవు.

నిత్య నైమిత్తిక కర్మలను భగవత్పరం చేయడం శరణాగతిలోని మరోఅంశం. భగవత్పరం కాని నిత్య కృత్యాల వల్ల జీవునికి పరమాత్మకు ఎడం ఏర్పడుతుంది. ఈ ఎడం పోవాలంటే సమస్త కర్మలు భగవత్పరం కావాలి. కాకున్న సంసార గతులేల? లోక కంటకములగు లోభంబులేల?

**వినికి గనవలసినను విష్ణుకీర్తన చెవికి -**
**వినికి చేసిన నదియె వేదాంతబోధ**

**మనికి గనవలసినను మధువైరిపై భక్తి -**
**యునికి ప్రాణులకు బ్రహ్మోపదేశంబు**

**చదువు గనవలసినను శౌరినామము దిరుగ -**
**జదువుటే సకల శాస్త్రముల సమ్మతము**

**నిదుర గనవలసినను నీరజాక్షునికి దన -**
**హృదయమర్పణసేయుటది యోగనిదుర**

ఈ సంకీర్తనలో కనిపించే విష్ణు కీర్తన, వేదాంతబోధ, మధువైరిపై భక్తి, బ్రహ్మోపదేశం, శౌరినామం, శాస్త్ర సమ్మతం, యోగనిదుర మొద లైన విషయాలు వైష్ణవ సంప్రదాయానికి సంబంధించినవైనా ఇవన్నీ అన్నమయ్య జీవి తంలో ఏర్పడిన అనుభవాలే. సంప్రదాయం, అనుభవం రెండూ చక్కగా కలసిపోయి సంకీర్తనలలో కనిపిస్తాయి.

స్వామిని శరణు పొందిన పురాణ పురుషుల కథల ద్వారా భక్తులను శరణాగతికి ప్రోత్సహించడం అన్నమయ్య చేసిన మరో మంచిపని.

కొనరో కొనరో మీరు కూరిమి మందు -
ఉనికిమనికి కెల్ల నొక్కటే మందు
ధ్రువుడు గొనిన మందు తొల్లి బ్రహ్లాదుడు -
చవిగొనిన మందు చల్లనిమందు
భవరోగములు వీడి పారగ పెద్దలు మున్ను -
జవకట్టి కొనిన నిచ్చలమైన మందు

అనే ఈ సంకీర్తనలో సంసార మగ్నత అనే రోగానికి మందు శ్రీహరి సేవనమేనని నిశ్చితమైన నిర్ణయం కనిపిస్తు న్నది. ప్రహ్లాదాది పురాణ పురుషులెందరో ఈ మందును సేవించి ధన్యులైన విషయాన్ని ఈ సంకీర్తన గుర్తుచేస్తున్నది.



సంసార మగ్నతే కాక జరామరణాది భవరోగాలను పోగొట్టు కోడానికి వివేకవంతుడు పరమాత్ముడనే ఔషధాన్ని సేవించా లంటున్నాడు అన్నమయ్య.

'ఒక్కడే మోక్ష కర్త వొక్కటే శరణాగతి- దిక్కని హరిగొల్చి బతికిరి తొంటివారు' అనే సంకీర్తనలో చెప్పిన విషయాలు 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అనే గీతలోని చరమ శ్లోక భావాన్ని గుర్తుకు తెస్తాయి. మోక్ష విషయంలో తలెత్తిన అనేక సందేహాలను ఈ సంకీర్తన నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నది.

వైష్ణవంలో దాసానుదాసత్వానికి ఒకప్రత్యేకత ఉంది. ఇది గురుశిష్యసంబంధాన్ని, సేవ్యసేవక సంబంధాన్ని వివరించే ఒకమార్గం. హరిదాసుడు, దాసాను దాసుడు వంటి మాటలు వైష్ణవ వాఙ్మయంలో ఎక్కువగా కనిపిస్తాయి.

ఇన్నిటికి నీశ్వరేచ్ఛ యింతేగాక -
తన్నుతానే హరిగాచు దాసుడైతే చాలు

మిమ్ము నెఱిగిన యట్టి దాసుల నెఱిగే-
సమ్మతి విజ్ఞానమే చాలదా నాకు

దైవమా నీకంటె నీదాసులే నేర్పరులు

మేటి తపముల మెచ్చి కైకొనని నీవు -
గాటపు దాసులైతేనే కైకొని మన్నించితివి

ఇత్యాది సంకీర్తనల పంక్తులు అన్నమయ్య శరణా గతికి అవసరమైన దాసానుదాసత్వాన్ని ప్రకటిస్తున్నాయి.

మధురభక్తి సంప్రదాయం శరణాగతి తత్త్వమే. శృంగారాత్మకమైన భక్తి మధురభక్తి. ఇది అధ్యాత్మ శృంగారం. అధ్యాత్మభావాలలో శృంగారం ప్రదర్శించడం, శృంగార భావాలలో అధ్యాత్మభావాలను చూపడం పదసాహిత్యంలోనే కనిపిస్తున్న ప్రత్యేక విషయం. ఇది అన్నమయ్యతోనే మొదలు కాకున్నా ఆయన సంకీర్తనల ద్వారానే ఒక సిద్ధాంతంగా రూపొందింది. శృంగార సంకీర్తనలలో శ్రీవేంకటేశ్వరుడు నాయకుడుగా నానావిధ నాయికలను జోడించి సంయోగ, వియోగభేదాలతో, శృంగార రీతులతో రచన సాగించిన అన్న మయ్యది నాయిక స్థానం. నాయిక లక్షణాలను తనలో ఆరోపించుకొని నాయకుని సంపర్కం కోసం చేసిన ప్రయత్నం అనేక సంకీర్తనలలో కనిపిస్తుంది. ఇందులో పరమాత్మ సాక్షాత్కారం కోసం తపస్సు చేసే యోగి లక్షణముంది. పరమాత్మభావం మనసులో ఏర్పడిన స్థితికి మించిన వైభవం మరొకటుండదన్నాడు అన్నమయ్య.

*గత సంచిక తరువాయి భాగం.....*

అయితే మాట తప్పిన నందుడు తాను సహాయం చేస్తానని ఎప్పుడు చెప్పాను? అందుకు సాక్ష్యం చూపించం దని అన్నాడు. కాశిపండితులు చేసేదేమీ లేక రాజు ప్రమాణం చేసిన చాముండేశ్వరీదేవిని సాక్ష్యానికి రమ్మని వేడుకున్నారు.

భక్తులు అడిగినదే తడవుగా వారివెంట వచ్చి నందుడికి యథార్థం తెలియజేసింది. తప్పు తెలుసుకున్న నందుడు నందవరాన్ని వారికి అగ్రహారంగా ధారాదత్తం చేసి, సాక్ష్యంగా వచ్చిన మాతను అక్కడ కొలువుండమని వేడుకున్నాడు. ఆ మాతే నేడు సాక్షిమాత చౌడేశ్వరిగా నంద వరంలో కొలువుతీరింది.

ఈ వివరణ అంతా గౌనిపల్లి రామప్పకవి ప్రణీతమైన చౌడేశ్వరీమాహాత్మ్యంలో పేర్కొనబడింది. ఈ నందవర అగ్రహారానికి చెందిన బ్రాహ్మణులు నందవరీకు లయ్యారు. ఆ నందవరీకవంశానికి చెందినవారే తాళ్లపాక వారు.

నందవరాగ్రహారంనుండి కడపజిల్లా, రాజంపేటమండలంలోని తాళ్లపాకకు రావడం వలన, తాళ్లపాకలో అన్నమాచార్యుల వంశీకులు స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవడం వలన వీరి ఇంటి పేరు తాళ్లపాకగా స్థిరపడి పోయింది. వీరి గోత్రం భారద్వాజ సగోత్రం. అశ్వలాయనసూత్రం.

ఇక అన్నమయ్య పూర్వీకుల విషయానికి వస్తే,

నందవరాన్వయార్ణవ సుధాకరుఁడు
గురు భరద్వాజస గోత్రుండు పాప
హరబుద్ధి యాశ్వలాయన సూత్రశాలి
నారాయణుండను నయవేది వేద
పారాయణుఁడు విష్ణుపద భక్తిరతుఁడు
అనఘుని విట్ఠలాహ్వయుఁ గాంచె; నతఁడు
కనియె నారాయణు ఘన యశోనిధిని
నతఁడు విట్ఠలుఁ గాంచె; నతఁడు లోకైక
సుతుఁడైన నారాయణుని తండ్రియయ్యె;

(అన్నమాచార్య చరిత్ర ద్విపద, పుట. 72, 73)

నందవరాన్వయంలో జన్మించిన నారాయణుడు వేదపారాయణుడు, విష్ణుభక్తుడు. ఇతనికి విట్ఠలుడనే కుమారుడున్నాడు. ఆ విట్ఠలుడికి నారాయణుడనే కుమా రుడు, ఆ నారాయణుడికి విట్ఠలుడనే కుమారుడు, అతనికి లోకైక సుతుడైన నారాయణుడనే కుమారుడు, ఆ నారా యణుడికి నారాయణ సూరి అనే కుమారుడు కలిగాడు. ఆ నారాయణసూరి కుమారుడే అన్నమయ్య.

సిరివరు మెప్పించి చెలఁగి యాదేవు
వరమునఁ దనయంత వారిఁ బుత్రకుల
నరసయాచార్యు నున్నత యశోధనునిఁ
దిరుమలాచార్యుని ధీ విశారదునిఁ



గాంచి, వారును దన కరణి విద్యలను
గాంచనాంబరు భక్తి కలిమిఁ బెంపొంద
శౌరి కథా సుధా సల్లాప గరిమ
ధారుణి నెంతయుఁ దనరారు చుండె;
(అన్నమాచార్య చరిత్ర ద్విపద, పుట. 422)

అన్నమయ్య శ్రీనివాసుని వరప్రసాదంతో తనంతటి వారైన పిల్లలను కన్నాడు. వారిలో నరసయాచార్యుడు పెద్ద కొడుకు. రెండవ కొడుకు తిరుమలాచార్యుడు. నరసయా చార్యుడు అన్నమయ్య మొదటి భార్య అయిన తిరుమలమ్మ (తిమ్మక్క) కుమారుడు. రెండవ భార్యయైన అక్కలమ్మ కుమారుడు తిరుమలాచార్యుడు. ఈ తిరుమలాచార్యుడే పెదతిరుమలాచార్యుడిగా ప్రసిద్ధి పొందాడు.

నరసయాచార్యునికి నాంచారమ్మ, అనంతమ్మ అనే ఇద్దరు భార్యలు. వారి పిల్లలు నారాయణ, అప్పళార్య, అన్నయార్య. పెదతిరుమలాచార్యుని భార్య తిరుమలమ్మ. వీరి సంతానం చినతిరుమలయ్య, అన్నయ, పెదతిరువేంగళ నాథుడు, తిరువేంగళనాథుడు (చిన్నన్న), కోనేటి తిరువేంగళ నాథుడు. అన్నమయ్యకు కుమారులతో పాటు కుమార్తె కూడా ఉంది. ఆవిడ పేరు తిరుమలాంబ. ఈవిడ భర్త తిరుమల కొండయార్యుడు. వీరి సంతానం రేవణూరి వేంకటార్యుడు. ఇలా వృద్ధిచెందిన అన్నమయ్య సంతానం, వారి సంతానం అందరూ తమ తమ రచనలతో, పదాలతో ఆ కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరుని సేవలో జన్మను ధన్యం చేసుకొన్నవారే. ఈ పండిత కుటుంబంలో ఏ ఒక్కరూ తక్కువ వారు కారు.

## నారాయణుడు

అన్నమాచార్యుల ప్రపితామహుడు విట్ఠలడు. ఈయన కుమారుడే నారాయణుడు. విట్ఠలుడు తన కుమారు డైన నారాయణుడికి తానే విద్యాభ్యాసం చేయ తలపెట్టాడు. తండ్రి బిడ్డకు మొదటి గురువు కావడం ఈ కాలంలో విడ్డూరమేమో కానీ, నిన్నటి మొన్నటి తరం వరకూ అది సహజమే కదా. విట్ఠలుడు కూడా తన కుమారుడికి తానే చదువు చెప్పే ప్రయత్నం చేశాడు. కానీ, నారాయణుడు ఎందుకో తన దగ్గర సరిగా విద్యాభ్యాసం చేయలేక పోతున్నాడని తలచి, రాజంపేటకు దగ్గరిలోని ఊటుకూరులో తమ బంధువుల దగ్గర ఉంచి, మరొక గురువుగారి వద్దకు పంపాడు. ఆ సమీప బంధువులు నారాయణుడిని కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నారు. ఊటుకూరి బడిలో చేరిన తరువాత కూడా నారాయణుడి చదువు వెనుకంజలోనే కానీ ముందడుగు పడటం లేదు. ఆ బడిలోని అయ్యవారు నారాయణుడికి చదువు చెప్పడానికి అనేక రకాలుగా ప్రయత్నించాడు.

గొదుకుచు గురుఁడును గొన్నాళ్లు తోడఁ
జదివెడు పడుచుల చందంబు చూపి
సామంబు చేతనె చదివించి చూచి
యామీఁదఁ గొన్నినా ళ్లదలించి చూచి
మఱి కొన్ని దినములు మైనొత్తి చెప్పి
వెఱ పారఁ దఱటున వేయించి చూచి
......................................
మొనసిన కోదండమున వ్రేలవేసి
కోలగగ్గెరఁ ద్రోసి గుంజిళ్ళఁ బెట్టి
పైలావు దొరుఁగంగ బడిపెట్టు పెట్టి
(అన్నమాచార్య చరిత్ర ద్విపద, పుట. 78, 79)

కొత్తగా బడిలో చేరిన పిల్లవాడిని అయ్యవారు అది ఒప్పచెప్పు, ఇది నేర్చుకొనిరా అని బెదరకొట్టకుండా, ఆ విద్యార్థికి బడి అలవాటు అయ్యే వరకూ పక్క విద్యార్థులను చూచి నేర్చుకొమ్మనడం సహజం. ఊటుకూరు బడిలోని అయ్యవారు నారాయణుడి విషయంలో కూడా ఆ పనే చేశాడు. నారాయణుడిలో విద్యపట్ల శ్రద్ధ కలిగించడానికి అతనితో పాటు చదువుకొనే పిల్లలను చూపించి వాళ్ళ లాగా చదువుకొమ్మని లాలనగా చెప్పాడు. చెప్పిన పాఠాలు సరిగా చదవక పోతుంటే బెదిరించి చూశాడు. భయపెట్టాడు. బెత్తంతో కొట్టాడు, చెంపలు వాయించాడు, శరీరాన్ని బాధ పెట్టాడు. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా అతనికి చదువు అలవడకపోయేసరికి గుంజిళ్లు తీయించాడు, కోదండం వేయించాడు. ఇలా ఎన్ని విధాలుగా దండించినా నారా యణుడికి చదువు అబ్బలేదు. (ఇంకా ఉంది)



# శ్రీ ఆంజనేయ అష్టోత్తర శతనామావళి

# శ్రీ ఆంజనేయ అష్టోత్తర శతనామావళి

ఓం శ్రీఆంజనేయాయ నమః
ఓం మహావీరాయ నమః
ఓం హనుమతే నమః
ఓం మారుతాత్మజాయ నమః
ఓం తత్త్వజ్ఞానప్రదాయ నమః
ఓం సీతాదేవీముద్రాప్రదాయకాయ నమః
ఓం అశోకవనికాచ్ఛేత్రే నమః
ఓం సర్వమాయావిభంజనాయ నమః
ఓం సర్వబంధవిమోక్త్రే నమః
ఓం రక్షోవిధ్వంసకారకాయ నమః (10)

ఓం పరవిద్యాపరీహారాయ నమః
ఓం పరశౌర్యవినాశనాయ నమః
ఓం పరమంత్రనిరాకర్త్రే నమః
ఓం పరయంత్రప్రభేదకాయ నమః
ఓం సర్వగ్రహవినాశినే నమః
ఓం భీమసేనసహాయకృతే నమః
ఓం సర్వదుఃఖహరాయ నమః
ఓం సర్వలోకచారిణే నమః
ఓం మనోజవాయ నమః
ఓం పారిజాతద్రుమూలస్థాయ నమః (20)

ఓం సర్వమంత్రస్వరూపవతే నమః
ఓం సర్వతంత్రస్వరూపిణే నమః
ఓం సర్వయంత్రాత్మకాయ నమః
ఓం కపీశ్వరాయ నమః
ఓం మహాకాయాయ నమః
ఓం సర్వరోగహరాయ నమః
ఓం ప్రభవే నమః
ఓం బలసిద్ధికరాయ నమః
ఓం సర్వవిద్యాసంపత్ప్రదాయకాయ నమః
ఓం కపిసేనానాయకాయ నమః (30)

ఓం భవిష్యచ్చతురాననాయ నమః
ఓం కుమారబ్రహ్మచారిణే నమః
ఓం రత్నకుండలదీప్తిమతే నమః
ఓం సంచలద్వాలసన్నద్ధలంబమాన శిఖోజ్వలాయ నమః
ఓం గంధర్వవిద్యాతత్వజ్ఞాయ నమః
ఓం మహాబలపరాక్రమాయ నమః
ఓం కారాగృహవిమోక్త్రే నమః
ఓం శృంఖలాబంధమోచకాయ నమః
ఓం సాగరోత్తారకాయ నమః
ఓం ప్రాజ్ఞాయ నమః (40)

ఓం రామదూతాయ నమః
ఓం ప్రతాపవతే నమః
ఓం వానరాయ నమః
ఓం కేసరీసుతాయ నమః
ఓం సీతాశోకనివారణాయ నమః
ఓం అంజనాగర్భసంభూతాయ నమః
ఓం బాలార్కసదృశాననాయ నమః
ఓం విభీషణప్రియకరాయ నమః
ఓం దశగ్రీవకులాంతకాయ నమః
ఓం లక్ష్మణప్రాణదాత్రే నమః (50)

ఓం వజ్రకాయాయ నమః
ఓం మహాద్యుతయే నమః
ఓం చిరంజీవినే నమః
ఓం రామభక్తాయ నమః
ఓం దైత్యకార్యవిఘాతకాయ నమః
ఓం అక్షహంత్రే నమః
ఓం కాంచనాభాయ నమః
ఓం పంచవక్త్రాయ నమః
ఓం మహాతపసే నమః
ఓం లంఖిణీభంజనాయ నమః (60)

ఓం శ్రీమతే నమః
ఓం సింహికాప్రాణభంజనాయ నమః
ఓం గంధమాదనశైలస్థాయ నమః
ఓం లంకాపుర విదాహకాయ నమః
ఓం సుగ్రీవసచివాయ నమః
ఓం ధీరాయ నమః
ఓం శూరాయ నమః
ఓం దైత్యకులాంతకాయ నమః
ఓం సురార్చితాయ నమః
ఓం మహాతేజసే నమః (70)

ఓం రామచూడామణిప్రదాయ నమః
ఓం కామరూపిణే నమః
ఓం పింగళాక్షాయ నమః
ఓం వార్ధిమైనాకపూజితాయ నమః
ఓం కబలీకృతమార్తాండమండలాయ నమః
ఓం విజితేంద్రియాయ నమః
ఓం రామసుగ్రీవసంధాత్రే నమః
ఓం మహారావణమర్దనాయ నమః
ఓం స్ఫటికాభాయ నమః
ఓం వాగధీశాయ నమః (80)

ఓం నవవ్యాకృతిపండితాయ నమః
ఓం చతుర్బాహవే నమః
ఓం దీనబంధవే నమః
ఓం మహాత్మనే నమః
ఓం భక్తవత్సలాయ నమః
ఓం సంజీవననగాహర్త్రే నమః
ఓం శుచయే నమః
ఓం వాగ్మినే నమః
ఓం దృఢవ్రతాయ నమః
ఓం కాలనేమిప్రమథనాయ నమః (90)

ఓం హరిమర్కటమర్కటాయ నమః
ఓం దాంతాయ నమః
ఓం శాంతాయ నమః
ఓం ప్రసన్నాత్మనే నమః
ఓం శతకంఠ మదాపహృతే నమః
ఓం యోగినే నమః
ఓం రామకథాలోలాయ నమః
ఓం సీతాన్వేషణపండితాయ నమః
ఓం వజ్రదంష్ట్రాయ నమః
ఓం వజ్రనఖాయ నమః (100)

ఓం రుద్రవీర్యసముద్భవాయ నమః
ఓం ఇంద్రజిత్ప్రహితామోఘ బ్రహ్మాస్త్ర నివారకాయ నమః
ఓం పార్థధ్వజాగ్రసంవాసినే నమః
ఓం శరపంజరభేదకాయ నమః
ఓం దశబాహవే నమః
ఓం లోకపూజ్యాయ నమః
ఓం జాంబవత్ప్రీతివర్ధనాయ నమః
ఓం సీతాసమేతశ్రీరామపాదసేవాధురంధరాయన నమః (108)





## కరోనా వ్యాధి విపత్తు నుండి మానవాళిని సంరక్షించాలనే మహదాశయంతో తి.తి.దే. నిర్వహించిన శ్రీశ్రీనివాసశాంత్యుత్సవ సహిత ధన్వంతరి మహాయాగం, శ్రీనివాసవేదమంత్ర ఆరోగ్యజపయజ్ఞం దృశ్యాలు









# దివ్యక్షేత్రం... తిరుమల

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

09

*గత సంచిక తరువాయి భాగం...*

## బ్రహ్మోత్సవాలు

కలియుగంలోని భక్తుల రక్షణకోసం బ్రహ్మాది దేవతల కోరిక మేరకు, శ్రీమహావిష్ణువు తిరుమలకొండపైన వేంకటేశ్వరుడిగా కన్యామాసంలో శ్రవణ నక్షత్రం నాడు స్వయంవ్యక్తమూర్తిగా ఆవిర్భవించినాడు.

ఆ రోజును పురస్కరించుకొని బ్రహ్మదేవుడు ఆ రోజుకు పూర్తి అయ్యేట్లుగా తొమ్మిది రోజులు ముందు నుంచి శ్రీనివాస భగవానునికి ఉత్సవాలు నిర్వహించాడు. ఆనాటినుంచి ఈ ఉత్సవాలు "బ్రహ్మోత్సవాలు' అని ప్రసిద్ధిని పొందాయి.

చాంద్రమానంప్రకారం అధికమాసం వచ్చిన సందర్భంలో "వార్షిక బ్రహ్మోత్సవం" కన్యామాసంలోను, "నవరాత్రి బ్రహ్మోత్సవం" తులామాసంలోను ఇలా రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

### అంబరాన్నంటే బ్రహ్మోత్సవ సంబరాలు

శ్రవణనక్షత్రం రోజుకు పదినాళ్ల ముందుగా **ధ్వజారోహణతో** ప్రారంభమై, చివరగా, **చక్రస్నానం, ధ్వజావరోహణంతో** ముగిసే ఈ పదినాళ్ల బ్రహ్మోత్సవ వేడుకల సంరంభాన్ని, సంబరాల్ని వర్ణించడం సాధ్యం కాదు చూచి తీరవలసిందే.

మొదటి రోజు రాత్రి **పెద్దశేషవాహనంతో** ప్రారంభమైన ప్రతిరోజు ఉదయం రాత్రి వరుసగా **చిన్న శేషవాహనం, హంసవాహనం, సింహం, ముత్యపు పందిరి, కల్ప వృక్షం, సర్వ భూపాల వాహనం, మోహినీ అవతారం, గరుడోత్సవం, హనుమద్వాహనం, గజవాహనం, సూర్యప్రభ, చంద్రప్రభ, రథోత్సవం, అశ్వవాహనం.** ఇలా జరిగే వాహనోత్సవాల్లో శ్రీనివాసుని వైభవం అనంతం! అప్రమేయం! అచింత్యం!!

ఈ బ్రహ్మోత్సవంలో ముఖ్యంగా ఐదవనాటి రాత్రి జరిగే బంగారు గరుడోత్సవం, ఎనిమిదవరోజు ఉదయం జరిగే రథోత్సవాలను దర్శించడానికి రెండు కన్నులు చాలవు.

శ్రీవారి గరుడోత్సవం రోజున మూలవిరాట్టునకు అలంకరించే **మకరకంఠి, లక్ష్మీహారాలు, సహస్రనామ మాలలు,** మద్రాసునుంచి కొత్త గొడుగులు, **శ్రీవిల్లి పుత్తూరు గోదాదేవి మాలలు.** ఇలా అనేక విశేషమైన వాటితో తిరుమల వీధులలో బంగారు గరుడునిపై విహరించే వేంకటేశుణ్ణి, ఆ ఒక్కరోజు దర్శించడానికి లక్షలాది భక్తులు తిరుమల చేరుకుంటారు.



బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాల్లో **బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు, యతీశ్వరులు, బాలబాలికలు, కన్యలు, పుణ్యాంగనలు, వితంతువులు, విధురులు, కుంటి, గుడ్డి, వికలాంగులు, అధికారులు, అనధికారులు, పండితులు, పామరులు, ధనికులు, పేదవారు, ఉద్యోగులు, ఉద్యోగార్థులు, కార్యార్థులు, శరణార్థులూ, అర్థార్థులూ.** ఇలా వారూ వీరూ అనకుండా ఎందరెందరో, మరెందరో కలియుగ వైకుంఠుని దర్శించడానికి వస్తారు.

ముఖ్యంగా ఏడాదికి ఒకమారు పదినాళ్లపాటు జరిగే బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్నంటుతాయి.

ఏడుకొండల్లో ఒకవైపు గోవిందలు పెడుతూ కొండలు ఎక్కుతున్న భక్తజనం. మరోవైపు భక్తితో భజన చేస్తున్న భజనబృందాలు ఇంకోవైపు **కోలాటనృత్యాలు, చెక్క భజనలు, హరికథలు, బుర్రకథలు, పగటివేషాలు, పుష్కరిణీస్నానాలు, దర్శనాలు, నున్నటిగుండ్లతో** తిరునామాలతో సాక్షాత్తు నామాలవాని **ప్రతిరూపాలు**గా కన్పడే భక్తులు, **నిత్యాన్నదానాలు, ప్రసాద వితరణలు...** యాత్రికుల సేవలో అహరహం శ్రమిస్తున్న దేవస్థానం ఉద్యోగస్థులు, **శ్రీవారిసేవక బృందాలు, స్కౌట్లు, ......., ఆరోగ్యాధికారులు, అర్చక స్వాములూ, ధార్మిక ప్రసంగాలు..** ఇలా ఒక్కరేమిటి ఒక్కటేమిటి ఎందరెందరో ఎన్నోవిధాల ఆనందంగా కోలాహలంగా సంబరంగా కనపడతాడు.

ఇక బ్రహ్మోత్సవం జరిగే రాత్రుళ్లలో తిరుమలక్షేత్ర సౌందర్యం వర్ణనాతీతం! తిరుమల అంతటా **స్వాగత తోరణాలు, ఆలయప్రాకారాలు, మండపాలు, పుష్కరిణి, సత్రాలు..** ఇలా సర్వేసర్వత్రా తిరుమలలో మిరుమిట్లు గొలుపుతున్న విద్యుద్దీపాలలో శోభాయమానంగా అలంకరింపబడుతుంది.

బ్రహ్మాదిదేవతలు, ఇతరలోక దేవతలు జ్యోతిస్స్వరూపాలుగా దిగివచ్చి బ్రహ్మాండనాయకుని ఉత్సవాన్ని వీక్షిస్తున్నారా అన్నట్లుగా ఉంటుంది తిరుమల క్షేత్రం. ఈ సందర్భంలో ప్రత్యేకత పుష్పాలంకరణ. శ్రీవారి ఆలయం అంతటా రకరకాల పుష్పాలతో, సుగంధాలను వెదజల్లే పూలతో శ్రీవారి ఆలయం, సర్వత్రా అలంకరించడం దేవస్థానంవారి, పుష్పవనాలశాఖ ప్రత్యేకత!

అవన్నీ కన్నులారా చూస్తూ మనసారా ఆస్వాదించవలసిందే తప్ప చెప్పడానికి మాటలు చాలవు. లేవు కూడ.

### పుష్పయాగం

శ్రీవారి బ్రహ్మోత్సవ నిర్వహణలో దోషాల నివారణార్థం అతివృష్టి, అనావృష్టులు తొలిగి లోక క్షేమంకోసం ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాల అనంతరం కార్తిక మాసంలో శ్రవణ నక్షత్రం రోజున శ్రీదేవి భూదేవీ సమేతంగా శ్రీమలయప్పస్వామికి 'పుష్పయాగం' జరుగుతుంది.



క్రీ.శ. 15వ శతాబ్దంలో జరుగుతున్న పుష్పయాగం ఎప్పుడు నిలిచిపోయిందో తెలియదు. మళ్లీ 1980 నవంబరు 14 తేది నుంచి పునరుద్ధరింపబడి తిరుమలలో శ్రీవారికి నిర్వహింపబడుతున్నది.

పుష్పయాగం నాటి ఉదయంపూట తిరుమంజనం, మధ్యాహ్నం సమయంలో రంగురంగుల వివిధ, సుగంధ పుష్పాలతో 21 మారులు శ్రీ స్వామివారిని అర్చిస్తారు.

**గోవింద! గోవిందా! గోవింద!!!**

*(ఇంకా ఉంది)*



అనువు గాని చోట అధికుల మనరాదు

# ఆధ్యాత్మిక సిరి

- శ్రీ దేగల అనితాసూరి
92475 00819

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీఏడుకొండల స్వామిని దర్శించడంకోసం ప్రతి భక్తుడూ ఎంతగా తపిస్తాడో, అలాగే శ్రీవారిని గురించి ఎన్నెన్నో తెలియని విషయాలను చదివి తెలుసుకుని మైమరిచిపోవాలని కూడా అలాగే అనుకుంటారు. అటువంటి సంతృప్తిని, ఉపయోగకరమైన విషయాలను ఎన్నిటినో **'సప్తగిరి'** మాసపత్రిక అందిస్తూ భక్తులకు మీదుమిక్కిలి సేవచేస్తున్నదని చెప్పటం ఎంత మాత్రమూ అతిశయోక్తి కాదు.

ఎన్నెన్నో వ్యయప్రయాసలకోర్చి సుదూరప్రాంతాల నుంచీ తిరుమలకు వచ్చే భక్తులకు జనబాహుళ్యంలో విరివిగా ప్రచారంలో ఉన్న ఏవో కొన్ని సంగతులు తప్ప అన్ని వివరాలూ తెలీవు. **'సప్తగిరి'** పత్రికద్వారా తెలియని వారికే కాకుండా తెలిసినవారిని కూడా మళ్లీ చదివి ఆనందించే విధంగా స్వామివారి కైంకర్యాలు, బ్రహ్మోత్సవ శోభ, ప్రసాదాల రకాలు, వివిధ సమయాల్లో జరిపించే సేవలు, అలంకారాలు, ఏ సమయాల్లో ఏ నైవేద్యం నివేదిస్తారన్న విషయాలు చాలా ఆసక్తిదాయకంగా పత్రికా సిబ్బంది అందిస్తోంది.

తిరుమలగిరుల్లో చూడదగ్గ ప్రదేశాల గురించి, చుట్టుప్రక్కల ఆలయాల గురించి సవివరమైన సమాచారం అందిస్తున్నారు. అంతేకాకుండా, పిల్లలు కూడా పాలుపంచుకునే విధంగా 'బాలవాక్కు' పేరున ప్రచురిస్తున్న శీర్షిక బాలబాలికలకు ప్రోత్సాహకరంగా ఉంటోంది.

సప్తగిరిలో ఎన్నో పుణ్యతీర్థాలు, పుట్టుక, వైశిష్ట్యాలను మరియు పురాణ విషయాలను చక్కగా రాస్తున్నారు. అలాగే, ఆయుర్వేదం శీర్షికతో భక్తుల ఆరోగ్యపరిరక్షణకోసం ఎటువంటి కృత్రిమపద్ధతులూ లేకుండా పాటించేవిగా తెలియజేస్తున్నారు. విశేషమైన స్వామివారి ఉత్సవమూర్తుల చిత్రాలను మధ్యపేజీలలో ఆనందపరవశమందేలా ప్రచురిస్తూ పాఠకుల మదిని చూరగొంటున్నారు. నిష్ణాతులైన జ్యోతిష్యశాస్త్రాగ్రేసరులు వారఫలాలు వైకుంఠపాళి ద్వారా పాఠకుల్లో పురాణాల మీది జిజ్ఞాసను పెంచుతున్నారు. కేవలం రచయితలు మాత్రమే పాలుపంచుకునే పత్రికగా కాకుండా, భక్తులు తమ అనుభవాలు, అనుభూతులను పంచుకుని నమ్మలేని నిజాలను ఆనందబాష్పాలతో లిఖించి తరించేందుకు స్వామి లీలలను కూడా అందిస్తున్నారు. ప్రతి గృహస్థు మరియు ఇల్లాండ్రకు పండుగలు, పాటించాల్సిన పద్ధతులు, దానివెనుక ఉన్న కథనాలు ముద్రిస్తూ భక్తులకు **'సప్తగిరి'** పత్రిక ఎంతో సహాయపడుతోంది. ప్రశాంత చిత్తమే ఆధ్యాత్మిక భావానికి మూలం. ఆధ్యాత్మిక జీవన విధానమే సంపూర్ణమానవత్వానికి కారణం కాగలదనే సత్యాన్ని యాభై సంవత్సరాలుగా తెలియజేస్తున్న పత్రిక **'సప్తగిరి'**.

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

## గోదాతలకు విజ్ఞప్తి

1) **దేశవాళీ గోవులను తిరుపతిలోని తి.తి.దేవస్థానమునకు సంబంధించిన శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాలనందు మాత్రమే ముందస్తు అనుమతితో స్వీకరించబడతాయి.**

2) **ఆరోగ్యవంతమైన దేశవాళీ గోజాతి ఆవులు మాత్రమే స్వీకరించబడుతాయి.**

**-గోసంరక్షణాధికారి, తి.తి.దే., తిరుపతి**





# శ్రీరామదూతం శిరసా నమామి!



- డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య,
90148 78108


ప్రపంచంలో ప్రభువుకు ప్రశస్తి రావటం సులభం. కాని, ఒక వ్యక్తి ప్రభువు దగ్గర సేవకుడుగా ఉంటూ పది మందిలో పేరు పొందటం, విశేషించి తన ప్రభువుతో సమానంగా ఒక పూజ్యత సంపాదించటం అసంభవం కాక పోవచ్చు గాని అసాధారణం అని మాత్రం అనక తప్పదు. అందులోను ప్రభువు గుణవంతుడయ్యెనా ప్రక్కనున్న వాని ప్రజ్ఞలు రాణించడం చాలాకష్టం. సూర్యుని ముందు చుక్క ప్రకాశించగలదా? కాని సుగుణాభిరాముడైన శ్రీరాముని వంటి మహా ప్రభువుకు సేవకుడై, ఆయనతో పాటు తానూ ఆలయాలు నిర్మింపచేసుకుంటూ, ఆయనతో పాటు తానూ అర్చనలందుకొంటూ "శ్రీరామదూతం శిరసా నమామి" అనే స్తోత్రానికి పాత్రుడైన సేవకోత్తముడు ఆంజనేయుడు. అసాధారణమైన ఇంత ప్రశస్తి, అపారమైన ఇంత పూజ్యత రామదూతగా ఆంజనేయుడు ఎలా ఆర్జించగలిగాడు? అందుకు కారణం ఆయన వ్యక్తిత్వం. అమేయమైన ఒక శక్తి, అద్భుతమైన యుక్తి, ఆచంచలమైన భక్తి సంగమించిన ఒక మహాపవిత్ర త్రివేణీ తీర్థం ఆంజనేయుని వ్యక్తిత్వం. అందుచేతనే ఆ రామదూతకు అంత ప్రశస్తి లభించింది. అంత పూజ్యత కలిగింది.

కాగా శ్రీమద్రామాయణంలో– శ్రీరాముని జీవిత మార్గంలో అంజనేయుడు నిర్వహించిన పాత్రగూడ అత్యద్భుతం; ఎంతో ప్రధానం. అయోధ్యకు మిథిలకు వియ్యాన్ని కూర్చి సీతారాముల వివాహానికి కారణభూతుడైంది విశ్వామిత్రుడైతే, అయోధ్యకు కిష్కింధకు నెయ్యాన్ని కూర్చి సీతారాముల పునస్సమాగమానికి కారణభూతుడైంది ఆంజనేయుడు. సీతాన్వేషణకు, రాక్షససంహారానికి అవసరమైన వానరబలాన్ని సుగ్రీవసఖ్యంద్వారా శ్రీరామునికి సమకూర్చిన వ్యక్తి ఆంజనేయుడు. అందుచేతనే వాల్మీకిమహర్షి ఆంజనేయపాత్రను శ్రీమద్రామాయణంలో ఎంతో కీలకమైన సన్నివేశంలో ఒక కొలికి పూసలా ప్రవేశపెట్టాడు.

అది రమణీయ పంపాసరోవరం. సుగంధ శీతల జల మయం. నానావిధ తరులతా పుష్పసంశోభితం. ఆ కొలను ప్రక్కనే ఒక మహాపర్వతం–ఋశ్యమూక మహాపర్వతం. నానావిధ ధాతు సమన్వితం అనేకానేక ఫలభార వినమ్రవృక్ష పరివృతం. రాజ్యాన్ని వదలి, భార్యావియోగదుఃఖంతో ఆ కొలనుగట్టున ఒక పిచ్చివానివలె తమ్మునితో గూడ తిరుగుతున్నాడు – శ్రీరామచంద్రుడు. తన రాజ్యాన్ని, భార్య రుమను అపహరించిన అన్న చేత తన్నులు గూడ తిని భయభ్రాంతుడై ఆ పర్వత శిఖరం మీద బ్రతుకుజీవుడా అని నలుగురు సహచరులతో కాలం గడుపుతున్నాడు– సుగ్రీవుడు. ఇద్దరూ ఆపదల్లో చిక్కుకున్న వారే. ఇద్దరూ సర్వసమర్థులే. జీవితంలో అలాంటి వాళ్ల మధ్య సఖ్యం ఏర్పడితే అది ఉభయత్రా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఎన్నో మహాకార్యాలను సాధిస్తుంది. కాని వీరిద్దరికి సఖ్యం ఏర్పడటం ఏలా? అటు కొలనుగట్టున శ్రీరాముడు; ఇటు కొండకొన మీద సుగ్రీవుడు. ఈ స్థితిలో ఆంజనేయుడు సుగ్రీవుని దూతగా శ్రీరాముని దగ్గరకు వచ్చాడు. ఎంతో చాకచక్యంగా తన శక్తియుక్తుల్ని ప్రదర్శించాడు. శ్రీరామ సుగ్రీవసఖ్యాన్ని సాధించాడు. ఉత్తమదూతకు ఉదాహరణగా నిలిచాడు. కార్యసాధనకు మారుపేరుగా కీర్తికెక్కాడు.

లోకంలో ఏ మహాకార్యాన్ని సాధించటానికైనా మొదట అవసరమైంది శక్తి. శక్తి మానవునికి మూల ధనం. అది శారీరకం, మానసికం అని రెండురకాలు. కేవలం శారీరకశక్తిగాని, కేవల మానసికశక్తిగాని స్వయం సంపూర్ణతను సాధించలేవు. ఈ రెండింటి కలయికే మహా కార్యసాధనకు గట్టిపునాది. ఆంజనేయుడు పుట్టుకతోనే బల వంతుడు. మహాబలుడైన వాయుదేవుని పుత్రుడు. దివ్యాంశ గల అంజనకు తనయుడు.



బాల్యంలోనే సూర్యమండలం దాకా ఎగిరిన శక్తిమంతుడు. ఉదయభానుణ్ణే ఫలమని భక్షించటానికి ప్రయత్నించిన సాహసవంతుడు. వజ్రాయుధం దెబ్బకు హతుడు కాకుండా బ్రతికిన వీర్యవంతుడు. ఇంద్రుని మెప్పుతో స్వచ్ఛందమరణాన్ని, బ్రహ్మ అనుగ్రహంతో అవధ్య త్వాన్ని వరాలుగా పొందిన అదృష్టవంతుడు. అందుకు తోడు ఆంజనేయునిది ఆజన్మబ్రహ్మచర్యం. బ్రహ్మచర్యం శక్తిసంవ ర్ధకం. ఇక ఆయన బలానికి అవధి ఎక్కడ!

రామాయణంలో ఆంజనేయుని దేహబలం ప్రకట మైన ఘట్టాలు అనేకాలు ఆశ్చర్యజనకాలు. సీతాన్వేషణ ఘట్టంలో సముద్రలంఘనం ఒక పెద్ద సమస్య, అంగదుని నాయకత్వంలో సీతాన్వేషణకు బయలుదేరిన వానర బృందానికి దక్షిణసముద్రతీరంలో అదొక విషమసమయం. ఒకవైపు సుగ్రీవాజ్ఞ. మరొకవైపు మహాసముద్రం. ముందు నుయ్యి. వెనుక గొయ్యి. ముందుకు వెళ్లి ఈ మహాసము ద్రాన్ని దాటటం ఏలాగ? వెనుకకు వెళ్లి ఆ సుగ్రీవుణ్ణి చూడటం ఏలాగ? వానరులంతా ఎంతోసేపు ఆలోచించారు. సతమతమయ్యారు. సమస్య పరిష్కారం కాలేదు. ఒకరు అంత దూరం దాటగలనన్నారు. మరొకరు ఇంత దూరం దాటలేమన్నారు. అంతేగాని సొంతం సముద్రాన్ని దాటి తిరిగి రాగలనన్న వారు ఎవ్వరూ లేరు. చివరకు జాంబవంతుడు గూడ తొంభైయోజనాలే దాటగలనన్నాడు. అంగదుడు నూరుయోజనాలన్నాడు. అయితే వెనుదిరిగి రావటం అనుమానాస్పదమన్నాడు. అందువల్ల ఏం ప్రయో జనం? అదొక దిక్కుతోచని స్థితి. దిగులుతో అందరు క్రుంగిపోతున్న స్థితి. అంత జరుగుతున్నా ఆంజనేయుడు ఏకాంతంగా ఎక్కడో మౌనంగా కూర్చొన్నాడు గాని ముందుకు వచ్చి మాట్లాడలేదు. జాంబవంతుడు చూచాడు. ఆంజ నేయుని చెంత చేరాడు. కొండంత ఆశతో పలుకరించాడు.

'వానరలోకవీరా! సర్వశాస్త్ర విదాంవర! ఏమీపట్ట నట్లు ఇలా కూర్చున్నావేమి? బలంలో, బుద్ధిలో, తేజస్సులో, సత్త్వంలో నీవు సర్వప్రాణుల కంటే మిన్న. అయినా నీ శక్తి నీవు తెలియలేకున్నావు' అని ప్రశంసించాడు. ఆ ప్రశంసతో ఆంజనేయుడు పొంగిపోయాడు, పొగలేని నిప్పులా ప్రజ్వరి ల్లాడు. అలనాటి త్రివిక్రమునిలా విజృంచాడు. తన శక్తి తాను తెలుసుకున్నాడు. సముద్రాన్ని క్షోభింపచేస్తానన్నాడు. పర్వతాలను చూర్ణం చేస్తానన్నాడు. లంకనే పెకలించి తెస్తా




నన్నాడు. ఒక్కసారిగ మేనుపెంచి, సర్వశక్తుల్ని పుంజీభవింప జేసి ఆ మహేంద్ర పర్వతం మీదినుండి ఆకాశమార్గాని కెగిరాడు. మహోద్ధత మైన ఆ హనుమంతుని ఊరువేగానికి మహాపర్వతం మీది వృక్షాలన్నీ పట్టుదప్పి, పెల్లగిలి పైకిలేచి, సాగనంపటానికి వెంట వెళ్లే బంధువుల్లా చాలదూరం ఎగిరాయట. మద్దిచెట్లవంటి మహావృక్షాలు గూడ మహారాజును అనుసరించే సైనికుల్లా చాలదూరం సాగిపోయాయట. ఆంజనేయుని జవసత్త్వాలట్టివి!

కాగా, కేవలం శారీరిక బలం, బుద్ధిబలం ఉన్నంత మాత్రాన ఒక వ్యక్తి జీవితంలో ఉన్నతస్థాయి నందుకోలేడు. ఉత్తమదూత కాలేడు. పల్లంవైపు ప్రవహించటం నీటికెంత సహజమో, స్వార్థం వైపు మొగ్గటం శక్తి యుక్తుల కంత సహజం. మితిమీరిన స్వార్థం సమాజానికి ప్రమాదకరం. వ్యక్తికి పతనకారణం. అందుచేత ఒక వ్యక్తి శక్తియుక్తులు సద్వినియోగం కావాలంటే, అవి అతని ఉన్నతికి, సమాజ కల్యాణానికి దోహదం చెయ్యాలంటే భక్తి గూడ ఉండాలి. భక్తిహృదయ పవిత్రత; ఆశయశుద్ధి; ఆత్మార్పణ.

ఆంజనేయుడు రామభక్తుడు. మహాభక్తుడు. ఆ రాముని చూచింది మొదలు ఆంజనేయుని అంతరంగం భక్తిభావంతో నిండిపోయింది. కాలం గడిచేకొద్దీ అది అపారంగా పెరిగింది. రామశబ్దం విన్నా, రామనామం అన్నా ఆ మహాభక్తునిలోని అణువణువు పులకించేది. పరవశతనొందేది. ఆంజనేయుడు ఒక సుగుణాభిరామునికి, ఒక ధర్మమూర్తికి, ఒక పురుషోత్తమునికి తన అంతరంగం అర్పణ చేసుకున్నాడు.

ఒక మహాకార్యానికి తన శక్తియుక్తుల్ని వినియోగించాడు. జీవితాన్నే చరితార్థం చేసుకున్నాడు.



రామాయణంలో రామకార్యతత్పరుడైన ఆంజనేయుడు ఎన్నో అద్భుతవిజయాలు సాధించాడు. ఎంత మందికో ప్రాణదాతగా ఉపకరించాడు. సముద్రాన్ని లంఘించి ప్రాయోపవేశానికి పూనుకున్న అంగదజాంబవంతాది వానరవీరుల ప్రాణాలు నిలిపింది ఆంజనేయుడు. అశోకవనిలో ఆత్మహత్యకు పూనుకున్న సీతాదేవికి ఆశాకిరణంగా అగుపించి ఆమెను బ్రదికించింది ఆంజనేయుడు. విరహతాపంతో వాడిపోతున్న శ్రీరామునికి సీతాసందేశామృతాన్ని అందించింది ఆంజనేయుడు. శక్తివ్రేటుకు మూర్ఛితుడై కొన ఊపిరితో ఉన్న లక్ష్మణునికి సంజీవని తెచ్చియిచ్చి సజీవుణ్ణి చేసింది ఆంజనేయుడు. ఓషధీ పర్వతాన్ని తెచ్చి యుద్ధరంగంలో హతమైన సర్వవానర సైన్యాన్ని బ్రదికించింది ఆంజనేయుడు. శృంగిబేరపురంలో శ్రీరామాగమన శుభవార్తను గుహునకు అందించింది ఆంజనేయుడు. అన్నరాక కోసం అహోరాత్రాలు ఎదురు చూచే భరతునికి శ్రీరాముని రాకను చెవిని వేసింది కూడ ఆంజనేయుడే. ఈ విధంగా ఆంజనేయుడు ఎందరి ప్రాణాలనో నిలిపాడు. ఎంతమందికో శుభవార్తలందించాడు. సంతోషాన్ని కూర్చాడు.

తత్త్వవేత్తలు ఆంజనేయుని శబ్దస్వరూపుడంటారు. మంత్ర స్వరూపుడంటారు. పరమాత్మ సందేశాన్ని జీవాత్మకందించే దేవదూత అంటారు.

నిగూఢాలు, మహోన్నతాలు అయిన తాత్త్విక రహస్యాల మాట అటుంచి సామాన్యమానవదృష్టితో చూచినా ఆంజనేయునిది ఒక విశిష్ట వ్యక్తిత్వం. అది శక్తి, యుక్తి, భక్తి సంగమించిన ఒక పవిత్ర త్రివేణీ సంగమతీర్థం. వ్యక్తి ఔన్నత్యానికీ సమాజకల్యాణనికి దోహదం చేసిన ఒక మహనీయ జీవిత మార్గం. అందుచేతనే ఆయనకు అంతప్రశస్తి వచ్చింది. పూజ్యత లభించింది.


బాలప్రబోధం

# ఆనందరహస్యం

- శ్రీ ఆర్.సి. కృష్ణస్వామిరాజు, 93936 62821

తొండమానుడు రాజు. ఆ రాజు కార్తికపౌర్ణిమ రోజున శేషాచలం కొండలలోని అద్భుత సహజశిల్పకళా చమత్కారమైన తుంబురుతీర్థం దర్శించడానికి వెళ్లాడు. సనకసనందతీర్థం, నల్లగుండాలు మీదుగా దట్టమైన అటవీ లోయలో నడుచుకుంటూ తుంబురుతీర్థం చేరాడు. భూపరిణామక్రమంలో భాగంగా ఓ పెనుకొండ కొబ్బరిచిప్పలా రెండుగా విచ్చుకుని చివర్లో జలజలపారుతున్న తుంబురు తీర్థం జలపాతాన్ని చూస్తూ గంటలకొద్దీ గడిపాడు. పక్కనే ఉన్న తరిగొండ వెంగమాంబ గుహ వద్ద ఉన్న నిశ్చలానంద స్వామిని దర్శించుకున్నాడు. తనకు అష్టైశ్వర్యాలున్నా ఎందులోనూ ఆనందం కనిపించడం లేదనే బాధను వ్యక్తం చేశాడు. నిశ్చలానంద స్వామి చిన్నగా చిరునవ్వు నవ్వాడు.

అప్పుడే కాలినడకన కొందరు భక్తులు 'గోవింద' అని చెప్పుకుంటూ తిరుమల కొండకు నడిచి వెళుతున్నారు. వారు నడిచి నడిచి అలిసిపోయి ఉన్నారు. వారికి కడుపు నిండా అన్నం పెట్టమని స్వామి రాజుతో చెప్పాడు. వారు భోజనం పూర్తి చేసి వెళ్లేటప్పుడు రాజును వారి కళ్లలోకి చూడ మన్నాడు. వెంటనే రాజు తనతో వచ్చిన వంటగాళ్లను, భటులను పురమాయించి చకాచకా వంటలు చేయించాడు. వేడివేడిగా అరటి ఆకులో వడ్డించిన వంటలను కాలినడకన వచ్చిన భక్తులు ఆవురావురుమని తినసాగారు. వారు తింటున్నంతసేపూ రాజు కన్నార్పకుండా వారినే చూడసాగాడు.



భోజనమయ్యాక భక్తులు ప్రతిఒక్కరూ కృతజ్ఞతగా వచ్చి **'అన్నదాతా! సుఖీభవా!!'** అని చెప్పి వెళ్తుంటే రాజు తృప్తిగా తియ్యటి గుటకలు మింగాడు. రాజు ముఖంలోకి మెరుపు వచ్చింది. తనకి తెలీకుండానే కళ్లు ఆనందబాష్పాలు రాల్చాయి. అదే అదునుగా భావించిన స్వామి "మనం ఒకరి దగ్గరినుంచి ఏమైనా తీసుకుంటున్నామంటే మనం మన శక్తిని కోల్పోతున్నామన్న మాట. మనం ఒకరికి ఏదైనా ఇస్తున్నామంటే మనం శక్తిమంతులమవుతున్నామన్నమాట. మనం ఎవరికైనా ఏదైనా ఇవ్వడంలో సహజమైన ఆనందం ఉంటుంది. తీసుకోవడం కన్నా ఇవ్వడంలో ఉన్న ఆనందం పదింతలు గొప్పది" అని ఇవ్వడంలో ఉన్న గొప్పదనాన్ని రాజుకు విశదీకరించి చెప్పాడు.

ఆనందం యొక్క రహస్యం దానగుణంలో ఉందని గుర్తించిన రాజు మరిన్ని దానాలు చేయాలని నిర్ణయించుకుని స్వామి పాదాలకు నమస్కరించి తన రాజ్యానికి బయలుదేరాడు.

# శ్రీపేరుందేవి సమేత శ్రీకరివరదరాజస్వామి ఆలయం, సత్రవాడ

– శ్రీ వి.ఓ.సురేష్, 90030 68532

మన దేవాలయాలు

తిరుపతి– తిరుత్తణి ప్రధానదారిలో తిరుపతికి సుమారు 50 కి.మీ. దూరంలో ఉన్న ఊరు నగరి. అక్కడి నుండి పశ్చిమంగా 4 కి.మీ. దూరంలో సత్రవాడ అనే గ్రామం ఉంది. ఈ గ్రామం మధ్యలో శ్రీమహాదేవి సమేత శ్రీకరివరదరాజస్వామి భక్తులకు కనువిందు చేస్తూ కొలువై ఉన్నారు .

## స్థలపురాణం

ఈ ఊరికి దక్షిణాన మునిపల్లె అనే గ్రామం ఉంది. ఆ కాలంలో ఋషులు మునిపల్లెలో స్వామివారిని గురించి యజ్ఞయాగాదులు చేస్తూ వచ్చారు. అప్పుడు కరి అనే ఒక రాక్షసుడు ఆ యాగాల్ని చెరిపేందుకు ప్రయత్నించేవాడు. స్వామివారు ఋషుల వేడుకోలు విని రాక్షసులను వధించి, వారిని కాపాడి ఈ గ్రామంలో కరివరదమాణిక్య పెరుమాళ్‌గా అవతరించి భక్తులను పరిపాలిస్తున్నారు. ఈ గ్రామానికి సత్రవాడ అనే పేరు.

## ఉత్సవ పూజావిధానం

ఈ పుణ్యస్థలంలో వైఖానస ఆగమపూజా విధానంలో పూజలు జరుగుతాయి. ఈ గుడిలో జరిగే ఉత్సవాల్లో ముఖ్యమైంది చిత్రపౌర్ణమి. చైత్ర మాసం పౌర్ణమిరోజు స్వామివారు శ్రీదేవీ, భూదేవీ సమేతంగా కుశస్థలీ నదిలో వెలసి భక్తులను పరిపాలిస్తున్నారు. ఈ ఉత్సవం సుమారు 153 సంవత్సరాలుగా ఘనంగా నడుస్తోంది.

ఈ గుడిలో శ్రీమహాదేవీ సమేత కరివరదరాజస్వామీ, శ్రీపెరుందేవీ అమ్మవారు, శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీఆంజనేయస్వామి, శ్రీచక్రత్తాళ్వార్ ఉత్సవమూర్తులుగా ఉన్నారు.

## శ్రీవారి నక్షత్ర ఉత్సవాలు

ఈ ఆలయంలో శ్రీవారినక్షత్ర ఉత్సవాలు జరుగుతాయి. ఆదివారం శ్రీవీరఆంజనేయస్వామికి వారపూజలు, శుక్రవారం శ్రీకరివరద రాజస్వామివారికి వారపూజలు జరుగుతాయి. ఏకాదశి తిథి, రథసప్తమి, పెరటాశినెల పూజలు, మార్గశిరనెల పూజలు, కార్తికపూజలు, భోగి పండుగ వంటి రోజులలో విశేషఅభిషేకం, అలంకారం జరుగుతాయి. ప్రతిరోజు అర్చనలు, ఆరాధనలు జరుగుతాయి.







## శ్రీవీరాంజనేయస్వామి సన్నిధి

స్వామివారి సన్నిధికి బయట ఉత్తరాన దక్షిణదిశగా సుమారు 8 అడుగులకు పైగా శ్రీవీరఆంజనేయస్వామివారు గంభీరంగా దర్శనమిస్తున్నారు. ఈ ఆలయంలో కొలువై ఉన్న శ్రీఆంజనేయస్వామి సన్నిధానంలో చిన్నపిల్లలకు బాలారిష్ట దోషం పోవడానికి తీర్థాన్ని ముఖంపై చల్లే విశేషం ఒకటి ఉంది. శ్రీఆంజనేయస్వామి వారి బొమ్మలతో ఒక పతకం కూడా అర్చన చేసి పిల్లల మెడలో వేస్తారు.

## ఇతర సన్నిధానాలు

ఆలయంలో మూల స్థానంలో శ్రీకరివరదరాజస్వామి వారు పశ్చిమదిశగాకొలువై ఉన్నారు. శ్రీమహాదేవి అమ్మవారికి, గోదాదేవి అమ్మ వారికి, ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక సన్ని ధానాలు ఉన్నాయి. స్వామివారికి అభిముఖంగా గరుడాళ్వార్ కొలువై ఉన్నారు. స్వామివారి సన్నిధానానికి దగ్గరలో ఆళ్వార్, ఆచార్యుల మండపముంది.

ఈ ఆలయం 26-02-2009న తి.తి.దేవస్థానాల ఆధీనంలోకి వచ్చింది.

ఈ ఆలయంలో కొలువై ఉన్న స్వామివారిని, శ్రీవీరాంజనేయస్వామిని చుట్టు ప్రక్కల గ్రామాల నుండి అనేకమంది భక్తులు వచ్చి స్వామివారిని సేవించి ఆశీస్సులకు పాత్రులౌతున్నారు.

---

**విశ్వదాభిరామం**

## నీచుడు - గుణవంతుడు

**వేమన పద్యసూక్తి**

వేరుపురుగు చేరి వృక్షంబు చెఱుచును;
చీడపురుగు చేరి చెట్టు చెఱచు;
కుత్సితుండు చేరి గుణవంతు జెఱచురా;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థము:** వేరు= చెట్టు భూమిలోపలిభాగము; వేరుపురుగు= వేరుకు పట్టినక్రిమి; చీడపురుగు= చెట్లకు సస్యములకు హాని కలిగించు పురుగు.

**భావం:** వేరుపురుగు వేరు దగ్గరచేరి వృక్షాన్ని నాశనం చేస్తుంది. చీడపురుగు పట్టిందంటే చెట్టును నాశనం చేస్తుంది. అలాగే కుత్సితుడు గుణవంతుడిదగ్గరికి చేరి ఆతడిని చెడగొడతాడు.

**వివరణ:** వేరుకు పట్టినపురుగు చెట్టును ఆమూలాగ్రం నాశనం చేస్తుంది. ఇక చెట్టుపైన ఆకులకో, కొమ్మలకో పట్టినపురుగు తాను ఉన్నంతమేర చెట్టును పాడుచేస్తుంది. నీడ, పండ్లూ మొదలైనవి ఇస్తూ చెట్టు లోకానికి మేలు చేస్తూ ఉంటుంది. వేరుపురుగు, చీడపురుగూ ఆ చెట్టును పాడుచేసి దానివల్ల లోకానికి మేలు లేకుండా చేస్తాయి.



అలాగే చెడుబుద్ధి కలిగినవాడు మంచిగుణాలు కలిగిన వాడిదగ్గరకు చేరి, వాడిని కూడ చెడగొడతాడు. తాను ఎవరికీ ఉపయోగపడకపోగా, ఇతరులకు ఉపయోగపడే వాడిని కూడ ఉపయోగపడకుండా చేస్తాడు. కుత్సితుడు వేరుపురుగు.

*- విద్వాన్ కట్టా నరసింహులు, 9441337542*

భాగవత కథాసాగరం

# పుంసవనవ్రతం

– డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్,
98219 14642

పుంసవనవ్రత వృత్తాంతం శ్రీమద్భాగవతంలోని ఆరవ స్కంధంలో వస్తుంది. అసురమాతయైన దితి చేసిన ఈ వ్రత వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కశ్యప ప్రజా పతికి అదితి, దితి అని ఇద్దరు భార్యలు. అదితికి దేవతలు, దితికి దైతులు జన్మించారు.

హిరణ్యాక్ష హిరణ్యకశిపుల తరువాత దితి గర్భంలో నలుబది తొమ్మండుగురు మరుద్దేవతలు జన్మించారు. దితి గర్భంలో జన్మించినప్పటికీ ఇంద్రుడు వారికి దేవత్వాన్ని ప్రసాదించాడు. దీనికి సంబంధించిందే పుంసవనవ్రతము.

ఇంద్రునికి సహాయం చేయడానికి విష్ణుభగవానుడు హిరణ్యాక్ష హిరణ్యకశిపులను వధించాడు. తన పుత్రుల వధతో దితి హృదయం తల్లడిల్లింది. పుత్రవియోగంతో ఆమె హృదయంలో ఇంద్రుని పట్ల గొప్ప వైరభావం తలెత్తింది. తన కసి తీర్చుకోవడానికి ఇంద్రుణ్ణి చంపే పుత్రుడిని పొందడమే సరియైన ఉపాయమని ఆమె తలచింది. తన కోరిక తీరాలంటే భర్తయైన కశ్యపుని అనుగ్రహం ఉండాలి కాబట్టి దితి ఆయనను శ్రద్ధతో సేవించింది. దానికి సంతోషించి కశ్యపుడు వరాన్ని కోరుకోమన్నాడు.

మహాశక్తిశాలియైన తన భర్త ఆ విధంగా వరం ఇస్తానని చెప్పగానే దితి తన అసలు రూపం బయట పెట్టింది. "స్వామీ! నేనిప్పుడు నా పుత్రులను కోల్పోయాను. మీరు నాకు వరం ఇవ్వాలని అనుకుంటే ఇంద్రుని వధింప గలిగిన పుత్రుణ్ణి నాకు ప్రసాదించండి. విష్ణువు సహాయంతో ఇంద్రుడు నా పుత్రులను వధించాడు. అందుకే నేనీ వరాన్ని అడుగుతున్నాను" అని అన్నది. ఆమె మాట వినగానే కశ్యప ప్రజాపతి నోట మాట రాలేదు. ఆయన పూర్తిగా విషణ్ణు డయ్యాడు. తనకు ఇంద్రహత్య అనే పాపం సంప్రాప్తించ బోతోందని అతడు పరితపించాడు.

ఈ విధంగా మనస్సులో అనుకొని తనను తాను నిందించుకుంటూ కశ్యపుడు తన భార్యతో "కళ్యాణీ! నీ కోరిక తీరాలంటే నీవొక వ్రతం చేయవలసి ఉంటుంది. అందులో నా ఉపదేశం ప్రకారం నీవు వర్తించాలి. అప్పుడే ఇంద్రుని చంపగలిగే పుత్రుడు నీకు లభిస్తాడు. కాని ఆ వైష్ణవవ్రతపాలనలో భంగం వాటిల్లితే ఇంద్రునికి అను కూలుడైన పుత్రుని పొందుతావు" అని దీవించాడు.

దితి ద్వారా వైష్ణవ వ్రతపాలన చేయించడంలో కశ్యపుని ఉద్దేశ్యము ఆమెను వైష్ణవిగా మార్చడమే. ఆమె హృదయంలో ఇంద్రహత్య వాంఛను తొలగించి వ్రతపాలన ద్వారా పవిత్రతను కలిగించాలని ఆయన తలచాడు. తుచ్ఛ ప్రయోజనానికై భర్తను సేవించాలనుకుంది. కాని ఆమెకు సంపూర్ణ ఫలాన్ని కలిగించే యత్నం కశ్యపుడు చేశాడు. వ్రత నియమాల్ని ఆమెకు ఉపదేశించాడు.

"దేవీ! ఈ వ్రతపాలన సమయంలో హింస చేయ కూడదు. ఎవ్వరికీ హాని చేయకూడదు, ఎవ్వరినీ శపించ కూడదు, అసత్యం పలుకరాదు, గోళ్లను, జుట్టును కత్తి రించుకోకూడదు. కపాలం, ఎముకల వంటి పదార్థాల్ని తాకకూడదు. నీటిలో ప్రవేశించి స్నానము చేయకూడదు. కోపాన్ని ప్రదర్శించకూడదు. దుర్జనులతో సాంగత్యం కూడదు, దుర్జనులతో సంభాషణ వర్జనీయం. మురికి వస్త్రాలను ధరించకూడదు. ఒకమారు ధరించిన పూమాలను తిరిగి ధరించకూడదు. ఎంగిలిని భుజించకూడదు, కాళికా దేవి ప్రసాదాన్ని తినకూడదు, మత్స్యమాంసాదులతో కూడిన అన్నాన్ని భక్షించకూడదు. ఋతుమతియైన స్త్రీ చూచి, తాకిన ఆహారాన్ని భుజించకూడదు. దోసిలితో నీరు త్రాగ కూడదు."

"భోజనం తరువాత నోరు, కాళ్లుచేతులు కడుక్కో కుండా బయటకు వెళ్ళకూడదు. సంధ్యాసమయంలో జుట్టు విరబోసుకొని, లేదా ఆభరణాలతో అలంకరించుకోకుండా వీధిలోకి వెళ్లకూడదు. వాక్కును నిగ్రహించుకోకుండా లేదా శరీరాన్ని తగినట్లు కప్పుకోకుండా బయటకు వెళ్లరాదు. కాళ్లు కడుక్కోకుండా, శుచిగా కాకుండ, తడికాళ్ళతో పడుకో కూడదు. శిరస్సును పడమరదిక్కుగా గాని, ఉత్తరదిక్కుగా

గాని ఉంచి పడుకోకూడదు. నగ్నంగా శయనింపకూడదు. సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో నిద్రపోరాదు.

ఉతికిన బట్టలు కట్టుకుని, ఎల్లప్పుడు పవిత్రంగా ఉండి, పసుపు గంధాది మంగళకర ద్రవ్యాలతో అలంకరించుకొని పగటిపూట భోజనానికి ముందు గోబ్రాహ్మణులను, లక్ష్మీదేవిని, అచ్యుతుని అర్చించాలి. వ్రత సమయంలో పుత్రవతులు, ముత్తయిదువలకు స్త్రీలకు పూమాలలు, చందనం, ఆభరణాలు వంటివి కానుకగా ఇవ్వాలి. గర్భవతియైన ఆమె తన భర్తే గర్భంలో ఉన్నాడని తలస్తూ ధ్యానించాలి. ప్రియా! ఈ విధంగా నీవు సంవత్సర కాలం శ్రద్ధతో వ్రత పాలన చేస్తే ఇంద్రుణ్ణి చంపగల పుత్రుడు నీకు జన్మిస్తాడు. కాని వ్రతపాలనలో ఏదైనా దోషం కలిగితే నీ పుత్రుడు ఇంద్రమిత్రుడవుతాడు.

భర్త వ్రతవిధానాన్ని చెప్పిన దానిని పాటించడానికి దితి సమ్మతించింది. దితి చేపట్టిన వ్రతం గురించి ఇంద్రునికి తెలియగానే అతడు అప్రమత్తుడయ్యాడు. పినతల్లి చేపట్టిన వ్రతాన్ని భంగపరచే ఉద్దేశ్యంతో అతడు కపటంతో ఆమె ఆశ్రమంలోనికే వచ్చి దితికి జాగ్రత్తగా సేవలు చేశాడు. ఒకనాడు దితికి దైవవశాత్తుగా వ్రతభంగం కలిగింది. ఇంద్రుడు అష్టసిద్ధులు కలిగినవాడు. వ్రతభంగం జరిగినట్లు తెలియగానే అతడు సూక్ష్మరూపంలో ఆమె గర్భంలో ప్రవేశించి తన వజ్రాయుధంతో బంగారంలాగా ప్రకాశించే పిండాన్ని ఏడుముక్కలుగా ఖండించాడు. అయితే ఆ పిండ ఖండాలన్నీ కూడ ఏడవడం మొదలుపెట్టాయి. “ఏడవకండి, ఏడవకండి” అని అంటూ ఇంద్రుడు ఒక్కొక్క దానిని తిరిగి ఏడుఖండాలుగా ఖండించాడు. అప్పుడు ఆ నలుబదితొమ్మండుగురు చేతులు జోడ్చి “ఇంద్రా! మేము మరుత్తులము. నీ సోదరులము. మమ్మెందుకు చంపాలనుకుంటున్నావు?” అని అన్నారు. ఇంద్రుడు తన వారితో తనకెట్టి భయం లేదని, వారిని చంపే కార్యం విరమించాడు.

ఇంద్రుని వజ్రాయుధంతో ఖండించబడినప్పటికీ దితి గర్భస్థపిండము మరణించలేదు. పైగా భగవత్కరుణచే ఆ పిండము నలభైతొమ్మిదిమంది మరుత్తులుగా మారింది. సంవత్సర కాలం విష్ణువ్రతంతో కలిగిన ఆధ్యాత్మిక బలం చేత దితి గర్భసంజాతులు దేవతలయ్యారు. ఈ సంవత్సర కాల వ్రతఫలంగా దితి హృదయంలో మార్పు వచ్చింది. ఆమె పూర్తిగా పవిత్రురాలైంది. అప్పుడు ఆమె ఎదుట ఇంద్రునితో పాటు నలభైతొమ్మిదిమంది పుత్రులు కనిపించారు. వారంతా అగ్ని ప్రభలతో వెలిగిపోతున్నారు. ఆ పుత్రులందరూ ఇంద్రునితో మైత్రిని కలిగి ఉండడము చూసి దితి సంతోషించింది. అప్పుడు ఇంద్రుడు దితికి నమస్కరించి తన సోదరులైన మరుత్తులతో పాటు స్వర్గానికి వెళ్ళిపోయాడు.

దితిపుత్రులకు అమరత్వాన్ని ప్రసాదించిన పుంసవన వ్రత విధానం ఇలా ఉన్నది. మార్గశీర్షమాసంలో భర్త అనుజ్ఞతో పత్ని సమస్తాభీష్టప్రదాయకమైన ఈ వ్రతాన్ని ఆరంభించాలి. విష్ణు ఆరాధనకు ముందు ఆమె మరుత్తుల జన్మవృత్తాంతాన్ని వినాలి. యోగ్యులైన బ్రాహ్మణుల ఆదేశానుసారం ఆమె ప్రాతఃకాలములోనే కాలకృత్యాలను తీర్చుకొని శుచియై లక్ష్మీనారాయణుల అర్చనాన్ని ఆరంభించాలి. లక్ష్మీనారాయణులను యథావిధిగా స్తుతించిన పిమ్మట ఆమె మంత్రోచ్చారణతో పన్నెండు ఆహుతులను సమర్పించాలి. ధూపదీప నైవేద్యాలతో వారిని అర్చించిన తరువాత ఆమె భగవత్ప్రసాదాన్ని భర్తకు సమర్పించాలి. విధిగా ఈ వ్రతాన్ని ఆచరించే పురుషుడు ఈ జన్మలోనే భగవంతుని నుండి సమస్తకోరికలను పొందుతాడు. భార్య సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, పుత్రులను, దీర్ఘాయువు కలిగిన భర్తను, యశస్సును, చక్కని గృహాలను పొందుతుంది. అవివాహిత కన్య ఈ వ్రతాన్ని చేస్తే ఉత్తముడైన భర్తను పొందుతుంది. భర్తగాని, పుత్రుడు గాని లేని స్త్రీ ఈ వ్రతాన్ని చేస్తే ఆధ్యాత్మిక జగత్తుకు చేరుకుంటుంది. పుట్టగానే మరణించే సంతానాన్ని పొందే వనితకు దీని వల్ల దీర్ఘాయువు కలిగిన సంతతి జన్మిస్తారు. కురూపియైన స్త్రీ ఈ వ్రతం వలన సౌందర్యవతి అవుతుంది. ఈ వ్రతపాలన వలన రోగి ఆరోగ్యవంతుడౌతాడు. శ్రాద్ధకర్మలలో ఈ వ్రతపఠనం వల్ల దేవతలు, పితృదేవతలు సంతోషించి సమస్తాభీష్టాలు తీరుస్తారు. ఈ వ్రతపాలన చేసినవారి పట్ల శ్రీలక్ష్మీనారాయణులు ప్రసన్నులౌతారు. ఈ విధంగా పుంసవన వ్రతవిధానాన్ని శుకదేవగోస్వామి పరీక్షిన్మహారాజుకు సంపూర్తిగా వివరించారు.

బాలవాక్కు

# పగతీర్చుకోవడానికి కొడుకా...!

తరతమభేదాలు పాటించని ప్రేమానురాగాలు నిండిన ఉన్నతమైన స్నేహానికి ఉదాహరణగా కృష్ణ, కుచేలురను చెప్పుకుంటారు. దానికి విరుద్ధంగా అహంకార జనిత పరాభవాలతో, ప్రతీకారాలతో జీవితాలను ఉద్రిక్తం చేసుకున్న బాల్యమిత్రులు ద్రుపద, ద్రోణులు!

భరద్వాజఋషి కుమారుడైన ద్రోణుడు వేదాధ్యయనానంతరం అస్త్రవిద్యలు నేర్చుకోవడానికి అగ్నివేశుడనే గురువువద్ద శిష్యుడిగా చేరి ఆగ్నేయాది అస్త్రాలను సంపాదించాడు. అదే సమయంలో పాంచాల రాజు వృషతుడి కొడుకు ద్రుపదుడు కూడా అక్కడే విద్యాభ్యాసం చేస్తూండేవాడు. ఒకే గురువు వద్ద అస్త్రవిద్యను అభ్యసించడం వల్ల ఇద్దరికీ మంచి స్నేహం కుదిరింది. ఇద్దరూ ఒకే గురుకులంలో కలిసిమెలిసి ఉంటూ ధనుర్విద్య నభ్యసించారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక కొంతకాలానికి తండ్రి తర్వాత ద్రుపదుడు పాంచాల దేశానికి రాజయ్యాడు.

ద్రోణుడు కృపుడి చెల్లెలు కృపిని పెళ్లి చేసుకుని, అశ్వత్థామ అనే కొడుకును కన్నాడు. సంసారం ఈదే ప్రయత్నంలో సంపాదన మార్గం చూసుకోవాల్సి వచ్చింది. ఒక పట్టాన జీవనోపాధికి మార్గం కనిపించలేదు. సంసారం గడవడం రోజు రోజుకూ దుర్భరమై పోయింది. తన బాల్యమిత్రుడు ద్రుపదుడు ఇప్పుడు రాజయ్యాడు కదా సాయం చెయ్యకపోతాడా! అన్న ఆశతో అతడి వద్దకు వెళ్ళాడు.

అయితే, సింహాసనం అధిష్ఠించాక ద్రుపదుడిలో అహంకారం పెరిగిపోయింది. అతడు ద్రుపదుణ్ణి చూసి అతడి మాటలను ఏమాత్రం పట్టించుకోకుండా హేళనగా నవ్వి, "కటికదరిద్రుడివైన నీతో మహారాజునైన నాకు స్నేహమేమిటి? నువ్వెవరో నేనెరుగను వెళ్లు, వెళ్లు" అన్నాడు.

కాలం కలిసిరానప్పుడు తన నీడ కూడా తనకు శత్రువౌతుందని గ్రహించిన ద్రోణుడు ఆవేదనకు లోనయ్యాడు. బాధను దిగమింగుకుని అవకాశం కలిగినప్పుడు ద్రుపదుడికి సరైన గుణపాఠం నేర్పాలన్న నిర్ణయంతో వెనుదిరిగాడు.

ఆ తరవాత ద్రోణుడు హస్తినాపురం చేరి బాలురుగా ఉన్న కౌరవులకూ, పాండవులకూ ధనుర్విద్యా గురువుగా చేరాడు. వారిని అసమానవీరులుగా తీర్చిదిద్దాడు. ముఖ్యంగా అర్జునుణ్ణి సాటిలేని ధనుర్విద్యాకోవిదుణ్ణి చేశాడు. వాళ్ల విద్యాభ్యాసం ముగిశాక, "నాకు గురుదక్షిణ కావాలి," అని అడిగాడు.

"ఏం కావాలో ఉత్తరువివ్వండి," అని అడిగారు రాకుమారులు.

"ఐశ్వర్య మదంతో కొట్టుకుంటూన్న అవివేకి ద్రుపదుడు. అతణ్ణి పట్టి తీసుకురండి," అన్నాడు ద్రోణుడు.

గురువుగారి ఆజ్ఞ నెరవేర్చడానికి కౌరవ రాకుమారులు సేనలతో వెళ్లారుగాని, ద్రుపదుణ్ణి ఓడించడం వారి వల్ల కాలేదు.

అటుపిమ్మట అర్జునుడు భీముణ్ణీ, నకుల, సహదేవులనూ సాయంగా వెంటబెట్టుకుని వెళ్లి, యుద్ధంలో ద్రుపదుణ్ణి ఓడించి, పట్టి కట్టి తెచ్చి గురువుకు గురుదక్షిణగా సమర్పించాడు.




మాస్టర్ వి.ఎస్.సూర్యనారాయణ,
9వ తరగతి,
జెడ్.పి.హైస్కూల్,
సత్రవాడ.


ద్రోణుడు అవమానభారంతో తలవంచుకుని నిలబడ్డ ద్రుపదుణ్ణి చూసి, "ఎవరూ ద్రుపద మహారాజులుంగారా? ఇప్పుడు నీ రాజ్యం, రాజధాని కాంపిల్య నగరం నా వశమైంది. ఇప్పటికైనా నన్ను నీ బాల్యస్నేహితుడిగా గుర్తిస్తావా? నాకు రాజ్యాలు ఏలే వాళ్ల స్నేహమంటే చాలా



చేతగాని పలుకు చేటు దెచ్చు

ఇష్టం. కాని ఇప్పుడు నీకు రాజ్యం లేదు. నీ స్నేహం కోసం అర్ధరాజ్యం ఇస్తాను. తీసుకో," అంటూ హేళన చేశాడు.

ద్రుపదుడు పైకి మైత్రి నటించినప్పటికీ అవమానంతో దహించుకుపోయాడు. ద్రోణుణ్ణి హతమార్చే కుమారుణ్ణీ, తన్ను ఓడించిన అర్జునుణ్ణి అల్లుణ్ణి చేసుకోవడానికి ఒక కుమార్తైనా కనాలని, తపోసంపన్నులైన మునులను ఆశ్రయించాడు.

యాజుడనే ముని సాయంతో పుత్రకామేష్టి చేశాడు. యాజుడు అగ్నికుండంలో వేసిన హవిస్సు నుంచి ఒక చేత మెరుస్తున్న కత్తీ, మరొక చేత విల్లూ ధరించి, మణిమయ కిరీటంతో, రథారూఢుడై, దిక్కులు పిక్కటిల్లే లాగా సింహనాదం చేస్తూ ఒక యోధుడు పుట్టుకొచ్చాడు. అతడే ధృష్టద్యుమ్నుడు. ఆ తరవాత ఆ అగ్నికుండం నుంచే తేజస్విని అయిన ఒక స్త్రీ పుట్టింది. ఆమే ద్రౌపది.

కొంతకాలమయ్యాక ద్రుపదుడు ధృష్టద్యుమ్నుణ్ణి ద్రోణుడి వద్దకు అస్త్రవిద్యాభ్యాసం కోసం పంపాడు. నేర్పనంటే తనకు అపకీర్తి వస్తుందని ద్రోణుడు ద్రుపదరాజ కుమారుడికి విలువిద్య నేర్పాడు.

కురుక్షేత్రయుద్ధంలో తండ్రితో పాటు పాండవ పక్షంలో నిలబడి వీరోచితంగా పోరాడిన మహారథుడు ధృష్టద్యుమ్నుడు. పాండవులు క్రౌంచవ్యూహం, అర్ధచంద్రవ్యూహం, దేగవ్యూహం, మకరవ్యూహం, వజ్రవ్యూహం, సర్వభద్రవ్యూహం మొదలైన వ్యూహాలు పన్నడంలోనూ, కౌరవుల వ్యూహాలను ఛేదించడంలోనూ ధృష్టద్యుమ్నుడు కీలకపాత్ర వహించాడు. ద్రోణాదివీరులతో ఘోరంగా యుద్ధం చేశాడు.

భీష్ముడి పతనానంతరం సర్వసేనాధిపత్యం వహించిన ద్రోణుడు అతి భీకరంగా యుద్ధం చేశాడు. ధృష్టద్యుమ్నుడితో అతి భయంకరంగా యుద్ధం చేస్తూండగా– అశ్వత్థామ మరణించాడని ధర్మరాజు పలకడం ఆయన చెవిన పడింది. ద్రోణుడు విరక్తితో అస్త్రసన్యాసం చేసి, ప్రాయోపవేశం చేశాడు. అదే మంచి అదనుగా ధృష్టద్యుమ్నుడు ఆయన శిరస్సును ఖండించాడు!

యుద్ధానంతరం తొడలు విరిగి పడివున్న దుర్యోధనుడి దగ్గరికి వచ్చిన అశ్వత్థామ, అతడి దుస్థితికి జాలిపడి, తెల్లవారే సరికి పాండవులను చంపేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. పాండవశిబిరానికి వెళ్లి, నిద్రిస్తున్న ధృష్టద్యుమ్నుణ్ణీ, ఉప పాండవులనూ హతమార్చాడు.

ఆ విధంగా తండ్రిని అవమానించిన ద్రోణుణ్ణి హతమార్చిన ధృష్టద్యుమ్నుడు, ద్రోణుడి కుమారుడి చేతే హతుడయ్యాడు!

## స్వర్ణోత్సవ సప్తగిరి

స్వర్ణోత్సవ "సప్తగిరీ!"
భక్తకోటి సుధాఝరీ!
ఎన్ని ప్రభాతాలో! నీ నయనంలో...
ఎన్ని ప్రబోధాలో! నీ పయనంలో...

ఆధ్యాత్మికసాధానికి 'హరి'తాక్షర తోరణమా!
అద్వైతానికి పూచిన అచ్చమైన చిరునామా!
ఏబదేండ్ల వయసులోన పదమూనిన సంచికా!
'హిందు'ళం వినిపించిన జీవనాన విపంచికా!
'సప్తగిరీ!' తెలుగు మాసపత్రికా! మతల్లికా!
జాతికి పరిమళమిచ్చిన నిగమాగమ మల్లికా!

తిరుమలదేవుని దీవెన కురిసిన మధువర్షిణీ!
తీరిచిదిద్దిన యాత్రిక సమాచారదర్శినీ!
భారతీయ సంస్కృతిపై ఎగిరిన జయకేతనమా!
పాఠకులను మేల్కొలిపిన తాత్త్విక నవచేతనమా!
అభినందనమిదిగో! అన్నమయ్య కీర్తించెను
హారతులివె! 'సప్తగిరీ!' తెలుగుతల్లి నర్తించెను!!

*– శ్రీ రసరాజు, 62812 99346*




# మనం అనుకుంటే.... సరిపోతుందా?

– శ్రీ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

2014 సెప్టెంబర్ నెలలో తిరుమల వెళ్లి దర్శనం చేసుకున్నాను. ఈ సమయంలో– 'స్వామీ! పరీక్షలు ఏ అవాంతరం లేకుండా జరిగి... సక్రమంగా ఫలితాలు ప్రకటించేలా చూడు స్వామీ!' అని మొక్కుకున్నాను.

ఎందుకంటే నేను కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో చరిత్ర అధ్యాపకులుగా పని చేస్తూ పరీక్షల నిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నాను. అప్పుడు ప్రశ్నాపత్రాలు తెప్పించుకోవడం, ముద్రణ, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల విడుదల వంటివన్నీ కష్టమైన పనులు.. ఏ చిన్నపొరపాటు జరిగినా తీవ్రమైన ఇబ్బందులు కలుగుతాయి. కనుక నేను ఆ రకంగా మొక్కుకుని వచ్చాను.

ఆ తర్వాత అక్టోబర్ మొదలుకుని 2015 ఏప్రిల్ వరకు ఎన్నిసార్లు ప్రయత్నించినా తిరుమలకు వెళ్లడం సాధ్యం కాలేదు. స్వామి అనుగ్రహం లభించలేదని సర్దుకున్నాను. చివరకు అక్టోబర్‌లో 1, 3, 5 మార్చి, ఏప్రిల్‌లలో 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు పూర్తై, ఫలితాలు విడుదల విజయవంతంగా విడుదల చేశాను.

2015 మే 6వ తేది తిరుమలకు వెళ్దామని ముందు రోజు అనుకుని మధ్యాహ్నం బయలుదేరి రాత్రి 9 గం॥లకు తిరుమల చేరుకున్నాం నేను, నా శ్రీమతి.

గది దొరకడం కొంచెం ఇబ్బంది అయింది. ఎట్టకేలకు గది చేరుకుని 'చాలా రోజుల తర్వాత తిరుమలకు రప్పించుకున్నావు. గది దొరికేందుకే ఇంతటి ఇబ్బంది కలిగించావు స్వామీ! మరి దర్శనం ఎలా ఇస్తావో...' అని మనస్సులో అనుకున్నాను.

అంతే! 'స్వామివారి దర్శనానికి డైరెక్ట్‌గా లైన్ వెళ్తూ ఉంది. భక్తులు సద్వినియోగం చేసుకోండి' అనే అనౌన్స్‌మెంట్ వినిపించడంతో సంతోషంతో వైకుంఠం–2 వద్దకు వెళ్తే అరగంటలో దర్శనమైంది. మూడురోజులు తిరుమలలో ఉన్నాం. సుప్రభాతదర్శనం చేసుకున్నాం.

అంతేకాకుండా ర్యాండమ్ కరెంట్‌బుక్కింగ్ అలాట్‌మెంట్‌లో 'నిజపాద దర్శనం' టిక్కెట్లు లభించేలా చేసి దగ్గరకు రప్పించుకుని దివ్యమనోహరంగా దర్శనమిచ్చి ఆశీర్వదించాడు.

మూడురోజులలో ఏడుసార్లు దర్శనమిచ్చి ఏడు నెలలు తిరుమలకు వెళ్లలేకపోయామే అనే బాధను స్వామివారు తొలగించారు.

అప్పుడర్థమైంది నాకు పరీక్షలంటే మధ్యలో వచ్చే సెమిస్టర్ పరీక్షలు కాదు.. సంవత్సరాంతంలో వచ్చే సెమిస్టర్ పరీక్షలే అసలైనవనీ... స్వామివారు ఆ రకంగా అనుగ్రహించాడు అని..!

మరి ఇది ఆ తిరుమల శ్రీనివాసుడి లీలకాక మరేమనాలి?

*"ఓం నమో వేంకటేశాయ!"*

ఆయుర్వేదం

# ఆరోగ్యవజ్రం - ఖర్జూరం

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

పూజలు, నోములు, వ్రతాలు, పుణ్య కార్యక్రమాలు, పెళ్ళిళ్ళు, పేరంటాలులాంటి కార్యక్రమాలలో మంగళ ప్రదంగా భావించి ఖర్జూరాన్ని ప్రాచీనకాలం నుంచి వాడే సనాతన సదాచారం మన భారతీయ సంస్కృతి సంప్రదాయంగా ఉంది.

ఆంగ్లంలో డేట్స్ అని, హిందీలో ఖర్జూర్ అని, శాస్త్రీయంగా "ఫోనిక్స్ డాక్టిలిఫెరా"గా వ్యవహరింపబడే ఖర్జూరం అరకేసి అను వృక్ష కుటుంబానికి చెందింది.

పోషకాంశాలు పుష్కలంగా ఉన్న ఖర్జూరంలో అపారమైన ఔషధశక్తులు కూడా నిబిడీకృతమై ఉన్నాయి.

అతి తక్కువసమయంలో రక్తంలో చేరి త్వరగా శక్తిని ప్రసాదించే ఆహారపదార్థాల్లో ఖర్జూరం ప్రముఖ స్థానం పొందింది.

మన దైనందిన జీవితంలో ఎదుర్కొనే వివిధ అనారోగ్య సమస్యలకు ఖర్జూరం ఎలా పరిష్కారం చూపిస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఉపవాసం తర్వాత తక్షణ శక్తికి-** 100 మి.లీ. నీటిలో రెండుఖర్జూరం కాయల్ని నలగ్గొట్టిన పెచ్చులు, 1-2 గ్రాముల చొప్పున పిస్తా పప్పు, జీడిపప్పు వేసి కొద్దిసేపు నానించి మెత్తగా నూరి 100 మి.లీ. పాలలో కలిపి ఉడికించి తగినంత పంచదార చేర్చి సేవించాలి.

**రక్త వృద్ధికి -** రాత్రి పడుకునే ముందు 100 మి.లీ. నీటిలో రెండు ఎండు ఖర్జూరం కాయలను నలగ గొట్టిన పెచ్చులు, పొట్టు తీసిన 3-4 బాదం పప్పులు, 15-20 వరకు ఎండు ద్రాక్షలు వేసి ఉదయం వాటినన్నింటిని నిమిలి మ్రింగి మిగిలిన నీరు త్రాగుచుండాలి. **సూచన-** బాదం పప్పులను ఒక గంట వేడి నీటిలో నానించి తీసి పొట్టు తొలగించాలి.

**మూత్రం ధారాళంగా వచ్చేందుకు-** రోజూ ఒకటి లేదా రెండుసార్లు 200 మి.లీ. నీటిలో 2-3 ఖర్జూరం కాయలను నలగగొట్టిన పెచ్చులు వేసి 2-3 గ్రాముల ధనియాల చూర్ణం కూడా కలిపి 100 మి.లీ. నీరు మిగిలేలా నీరు మరిగించి, దించి చల్లార్చి వడగట్టి ఆ నీటిని సేవిస్తూ వుండాలి. ఇలా వాడటం వల్ల మూత్రంలో రక్తం రావడం కూడా తగ్గుతుంది.

**సంతానం కలిగేందుకు-** పురుషుడు రోజూ పరగడుపున ఖర్జూరాలు, పిస్తా పప్పు, అక్రోట్, అంజీర, పొట్టు తీసిన బాదం పప్పులను దినుసుకు 1-2 చొప్పున తిని కప్పు గోరువెచ్చని పాలు సేవిస్తుంటే వీర్యవృద్ధి, వీర్యకణాల ఉత్పత్తి బాగా జరిగి ఆరోగ్యవంతమైన వీర్యం తయారై సంతాన అవకాశాలు మెరుగవుతాయి.



**గర్భిణులకు పోషకాహార లోపం లేకుండా-** ఖర్జూరం పెచ్చులపొడి, బాదం పప్పును కొద్దిగా నేతితో వేయించి చేసిన పొడి, ఎండుద్రాక్ష ఒక్కొక్కటి 100 గ్రాములు, ఏలక్కాయల పొడి 20 గ్రాములను తీసుకొని మిక్సీలో వేసి బాగా కలిపి నిలువ ఉంచుకొని రోజూ రెండుసార్లు పూటకి ఒక టీ స్పూన్ పొడిని మరియు తగినంత పటిక బెల్లం పొడిని 100 మి.లీ.ల గోరువెచ్చని పాలలో కలిపి సేవిస్తుంటే గర్భిణులు ఆరోగ్యంగా ఉండడమే గాక, ఆరోగ్యవంతమైన పండంటి శిశువుకు కూడా జన్మనిస్తారు.



హరిదాస వాఙ్మయంలో... **2**

# శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

## నవవిధ భక్తి - దాస్య భక్తి

భక్తి తొమ్మిది విధాలని శ్రీమద్భాగవతము ఇట్లు చెబుతుంది.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం ।
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్" ॥
(శ్రీమద్భాగవతం)

నవవిధ భక్తిలో శ్రవణ భక్తికి పరీక్షితుడు, కీర్తనకు శుకమహర్షి, స్మరణకు ప్రహ్లాదుడు, పాదసేవనమునకు మహాలక్ష్మి, అర్చనమునకు పృథుమహారాజు, వందనమునకు అక్రూరుడు, దాస్యమునకు హనుమంతుడు, సఖ్యమునకు అర్జునుడు, ఆత్మనివేదనమునకు బలి- అయివున్నారు.

ఈ నవవిధభక్తిలో దాస్యభక్తి అత్యంత శ్రేష్ఠతమమైనది. ఈశ దాసభావము మానవుని మనుగడకు ఇహపర సాధనకు, ఐహికాముష్మిక ఫలమునకు చక్కటి వస్తువు.

"స్వతంత్ర మస్వతంత్రంచ ద్వివిధం సమ్మతం" శ్రీమన్మధ్వాచార్యుల ముఖ్యప్రబోధము అదే అయియున్నది. అంతేకాక దాస్య భక్తికి ఉదాహరణము కూడ పై శ్లోకములో 'కపిపతిద్ధాస" కపిపతి అయిన హనుమంతుడే అయియున్నాడు.

వాయుదేవుడు తన మూడు అవతారాలలో కూడ క్రమంగా హనుమ, భీమ, మధ్వాచార్యులుగా రామ, కృష్ణ, వేదవ్యాసులవారి యందు దాస్యభక్తినే చేసియున్నాడు. దాస్య భక్తికి మూల పురుషుడు శ్రీహరియనియే చెప్పవచ్చు. దాస శబ్దము వినయ, వివేక, సౌశీల్యాది సద్గుణములను తెలియజేయు సాంకేతిక పదము.

అంతేకాక సదా సర్వత్రభగవంతుని చూపించే సాధనము కూడ అయియున్నది. అందుకేనేమో భగవంతుడు తన లీలావతారములలో తాను కూడ దాస శబ్దవాచ్యుడై సకల జనులకు మోదమును చేకూర్చుటకే 'మహిదాసాభిదోజజ్ఞే ఇతరాయస్తపోబలాత్' అన్నట్లు మహిదాసుడై యున్నాడు.

"నిరుతనిన్నరమనెయ దాసి ఎనిపళు" ఎల్లప్పుడు నీ భవనమైన త్రిధామములో లక్ష్మీదేవిదాసియైయున్నది. అంతేగాక- సకాలములయందు, సర్వకాలసర్వావస్థల యందు ఆమె కూడ అక్షరశబ్ద వాచ్యురాలై సర్వశక్తిమంతురాలై యున్నప్పటికి నీకు కట్టుబడియున్నానని అంటుంది.

యస్యాం అపాంగలవ మాత్రత ఊర్జితాసా ।
శ్రీయత్కటాక్ష బలవత్యజితంనమామి ॥

అంతేకాక ఆదిత్య పురాణాంతర్గత వేంకటాచల మహత్యంలో శ్రీమహాలక్ష్మి సకల దేవతలు చేయుసేవను చూచి, ఆ సేవలన్నియు తానే చేయ సంకల్పించినదట. శ్రీహరి హృదయనివాసిని అయినప్పటికి ఆమె దాస్యభక్తినే అనుసరించినది.

అంతేకాక శ్రీమన్మాధ్వాచార్యులు ప్రతినిత్యము శ్రీమహాలక్ష్మి భగవంతుని ప్రేమతో వీక్షించి అనురాగంతో సేవించే విధానాన్ని ఎంతో మధురంగా చిత్రముగా కంటికి కట్టేటట్లు మనోగోచర మయ్యేటట్లు ఇట్లు చెప్పియున్నారు.

'ఇందిరా చంచలాపాంగ నీరాజితం మందరో ద్ధారి హృత్యోద్భుజా భోగినమ్' లక్ష్మీదేవి తన కటాక్ష వీక్షణముల చేత కర్పూర నీరాజనమును స్వామివారికి చేయచూ - అతని బాహుబంధమున పంజరములోని చిలుక అయినది.

ఈ వైభావాన్నే పురందరదాసులవారు కూడ –

**కోటకోటి భృత్యరిరలు హాటకాంబరన సేవే**
**సాటి యిల్లదే మాడిపూర్ణ నోటదింద సుఖిసుతిహళు॥**

**ఛత్ర చామర వ్యజన పర్యంక పాత్ర రూపదల్లి నింతు।**
**చిత్ర చరిత నాద హరియ నిత్య సేవే మాడు తిహళు॥**

**... ... ... ... ... ... ... ... ... ... ...**
**... ... ... ... ... ... ... ... ... ... ...**

**పురందర విఠలన్నసేవిసుతిహళు**
**ఏనుధన్యళోల కుమిఎంథామాన్యళో॥**

కోటి కోటి భృత్యులు "బ్రహ్మ రుద్రాదివంద్యంతం" "బ్రహ్మరుద్రాదులు మొదలు ఆస్వామిని సేవించుటకు సిద్ధముగా నుంటే – లక్ష్మిదేవి వారందరికన్న అధికంగా ఆ స్వామిని సేవిస్తూ ఆతనిని పూర్తిగా చూస్తూ సుఖిస్తున్నదట.

అదెట్లనగా ఛత్ర, ఛామర వింజామరములు మొదలగు పూజా సామగ్రులలో నుండి చిత్ర చరితుడైన హరిని నిత్యము సేవిస్తున్న లక్ష్మి ఎంతటి ధన్యురాలు. ఎంతటి మాన్యురాలో గదా అని అంటారు.

## వైకుంఠపాళి
### :: 53- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 శ | తా | 2 నం | దు | 3 డు | | |
| 4 కుం | | క్తి | | ద | | ల్లు | | 5 ము |
| 6 భు | జ | | 7 వ | న | ము | | 8 మా | ద్రి |
| డు | | 9 విం | | ము | | 10 దుం | | క |
| | 11 నం | దు | డు | | 12 దుం | దు | భి | |
| 13 హే | | వు | | 14 పి | | భి | | 15 సం |
| 16 మ | చ్ఛ | | 17 అం | శు | డు | | 18 మా | య |
| మా | | 19 నా | | న | | 20 వే | | మ |
| ల | | 21 తి | రు | ము | త్త | ము | | ని |

లక్ష్మీదేవితో పాటు తారతమ్యానుసారం బ్రహ్మాది దేవతలు కూడా ఈ దాస్యభక్తిని చేసియున్నారు. చతుర్ముఖుడు 'తవదాసోస్మి కేవలం' 'జన్మ ప్రభృతిభిః దాసోస్మి కేవలం' అని అంటాడు.

భావి బ్రహ్మ, దాస్య భక్తికి తార్కాణము అయిన హనుమంతుడు కూడా 'దాసోహం కోసలేంద్రస్య రామస్య క్లిష్ట కర్మణా!' అని తాను కోసల దేశాధిపతియైన శ్రీరామ చంద్రుని దాసునని శత్రువుల ముందు రావణుని సమక్షములో అన్నాడు.

మహాభక్త శిఖామణియైన ప్రహ్లాదుడు కూడ "భూమన్ భ్రమామివదమే తవ దాస్య యోగమ్' దాస్యభక్తినే వేదుకున్నాడు.

"దాసనమాడికొ ఎన్న స్వామి సాసిరనామద వేంకటరమణ" దాసుని చేసుకో నన్ను స్వామి వేనామాల వేంకటేశ్వర అని పురందరదాసులవారు,

'దాస దాస దాసర దాస్యవ కొడు' దాస దాస దాసుల దాస్యమును ప్రసాదించమని విజయదాసుల వారును,

'దాస నెంతెంద మ్యేతె ఘూసి మాడువరె' దాసుడను నేను అని అన్న తర్వాత కూడ ఇంతగా పరీక్షించాలనా స్వామి' అని గోపాలదాసులవారు

'దాసోహం తవ దాసోహం' అని జగన్నాథ దాసులవారు గూడ దాస్యభక్తిని అనుసరించినారు.

'దాస దాస దాసరమనేయ దాసియర మగనాను' 'దాస దాస దాస జనులయింటి దాసపుత్రుడను నేను' అని కనకదాసులవారన్నారు కూడ. *(ఇంకా ఉంది)*

**తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించే ముందు శ్రీవరాహస్వామివారిని దర్శించాలి.**



# వెంగమాంబ వర్ణనల్లో... శ్రీవేంకటేశ్వరుడు

- డా॥ సంగీతం కేశవులు, 90146 57722

తెలుగులో భారతం అంటే కవిత్రయం, భాగవతం అంటే పోతన. అలాగే వేంకటాచలమాహాత్మ్యం అంటే తరిగొండ వెంగమాంబ, అని పూర్వకాలంలో ప్రసిద్ధి. శ్రీ వేంకటాచలమాహాత్మ్యం 6 ఆశ్వాసాల పద్యకావ్యం. ఇది సంస్కృత వేంకటాచల మాహాత్మ్యం, వరాహ, భవిష్య, పద్మపురాణ భాగాల నుండి మూలాన్ని స్వీకరించి వెంగమాంబ ఈ కావ్యాన్ని స్వేచ్ఛగా రచించింది.

ఈ వేంకటాచలమాహాత్మ్యం కావ్యాన్ని అర్హులైన వారికి దానం చేస్తే సకలశుభాలు కలుగుతాయని లోకోక్తి.

తిరుమల క్షేత్రంలో పలు సుందరదృశ్యాలను ఈ కావ్యంలో వెంగమాంబ అద్భుతంగా వర్ణించింది. తిరుమలలో స్వామివారి సన్నిధిలో స్వామి దివ్యమంగళవిగ్రహం ముందునిలిచి ఆనందంతో వర్ణించింది. ఇలా-

'శ్రీమత్పరంధామ! జీవావళిస్తోమ! శ్రీమానినీలోల! శృంగార సల్లీల! కందర్ప లావణ్య కంజోద్భవాగల్యా! షాడ్గుణ సంపన్న! సంరక్షితాపన్న! సత్యవ్రతాచార!! సాధువ్రజోద్ధార! సారాంబుదశ్యామ! సంపూర్ణ సత్కామ! వేదాంత సంచార! విశ్వంభరాధార! శ్రీవేంకటాద్రీశ! సచ్చిత్ ప్రకాశా! పరాకాశ! లోకేశ వాణీశ గౌరీశ నాకేశ వంద్యాంఘ్రిపద్మద్వయా! నిత్య సత్యాఽద్వయా! సద్దయాసాంద్ర! యోగీంద్రహృత్పద్మభృంగా! శుభాంగా! సుచారిత్ర! మిత్రాబ్జనేత్రా! ధరిత్రీకళత్రా! మహోల్లాస! దాసప్రియా! శ్రీనివాసా! మమున్ సత్కృపం జూడుమో తండ్రి! తండ్రీ! తరిగొండవాసా! నృసింహా! హృతాంహా! నమస్తే నమస్తే నమస్తే నమః'.

ఈ భక్తశిఖామణి శ్రీవేంకటేశ్వరుణ్ణి ఈ విధంగా దర్శనభాగ్యతన్మయత్వంతో ప్రార్థించింది. నిరంతరం భక్తి భావంతో స్వామివారిని ఆరాధించిన ధన్యురాలు వెంగమాంబ. ఈమె చెంచునాటకం యక్షగానాన్ని తుంబురకోనలో ఉన్నప్పుడు రచించింది. ఇందులో వెంగమాంబ చేసిన శ్రీవేంకటేశ్వరుని వర్ణన -

వినరన్న! నేఁ జూచు- వేంకటేశ్వరుడు
మినమినమని చాలమెతిసేటి దేమొ

గట్టిగా తలమీఁద గదియించి, దాని
చుట్టు పూదండలు- చుట్టుకొన్నాడు

.... .... .... ....

ఎడమచేతను కత్తి- యిరవందఁ బట్టి
కుడి చేత ధరణి పై- గురి పెట్టినాడు

నల్లని మెయిలు వ- ర్ణము గలఁవాడు
తెల్లనై తగు పట్టె తిరుమణివాడు

కలికిచూపుల గొప్ప- కన్నులవాడు
మొలకనవ్వులవాఁ డు- ముద్దులవాఁ డు

వెంగమాంబ రచించిన యక్షగానకృతుల్లో ఆణిముత్యం విష్ణుపారిజాతం. ఇందులోని వేంకటేశ్వర వర్ణన-

సువ్వి సువ్వి యదుకులేశ! సువ్వి శేషాచలేశ!
సువ్వి సువ్వి జగదధీశ సువ్వాలాలీ!

పరమధర్మానుగుణ్యా! భక్త సంతతి శరణ్యా!
సురుచిరామరాగ్రణ్యా! సువ్వాలాలీ!

విమల పరమ పద విహార వేదవేదాంత సార
సుమహితాంబునిధి గభీర సువ్వలాలీ
శ్రీతరిగొండ నారసింహ! శోషితాంహ! చిత్
జ్యోతి రూప! శ్రీప! భూప! సువ్వలాలీ

వెంగమాంబ విశిష్టకృతియైన శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో శ్రీవేంకటవిభువర్ణన అతి విస్తారంగా సాగింది.

సీ॥ ఆ వేంకటేశ్వరుఁ దరుదుగాఁ గలియుగం
బున ఘన మౌనముద్రను ధరించి,
యచట నర్చావిగ్రహంబు కైవడిగాను
కర్మనేత్రములకుఁ గానవచ్చు
భక్తులతోనైనఁ బ్రత్యక్షముగ మాట
లాడఁడు, స్వప్నంబులందు ఁదగిన
మాట లొప్పగఁ జెప్పు మతి యదేమను వేళ
కవ్వల జుణుఁ గు మాయావి యగుచు
తే॥ మానవులకెల్ల దనయందు మరులు గలుగఁ
జేసి, వారల విత్త మార్జించుకొఱకు
వారి కొక భీతి బుట్టించి, వారిచేత
రూక లొప్పించుకొని, వారిఁ బ్రోచు నవల.

శ్రీవేంకటేశ్వరుని దివ్యపాదయుగళికి వెంగమాంబ సమర్పించిన కమనీయ కృతిస్తుతి శ్రీవేంకటేశ్వర కృష్ణ మంజరి. శ్రీవేంకటేశ్వరుణ్ణి శ్రీకృష్ణునిగా భావించి తన్మయీ భావంతో చెప్పబడినందువల్ల ఈ స్తోత్రం భక్తులలో భక్తి భావాన్ని ప్రబోదించటంలో ప్రభావంతమైన కృతిగా ఈ శ్రీవేంకటేశ్వర కృష్ణమంజరి భావింపబడుతోంది.


ఇందులో అడుగడుగున 'కృష్ణ' సంబోధనలతో పాటగా పాడుకోవటానికి సులభమైన మనోహరమైన శైలిలో వెంగమాంబ లేఖిని నుండి వెలువడ్డ మధురకృతిగా, ప్రతి దినం పారాయణం చేయాల్సిన పవిత్రమైన స్తుతిగా ప్రకాశిస్తూ ఉంది.

శ్రీవేంకటేశ! నా చిత్తంబునందు
నీ పాదయుగళంబు నిలుపవే కృష్ణ!

నన్నేలు తరిగొండ - నరమృగాకృతిని
ప్రత్యక్షమై నన్ను పాలింపు కృష్ణ!
పాపకర్మములు తప్పక చేసి చేసి
బహుజన్మముల నెత్తి బడలితి కృష్ణ!
ఈ జన్మమందైన నేను నీమాయ
గడచెదనన్న శక్యముగాదు 'కృష్ణ'.
హరి! నీ పదాంబుజం బను నావ నిచ్చి
మాయాబ్ధి దాటించి మనుపవే కృష్ణ!
బలసి అ విద్య పాపములు నాచేత
ఉడుగక చేయింపు చున్నదే 'కృష్ణ'
.... .... .... ....
కలనైన నీ మూర్తిగాని యన్యంబు
నేమైనఁ గనిపింప నీయకే కృష్ణ!

ఇలా వెంగమాంబ తన జీవితకాలంలో తను సృష్టించిన సాహిత్యసంపదలో శ్రీవేంకటేశ్వరస్వామిని గురించి అనేక కీర్తనలను, పాటలను, ఆశువుగా సృష్టించింది.

వెంగమాంబ అనునిత్యం శ్రీవేంకటేశ్వర నామమే.. ధ్యాసగా, శ్వాసగా, గతిగా, స్తుతిగా భావించిన భాగవతోత్తమురాలు.



# మహాభారతం సొగసులు-సూక్ష్మాలు

రచయిత - సాకం నాగరాజ, సైజు-1/8 డెమ్మీ, పుటలు-85, వెల- రూ.100/- (పోస్టేజీ రూ.30/- అదనం), ప్రతులకు- సాకం శశికళ, ఇ.నెం.6-1-70, వరదరాజనగర్, తిరుపతి-517 507. ఫోన్-0877-2230135

మహాభారతం భారతీయుల జీవితవేదం. భరత వంశీయరాజుల ఇతిహాసం. అంతమాత్రమే కాదు, భూత భవిష్యద్వర్తమానాల్లో సాగే భారతీయుల జీవనచరిత్ర. ఇంతటి మహోత్కృష్టమైన ఈ భారతగ్రంథం భారతీయ సాహిత్యంలోనే గాక విశ్వసాహిత్యంలో కూడా 'నభూతో నభవిష్యతి'. మహాభారతం మన జీవితంలో రక్తంలా కల గలసిపోయింది. భారతాన్ని ప్రజలు పాటలుగా పాడుకుం టారు. పాండవులకు గుళ్లు కట్టి పూజిస్తారు. ఇక శ్రీకృష్ణ భగవానుణ్ణి అయితే పరిపూర్ణ అవతారమూర్తిగా భావించి, జగద్గురువుగా, గీతాచార్యునిగా, రసరాట్టుగా ఆరాధిస్తారు. 'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి' అని తెలుగువారు మోజుపడి చెప్పుకుంటారు.




ఇంతటి విశిష్టతగల భారతాన్ని ఎందరో పండితులు, రచయితలు, విమర్శకులు తమదైన శైలిలో పరామర్శించి గ్రంథాలుగా ఆవిష్కరించారు. ఈ పరంపరలో వచ్చిన మరో కొత్త పుస్తకం డా॥ సాకం నాగరాజ రచించిన 'మహాభారతం సొగసులు- సూక్ష్మాలు'.

కవిత్రయ విరచిత ఆంధ్రమహాభారతం ఆధారంగా కొన్ని ఘట్టాల్లోని జీవితపాఠాలను నేటి తరానికి పరిచయం చేయడం ఈ పుస్తక ఉద్దేశం. ఈ పుస్తకంలో శకుంతలోపాఖ్యానం, ఏకలవ్యుడి విలువిద్య, కర్ణుడి ఔన్నత్యం, గాంధారి విలాపం వంటి పద్దెనిమిదిఅంశాలు ఉన్నాయి. భారతానికి 18 సంఖ్య నియతంగా వస్తూనే ఉంది. ఇది 1+8=9 అవుతుంది. తొమ్మిది అక్షయ సంఖ్య. స్వతంత్రసంఖ్య. ఈ తత్త్వాన్ని గ్రహించే రచయిత డా॥ సాకం నాగరాజ ఇందులో నన్నయ, ఎర్రన, తిక్కన భారతభాగాల్లోని వృత్తాంతాలు స్వీకరించి కవిత్రయానికి వందనాలర్పించారు.

సాకంనాగరాజ ఇప్పటికే సామాజికస్ఫూర్తిదాయకాలైన రచనలు ఎన్నో గ్రంథాలుగా వెలువరించి సంకలనకర్తగా ఎంతో పేరు తెచ్చుకుని ఉన్నారు. ఇప్పుడు స్వతంత్ర రచయితగా కూడా ఈ పుస్తకంతో మన ముందుకొచ్చారు.

ప్రౌఢమైన భారతాన్ని నేటి విద్యార్థినీ విద్యార్థులకు అందించాలి, అందులోని ధర్మసూక్ష్మాలు వాళ్లు గ్రహించాలనే ప్రయత్నంతో నాగరాజ ఈ రచనకు పూనుకున్నారు. పీఠికలో 'ఎందుకీ భారతం?' అనే శీర్షికలో 'లోక కల్యాణానికి కంకణం కట్టుకున్న శ్రీకృష్ణుడు', 'ధర్మానికి కాపుకాచిన ధర్మరాజు...' ఇలా ఒక్కొక్క వాక్యంలోనే మొత్తం పుస్తకాన్ని పరిచయం చేశారు. భారతంలోని పాత్రలు నిజానికి ఆనాటి పాత్రలే కావు, నేటి భారతంలో ప్రపంచమంతటా నిత్యం మనం చూస్తున్నవే!- అన్నమాట పరమసత్యం.

మొదట 'శకుంతలోపాఖ్యానం' గ్రహించి, అవతారిక వంటి ఒక పేరాలో ఉపాఖ్యాన నేపథ్యాన్ని తెల్పి, తర్వాత సంగ్రహంగా పరిచయం చేసి, చివరలో శకుంతలను, దుష్యంతుణ్ణీ పేర్కొని, శకుంతల దుష్యంతునితో మాట్లాడిన తీరు, ఆమె తెలివితేటలు, కార్యసాధకత్వం వివరించారు. మాటలు తక్కువే అయినా, అవే ఆమె కార్యసాధనకు కారణాలై, ఆశయ సిద్ధికి దోహదాలయ్యాయి.

మొత్తం 18 శీర్షికలూ ఇదే విధానంలో కన్పిస్తాయి. వాక్యాల పొందికలో సాకంగారు సిద్ధహస్తులనే సంగతి ఈ పుస్తకాన్ని చదివితే తెలుస్తుంది. ఆంధ్రభారతంలోని వాక్యాలే తీసుకొన్నట్లున్నా- తీరా చూస్తే అదంతా రచయిత స్వీయరచనే అన్పిస్తుంది.

పద్యానికంటే గద్యం (వచనం) రాయటం కష్టమనే మాట లోకంలో ఉన్నా సాకం నాగరాజ సరళమైన భాషలో భారతంలోని సొగసులూ, సూక్ష్మాలూ సమకూర్చి తన నేర్పరితనాన్ని ప్రదర్శించి, విజయులయ్యారు. తెలుగు భాషాప్రియులందరూ చదువదగ్గ పుస్తకమిది. 'ప్రాచీన సాహిత్యంలో ఏముంది?' 'అంతా పాతచింతకాయ పచ్చడి' అనే వాళ్లకు ఈ పుస్తకం చదివితే- ఆ పచ్చడి ఎంత ఆరోగ్యకరమో, చైతన్యప్రదమో, ధార్మికస్ఫూర్తిదాయకమో తెలుస్తుంది. సాకం నాగరాజ ద్వారా ఇలాగే రామాయణ, భాగవతాల్లోని సొగసులూ- సూక్ష్మాలూ కూడా సమాజానికి చేరుతాయని ఆశిద్దాం!

*- డా॥ కంపల్లె రవిచంద్రన్.*

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-03

నిర్వహణ - మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్

## संयुक्ताक्षराणि (సంయుక్తాక్షరాణి)

| | | | |
|---|---|---|---|
| क् + क = क्क | క్ + క = క్క | ख् + प = ख्प | ఖ్ + ప = ఖ్ప |
| क् + ख = क्ख | క్ + ఖ = క్ఖ | ख् + य = ख्य | ఖ్ + య = ఖ్య |
| क् + ट = क्ट | క్ + ట = క్ట | ख् + र = ख्र | ఖ్ + ర = ఖ్ర |
| क् + त = क्त | క్ + త = క్త | ख् + व = ख्व | ఖ్ + వ = ఖ్వ |
| क् + थ = क्थ | క్ + థ = క్థ | ग् + ग = ग्ग | గ్ + గ = గ్గ |
| क् + न = क्न | క్ + న = క్న | ग् + घ = ग्घ | గ్ + ఘ = గ్ఘ |
| क् + प = क्प | క్ + ప = క్ప | ग् + द् = ग्द | గ్ + ద = గ్ద |
| क् + म = क्म | క్ + మ = క్మ | ग् + ध = ग्ध | గ్ + ధ = గ్ధ |
| क् + य = क्य | క్ + య = క్య | ग् + न = ग्न | గ్ + న = గ్న |
| क् + र = क्र | క్ + ర = క్ర | ग् + ब = ग्ब | గ్ + బ = గ్బ |
| क् + ल = क्ल | క్ + ల = క్ల | ग् + भ = ग्भ | గ్ + భ = గ్భ |
| क् + व = क्व | క్ + వ = క్వ | ग् + म = ग्म | గ్ + మ = గ్మ |
| क् + ष = क्ष | క్ + ష = క్ష | ग् + य = ग्य | గ్ + య = గ్య |
| क् + स = क्स | క్ + స = క్స | ग् + र = ग्र | గ్ + ర = గ్ర |
| ख् + थ = ख्थ | ఖ్ + ధ = ఖ్ధ | ग् + ल = ग्ल | గ్ + ల = గ్ల |
| ख् + न = ख्न | ఖ్ + న = ఖ్న | ग् + व = ग्व | గ్ + వ = గ్వ |

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక మాసపత్రిక)



## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

2. కావలసిన భాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

3. సంవత్సర/జీవిత చందా :
రూ.60/- ☐ రూ.500/- ☐

4. చందా పునరుద్ధరణ :
(అ) చందా నెంబరు :
(ఆ) భాష :

5. చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. :
తేది :
(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.


3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

53

# వైకుంఠపాళి



నిర్వహణ శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

1)జనకమహారాజు పురోహితుడు(5); 6)అగ్ని(2); 7)అడవి(3); 8)పాండురాజు రెండవభార్య(2); 11)ధృతరాష్ట్రుని సంతానంలో ఒకడు(3); 12)మయుని కుమారుడు(3); 16)చంద్రునిలో ఇది ఉంది(2); 17)ద్వాదశాదిత్యుల్లో ఒకడు(3); 18)శ్రీమహా విష్ణువు సహచరి(2); 21)దేవాలయము(5)

### నిలువు

1)ఇంద్రుడు కర్ణునికి ఇచ్చిన అస్త్రము(2); 2)ఇంద్రుని ఉద్యాన వనము(4); 3)రాలిపోవు(2); 4)కుంభకర్ణుని కొడుకు(3); 5)అంగుళీయకమే(3); 9)దానంజేయువాడు(3); 10)తెలుగు సంవత్సరాల్లో ఒకటి(3); 13)యముని భార్య(4); 14)కాకి(4); 15)యముని పట్టణము(4); 19)స్త్రీ(2); 20)వేపను ఇలా అంటారు.(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

## భక్తుల సేవలో....

# ఆపదసమయంలో ఆనందనిలయుడు..



శ్రీ వై.వి. సుబ్బారెడ్డి,
అధ్యక్షులు,
తి.తి.దేవస్థానములు

కరోనా పంజాతో యావత్ ప్రపంచం విల విల్లాడుతున్న సంక్లిష్ట సమయమిది. మానవాళికి పెనుసవాల్ విసిరిన కరోనా కరాళనృత్యం ప్రపంచదేశాలను వణికిస్తోంది. ఈ విపత్తువేళ ప్రపంచంలోనే అతి పెద్ద హిందూ ధార్మిక సంస్థ అయిన తిరుమల తిరుపతి దేవస్థానం ఎన్నో పారమార్థిక కార్యక్రమాలతో పాటు మానవసేవే మాధవ సేవ అనే సూక్తిని అక్షరాలా పాటిస్తూ సర్వేజనాస్సుఖినో భవంతు అనే సనాతన ధార్మిక ఆచరణను తు.చ. తప్పక పాటిస్తోంది.

### టీటీడీ ముందుచూపు

కరోనా విపత్తును ముందుగా ఊహించి సరైన చర్యలు తీసుకోవడంలోనూ, భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడటంలోనూ తి.తి.దే. తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. ఇందులో భాగంగా మార్చి 17 నుంచి టైమ్ స్లాట్ టోకెన్లు జారీ చేసింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, 2లలో భక్తులు వేచి ఉండే పనిలేకుండా నేరుగా అనుమతించడం జరిగింది. కొండపైన ప్రతి రెండు గంటలకోసారి అన్ని ప్రదేశాలను శానిటైజేషన్ చేయించింది.

కరోనా నియంత్రణలో భౌతికదూరం పాటించడం కీలకం కాబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డితో సంప్రదించి తిరుమలకు భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్చి 19న ప్రకటించింది. మార్చి 20 ఉదయం ఆర్జితసేవా భక్తులకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించి, కొండపై ఉన్న భక్తులందరికీ వీలైనంత వరకు దర్శనం కల్పించాక అందరినీ కొండ నుంచి తిరుపతికి తీసుకువచ్చేశారు. ఆరోజు నుంచి తిరుమలేశుని సేవలన్నింటినీ ఏకాంతంగా ఆగమోక్తంగా తి.తి.దే. నిర్వహిస్తోంది.

అదే సందర్భంలో లాక్‌డౌన్ వేళ తిరుమలేశుని దర్శించుకోలేమనే బాధ లేకుండా ప్రతిరోజూ శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్ (ఎస్వీబీసీ) ద్వారా తిరుమలేశుని కల్యాణోత్సవాన్ని, తిరుచానూరు అమ్మవారి కల్యాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. అలాగే లక్షలాది భక్తుల మధ్య జరిగే ఒంటిమిట్ట శ్రీసీతారామస్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రాంగణానికే పరిమితం చేసి, శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసింది.



### రోగాలను అరికట్టే యాగాలు!

కరోనా గండం నుంచి గట్టెక్కాలని భావించిన తి.తి.దే. మార్చి 26 నుంచి 28వ తేదీ వరకు శ్రీ శ్రీనివాస శాంత్యుత్సవ సహిత ధన్వంతరి మహాయాగాన్ని మూడు రోజులపాటు తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో ఘనంగా నిర్వహించింది. శ్రీనివాస వేదమంత్ర ఆరోగ్య జపయజ్ఞాన్ని తిరుమలలోని ఆస్థానమండపంలో మార్చి 16 నుంచి 25వ తేదీవరకు వైభవంగా నిర్వహించింది. ఇందులో చతుర్వేదాలను, పంచశాఖలను, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వేదపండితులు శ్రీనివాస వేదమంత్ర ఆరోగ్య జపయజ్ఞ మంత్రాలను పఠించారు.



ఇక లోకక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ

యోగవాశిష్టం, శ్రీధన్వంతరి మహామంత్ర పారాయణం తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఏప్రిల్ 10వ తేదీన ప్రారంభించారు. ఇందులో భక్తులు కూడా భాగస్వాములు



కావడం విశేషం. ఎస్వీబీసీలో ప్రత్యక్షప్రసారం చేయడం వల్ల పండితులు చెప్పిన మంత్రాలను భక్తులు టీవీల ముందు కూర్చుని పఠిస్తున్నారు.

## మానవసేవే మాధవసేవ

కరోనా, లాక్‌డౌన్ గడ్డు పరిస్థితులను ఎదుర్కొం టున్న తిరుపతి, పరిసర ప్రాంతాల్లోని వేలాదిమంది నిరాశ్రయులకు, వలస కూలీలకు ప్రతినిత్యం 1,20,000 ఆహార పొట్లాలను అన్నప్రసాద విభాగం ద్వారా తయారు చేసి అందించారు.



దీంతోపాటు గోశాలల్లో వేలాదిగోవులను సంరక్షిస్తున్న తి.తి.దే. తిరుపతిలో సుమారు 500 వీధిశునకాలకు



ఆహారం సరఫరా చేసింది. రోడ్ల మీద తిరిగే పశువుల కోసం తిరుపతిలోని అలిపిరి లింక్ బస్టాండ్ వద్ద తాత్కాలిక పశువుల శాలను ఏర్పాటు చేసింది. రోజుకు సుమారు 3 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం, 300 కిలోల దాణాను తి.తి.దే. సరఫరా చేసింది.

తి.తి.దేవస్థానం తన ఆయుర్వేద పరిశోధనలలో భాగంగా కరోనా కట్టడికి 'రక్షజ్ఞ ధూపం' (క్రిమిసంహారక ధూపం), 'పవిత్ర' (చేతులు శుభ్రపరచుకునే ద్రావకం), 'గండూషకము' (పుక్కిలించే మందు), 'నింబనస్యము' (ముక్కులో వేసుకునే చుక్కల మందు), 'అమృత' (వ్యాధి నిరోధక శక్తిని పెంచే మాత్రలు) అనే ఐదు రకాల మందులు తయారు చేసింది. ఈమేరకు 200 మంది వంట సిబ్బందికి ఈ మందుల పంపిణీ జరిగింది.



## కరోనాపై యుద్ధానికి 19 కోట్లు

స్విమ్స్ ఆసుపత్రిని పూర్తిస్థాయి కరోనా ఆసుపత్రిగా మార్పు చేసింది. స్విమ్స్ ఆవరణలోని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో రాష్ట్రస్థాయి కరోనా ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఇందులో వెంటిలేటర్లు, ఇతర వైద్య సామగ్రి కొనుగోలుకు, వసతుల కల్పనకు 19 కోట్లు తి.తి.దే. మంజూరు చేసింది. కరోనా సహాయక చర్యల కోసం టీటీడీ ఆధ్వర్యంలోని తిరుచానూరులో గల పద్మావతి నిలయాన్ని, అలాగే తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, మాధవం విశ్రాంతి గృహాలు, రెండోసత్రం చిత్తూరుజిల్లా అధికార యంత్రాంగా నికి టీటీడీ అప్పగించింది.

## ఎస్వీబీసీ ద్వారా చైతన్యం

తిరుమల తిరుపతి దేవస్థానములు శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్ ద్వారా శ్రీవారి కల్యాణోత్సవాన్ని, కొండపై జరుగుతున్న హోమాలను ప్రత్యక్షప్రసారం చేసింది. అలాగే కోవిడ్-19 నియంత్రణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక సూచనలతో కూడిన కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేసింది. నిత్యకల్యాణం పచ్చతోరణమనే నానుడికి ఏ మాత్రం భంగం కలగకుండా తిరుమలను పచ్చతోరణంలా ఉంచడానికి తి.తి.దే. అమోఘమైన కృషి చేస్తూనే ఉంది.

ఓం నమో వేంకటేశాయ



Edited and published on behalf of T.T.Devasthanams by Dr. K.Radha Ramana, M.A., M.Phil., Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., Dy. E.O., (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.



## అంతర్జాతీయ విపత్తు నుండి కరోనావైరస్ వ్యాప్తి కట్టడిలో భాగంగా విధించిన లాక్‌డౌన్‌లో నిరాశ్రయులైన వలసకూలీలకు, మూగజీవాలకు తి.తి.దే దేవస్థానం ఆహారం వితరణ చేస్తున్న దృశ్యం














SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 25-05-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742.
Postal Regd.No.TRP/10- 2018-2020, Licensed to post without prepayment
No.PMGK/RNP/WPP-04/2018-2020

